చాకిరేవు పద్య కావ్యం : భాష, సాహిత్యాల అనుశీలన

(ఎం.ఫిల్ పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం)

పరిశోధకురాలు

రేచర్ల స్వాతి

19HTHL03

పర్యవేక్షకులు

ఆచార్య పమ్మి పవన్ కుమార్

తెలుగు శాఖ

మానవనీయశాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు - 500 046

cākirēvu padya kāvyaṁ: bhāṣa, sāhityāla anuśīlana

A Dissertation Submitted to the University of Hyderabad

in Partial Fulfillment of the Degree of

Master of Philosophy in Telugu

by

RECHARLA SWATHI

19HTHL03

Supervisor

Prof. Pammi Pavan Kumar

Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad - 500 046

Telangana, India

CERTIFICATE

This is to certify that the dissertation entitled **cākirēvu padya kāvyaṁ: bhāṣa, sāhityāla anuśīlana** Submitted by Ms. **RECHARLA SWATHI** bearing **Reg. No:19HTHL03** in partial fulfillment of the requirements for the award of **Master of Philosophy in Telugu** is a bonafide work carried out by her under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other university or institution for the award of any degree or diploma.

Prof. Pammi Pavan Kumar

Research Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

DECLARATION

I, **RECHARLA SWATHI** here by declare that this dissertation entitled **cākirēvu padya kāvyaṁ: bhāṣa, sāhityāla anuśīlana** Submitted by me under the guidance and supervision of **Prof. Pammi Pavan Kumar** is my bonafide research work and is free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma. I here by agree that my dissertation can be deposited in **shodganga/ INFLIBNET.**

RECHARLA SWATHI

Date: Reg. No:19HTHL03

విషయ సూచిక

కృతజ్ఞతలు **8**

అధ్యాయం-1

1. ఊట్ల కొండయ్యగారి జీవితం, రచనలు **9-21**

1.1 పరిచయం 11

1.2 బాల్యం 11

1.3 క్రీడానైపుణ్యం 11

1.4 నాటకరంగ ప్రవేశం 12

1.5 కవిత్వారంభ దశ 12

1.6 సాహిత్య పఠనం 14

1.7 కాటూరితో అనుబంధం 14

1.8 సంకల్పబలం 16

1.9 ఉద్యోగ జీవితం 17

1.10 పద్య కవిత్వం 20

1.11 రచనల జాబితా 21

అధ్యాయం - 2

2. చాకిరేవు కావ్యం: ఇతివృత్తం, పాత్ర చిత్రణ **22-41**

2.1 పద్యకావ్య ప్రస్తావన 23

2.2 ఇతివృత్తం 27

2.3 చాకిరేవు కావ్యంలోని పాత్రలు 29

2.3.1 శివయ్య 33

2.3.2 గంగమ్మ 35

2.3.3 సంతానం 36

2.3.4 ప్రాసంగిక పాత్రలు 37

2.3.4.1 లచ్చువమ్మ 37

2.3.4.2 పేరమ్మ 38

2.4 తాత్వికాంశాలు 41

అధ్యాయం - 3

3. కవి దృక్పథం 42-51

3.1 సంస్కరణ దృక్పథం 48

3.2 కులమత దృక్పథం 49

3.3 మానవతా దృక్పథం 51

అధ్యాయం - 4

4. చాకిరేవు కావ్యం: ఛందస్సు, భాషా విశేషాలు 52-71

4.1 ఛందస్సు 53

4.1.1 ఉత్పలమాల 53

4.1.2 చంపకమాల 54

4.1.3 శార్దూలం 54

4.1.4 మత్తేభం 55

4.1.5 ఆటవెలది 56

4.1.6 కందం 56

4.1.7 తేటగీతి 57

4.2 అలంకారాలు 58

4.2.1 శబ్దాలంకారాలు 58

4.2.1.1 వృత్యనుప్రాసాలంకారం 58

4.2.1.2 అంత్యానుప్రాసాలంకారం 59

4.2.2 అర్థాలంకారాలు 59

4.2.2.1 ఉపమాలంకారం 59

4.2.2.2 ఉత్ప్రేక్షాలంకారం 60

4.3 భాషా విశేషాలు 60

4.3.1 సంధులు 62

4.3.1.1 అత్వసంది 62

4.3.1.2 ఇత్వసంధి 62

4.3.1.3 ఉత్వసంధి 63

4.3.1.4 త్రికసంధి 63

4.3.2 సమాసాలు 64
4.3.2.1 ద్విగు సమాసం 64
4.3.2.2 విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం 65
4.3.2.3 సంభావన పూర్వపద కర్మధారయ సమాసం 65
4.3.2.4 షష్ఠీ తత్పురుష సమాసం 65
4.3.2.5 నఞ తత్పురుష సమాసం 65
4.3.2.6 ద్వంద్వ సమాసం 66
4.3.2.7 బహువ్రీహి సమాసం 66
4.3.3 సామెతలు 66
4.3.4 నుడికారం 68
4.3.5 లోకరీతి వాక్కులు, విశిష్ట పద ప్రయోగాలు 70
4.3.6 'స్త్రీ'ని సూచించే పదాలు 71
అధ్యాయం - 5
5. చాకిరేవు కావ్యం: జాతి వార్తా చమత్కారాలు 72-90
5.1 జాతావార్తా చమత్కారాల పరిచయం 76
5.1.1 జాతి 78
5.1.1.1 చాకిరేవు కావ్యంలోని జాతి వర్ణన 80
5.1.2 వార్త 82
5.1.2.1 చాకిరేవు కావ్యంలోని వార్తా చిత్రణ 84
5.1.3 చమత్కారం 84
5.1.3.1చాకిరేవు కావ్యంలోని చమత్కారం 87
5.2 ఆలంకారిక చమత్కారం 87
5.3 శబ్ద చమత్కారం 88
5.4 సామాజికాంశాలు 90
ఉపసంహారం 91
ఉపయుక్త గ్రంథసూచి 93

కృతజ్ఞతలు

తాము చదవకపోయినా ఆ చదువును నాకందివ్వడం కోసం, నా అభివృద్ధిని కాంక్షించి నిరంతరం చెమటోడ్చి కష్టపడే నా తల్లిదండ్రులకు, అన్ని రకాలుగా సహాయ సహకారానందించే మా అక్క, బావగారికి నా ధన్యవాదాలు. పరిశోధనాంశ ఎన్నికలో నా అభిరుచికి ప్రాధాన్యమిచ్చి ఎప్పటికప్పుడు సందేహ నివృత్తి చేస్తూ పరిశోధనపై సరైన అవగాహనను కల్పించేలా విలువైన సలహాలు, సూచనలు అందించిన మా గురువర్యులు, పితృతుల్యులు, నా పర్యవేక్షకులైన ఆచార్య పమ్మి పవన్‌కుమార్ గారికి ధన్యవాదాలు.

నా పరిశోధనకు సలహా బృంద సభ్యులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, ఆచార్య పిల్లల మర్రి రాములు గారికి, అలాగే నాకు విద్యా జ్ఞానాన్నందించిన తెలుగు శాఖ గురువులు ఆచార్య ఎస్ శరత్ జోత్స్నారాణి గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య జి అరుణకుమారి గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య గోనానాయక్ గారికి, ఆచార్య డి విజయలక్ష్మి గారికి, డా.డి.విజయకుమారి గారికి నా ధన్యవాదాలు.

తెలుగు శాఖ సిబ్బందైన బాలాజీ గారికి, మధు గారికి, సంజీవ గారికి, పుస్తక సేకరణలో తమ సహాయాన్నందించిన ఇందిరాగాంధీ మెమోరియల్ హైద్రాబాద్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సిబ్బందికి, టైపింగ్‌లో తమ సహకారాన్నందించిన ఉదయ్ సార్‌కి ఈ పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ పేరు పేరునా నా కృతజ్ఞతలు.

మొదటి అధ్యాయం

అధ్యాయం - 1
ఊట్ల కొండయ్యగారి జీవితం, రచనలు

1.1 పరిచయం:

'ఊట్ల కొండయ్య యను నీత దుద్భవించె

గణపతియు మహాలక్ష్మియన్ కర్మఠులకు

ఆంధ్రరత్న బోధామృతమంది ధన్య

మైన చీరాల పేరాల యనెడు పురిని' (నిర్వేదం: పద్యం: 50, పుట: 16)

'చీరాల పేరాల' పేరు వినగానే స్వాతంత్రోద్యమ కాలంలోని చీరాల పేరాల ఉద్యమం స్ఫురణకు వస్తుంది. 1920లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చీరాల,పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా ప్రకటించింది. అప్పటి వరకు పంచాయితీ పరంగా నాలుగు వేలు ఉన్న పన్ను కాస్తా రూ.40 వేలకు పెరిగింది. దీన్ని స్థానిక ప్రజలు అంగీకరించలేదు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మున్సిపాలిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవనెత్తారు. తన బోధనలతో ప్రజలను ఉత్తేజపరచి పుర బహిష్కరణకు మొగ్గు చూపారు. కేవలం ఒక వ్యక్తి పిలుపు మేరకు ఊరు ఊరంతా ఖాళీ చేసి వెళ్లడమనేది స్వాతంత్రోద్యమంలో ఒక మైలురాయిగా నిలిచింది.

అలా చరిత్రకెక్కిన చీరాల పేరాల జంట గ్రామాల్లో ఒకటైన పేరాలలో ఒక సామాన్య నిరుపేద (పద్మశాలి) కుటుంబంలోని గణపతి, మహాలక్ష్మి దంపతులకు 09.04.1918న ఊట్ల కొండయ్య గారు జన్మించారు. కొడుకు పుట్టిన రెండవ ఏటనే తండ్రి గణపతి మరణించారు. అప్పుడు తల్లి మహాలక్ష్మీ వయస్సు 20 సంవత్సరాలు మాత్రమే. భర్త మరణించగానే పుట్టింటి మార్గం పట్టలేదు. పుట్టెడు దు:ఖాన్ని దిగమింగింది. భర్త రూపాన్ని కొడుకులో చూసుకొని తృప్తి చెందింది.

'పూరి ఇల్లయినగాని అదియె దివమాయె

ఆమె పాలిటి దివ్య హార్మ్యమ్మునాయె' (మృత్యుమాత: పద్యం19: పుట: 4) అన్నట్లు దుర్భర దారిద్ర్యమే ఆస్తిగా ఉన్నా కుంగిపోకుండా, ధైర్యంగా ముందడుగు వేసి భర్త కులవృత్తినే (బట్టలు నేయడం) తన వృత్తిగా మలచుకుంది.

'ప్రమిచ మగ్గముగుంట దేహమదితైల

మగుచు దీపకళిక పుత్రుడగుచు నుండి

ఊట్ల వంశము వెలిగించు యోగమూని' (మృత్యుమాత: పద్యం: 17: పుట:4)

కుమారుణ్ణి పేరాల రాజగోపాలం వీధి బడిలో వేసింది.

1.2.బాల్యం:

తండ్రి మరణానంతరం ఊట్ల కొండయ్యను అతని పిన్ని బాబాయిలు ఆదరించారు. బాబాయి రాఘవులు, పిన్ని భ్రమరాంబలు తమతో పాటు బర్మాదేశం తీసుకొని వెళ్లారు. బర్మాలోని యమేథిన్ కోర్టులో రాఘవులుగారు పనిచేసేవారు. పదినెలల తర్వాత 1926వ సంవత్సరంలో కొండయ్య తిరిగి పేరాలకు చేరుకున్నారు.

అంతకుముందు చదివిన పేరాలలోని రాజగోపాలం వీధి బడిలోనే చేరి నాల్గవ తరగతి వరకు చదివారు. సాయంత్రం సమయంలో పాఠశాల విడిచే ముందు ఎక్కాలు చెప్పేవారు. దాంతో పిల్లలందరికీ తమకు తెలియకుండా చిన్న ఎక్కాలు 10 వరకు కంఠస్తమయ్యేవి. పెద్ద ఎక్కాలు మూడు, నాల్గవ తరగతులకు చెప్పేవారు. కొండయ్య కూడా చిన్న ఎక్కాలు పెద్ద ఎక్కాలు ఏ మాత్రం తడుముకోకుండా చెప్పేవారు.

నాల్గవ తరగతిలో ఇంగ్లీషు విద్య అక్షరాభ్యాసంతో ప్రారంభమయ్యేది. రాత అక్షరాల్లో చిన్నవి, పెద్దవి అన్నింటిని నేర్పేవారు. పాఠ్య పుస్తకాల్లో చిన్న చిన్న ఇంగ్లీషు పదాలు, వాటికి తెలుగు అర్థాలుండేవి. Twinkle Twinkle Litltle Star లాంటి బాలగేయాలుండేవి. అక్షరాలను చక్కగా రాయించేవారు. వీధిబడిలో పెద్ద బాలశిక్ష చదివించడంతో పిల్లల లోకజ్ఞతకు మంచి పునాది ఏర్పడేది. గురువులు చెప్పిన క్రమం ప్రకారం కొండయ్య అన్నీ నేర్చుకొన్నారు.

1.3 క్రీడానైపుణ్యం:

చీరాల మున్సిపల్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నప్పుడు సబ్ జూనియర్స్ విభాగంలో జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించారు. అంతేకాక వంద మీటర్ల పరుగు, హైజంప్‌లలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేవారు.

పేరాల గ్రామంలో 'సర్వమిత్ర వ్యాయామ సంఘం' పేరు మీద సాముగరిడీలు, వ్యాయామం, సర్కసు విద్యలు నేర్పే సంస్థ ఒకటుండేది. దానిలో చిన్న గ్రంథాలయం భాగంగా ఉండేది. ఈ సంస్థల్లో తన బాల్యం నుంచి కొండయ్య సభ్యులుగా ఉంటూ సంస్థ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. దండేలు, బస్కీలు, హరిజాంటల్ బార్, పార్లల్ బార్, కుస్తీ, బాణా కర్ర తిప్పడం, పట్టా కత్తి తిప్పడం లాంటి సాముగరిడీలు, తీగపై నడవటం లాంటి వాటిని పెద్దలతో పాటు సులభంగా చేసేవారు.

1.4 నాటకరంగ ప్రవేశం:

ఆ రోజుల్లో చిన్న పిల్లందరూ కలిసి 'అశ్వథ్థామ పరాభవం' అనే నాటకాన్ని ప్రదర్శించారు. అందులో కొండయ్య ద్రౌపది వేషం వేశారు. ఇరుగు పొరుగు వారు చీరలు, ధోవతులు ఇచ్చి ప్రోత్సహించారు. నాటకం బాగా రక్తికట్టి ప్రజల మన్ననలను పొందింది. ఆ అభిమానంతో నాటకాన్ని రెండవసారి ప్రదర్శించాలన్న ప్రజల కోరిక మేరకు మళ్ళీ నాటకాన్ని ప్రదర్శించారు. కొండయ్య గారి హావభావాలు, ద్రౌపది వేషంలో ఆయన అభినయానికి ముగ్దుడై బంగారు వస్తువులు తయారు చేసే 'బాషా' అనే ముస్లిం అతనికి వెండి పతకాన్ని బహుకరించాడు.

1.5 కవిత్వారంభ దశ:

కొండయ్యగారు థర్డ్ ఫారంలో ఉండగా మాస్టార్లు ఛందస్సును నేర్పడం ప్రారంభించారు. అదే క్రమంలో కొండయ్య చిన్న చిన్న పద్యాలల్లడం మొదలుపెట్టారు. ఉపాధ్యాయులు బదిలీ అయినప్పుడల్లా వారిపై వీడ్కోలు పద్యాలు రాసి చదివేవారు. చిన్నతనంలో చీరాల పేరాల రోడ్లపై పచారు చేస్తూ సాయంత్రాల్లో వంగవోలు ఆదిశేషయ్యతో కలిసి 'కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల కాదేదీ కవితకనర్హం' అన్నట్లు ఏ వస్తువు కనిపిస్తే దాని మీద ఆశువుగా కవితలల్లేవారు.

చీరాల్లో తరచూ అష్టావధానాలు జరుగుతుండేవి. అన్నింటిలోనూ కొండయ్యను పృచ్ఛకుడిగా పిలిచేవారు. ఒక అవధానంలో 'మానము పోయెడి నటంచు మగనిం బిలిచెన్' అని కొండయ్య సమస్యనిస్తే నిక్కరు వేసుకున్న బాలుడు ఈ సమస్యా బాణాన్ని సంధించాడా అని సభలో గొల్లున నవ్వారు. 1931–1932ల మధ్య కాలంలో గూడవల్లి రామబ్రహ్మం నడుపుతున్న 'సమదర్శిని' పత్రికలోనూ, 'గృహలక్ష్మి' పత్రికలోనూ కొండయ్య గారి పద్యాలు, గేయాలు ప్రచురితమయ్యాయి.

1.6 సాహిత్య పఠనం:

చీరాల మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో అక్కడ నారపరాజు సీతారామయ్యగారనే సీనియర్ ఆంధ్రోపాధ్యాయులున్నారు. ఉభయ భాషా ప్రవీణుడైన ఆయన దగ్గర శబ్దాలు,సుందరకాండ లఘుకౌముది వంటి వాటిని నేర్చుకున్నారు.

20వ శతాబ్ది ప్రథమార్ధంలో సంస్కృత విద్యాభ్యాసానికి విజయనగరం కేంద్రంగా ఉండేది. అందువల్ల 1935 సంవత్సరంలో కొండయ్య గారు విజయనగరం సంస్కృత కళాశాలలో చేరారు.

"విజయనగరమ్ము పోయి ప్రవిష్టుడాయె

నంత సంస్కృత విద్యాలయమ్ము నందు

నట తదాస్థాన కవి కవితాధినేత

భోగరాజు నారాయణమూర్తి గొలిచె" (నిర్వేదం: పద్యం: 68: పుట: 22) అని చెప్పుకున్నారు. భోగరాజు నారాయణమూర్తి విజయనగర సంస్థానంలో ఆస్థానకవి. నౌరోజ్, అల్లాహోఅక్బర్ మొదలైన గొప్ప నాటకాలు రాశారు. వీరు రచించిన 'విమలాదేవి' కి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారు ప్రకటించిన తొలి నవలా పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. అలాంటి గొప్ప సాహిత్యాచారుని దగ్గర కొండయ్య ఆంధ్రమహాభారతంలోని ఆది, సభా పర్వాలను నేర్చుకున్నారు.

జాతీయోద్యమ కాలంలో మహాత్మాగాంధీ అనేక ప్రాంతాలను పర్యటించి తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్యవంతులుగా చేస్తున్నారు. సహజంగానే దేశభక్తి కల్గిన కొండయ్యగారు ప్రభావితుడై 1936 ఏప్రిల్‌లో ఆచార్య రంగా గారి 'రైతాంగ విద్యాలయం' అనే రాజకీయ పాఠశాలలో చేరాడు. 1933 లో గాంధీ హరిజన యాత్ర చేసిన సందర్భంలో ఈ పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు. అప్పటికి కొండయ్య వయసు 18 సంవత్సరాలు.

వి.వి.గిరి లాంటి దేశ నాయకులెందరో వచ్చి ఆయా విషయాలపై పాఠాలు చెప్పేవారు. సర్దార్ గౌతులచ్చన్న, పి.తిమ్మారెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి తదితరులు కొండయ్య సహాధ్యాయులుగా ఉండేవారు. వివిధ దేశాల రాజకీయ విధానాలు, భారత స్వాతంత్రోద్యమం గురించి నాయకులు వివరించేవారు. నలభై రోజుల్లో రాజకీయ పాఠశాల ముగిసింది. 'చక్కని కవితాభినివేశం గలవాడు' అని కొండయ్యనుద్దేశించి భోగరాజు నారాయణమూర్తి ఒక లేఖ రాసి ఇచ్చారు. ఆ లేఖ తీసుకొని కొండయ్య సంతోషంతో మచిలీపట్నం వెళ్ళి ఆంధ్రవిద్యాపీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంధ్ర జాతీయ కళాశాల అనే గురుకులంలో చేరారు. ఆ కళాశాలకు అడవి బాపిరాజుగారు ప్రిన్సిపల్‌గా వ్యవహరించేవారు.

కంటికి కనిపించని దృశ్యాలను కలంతోనూ, మాటలకందని భావాలను కుంచెతోనూ వర్ణించేవారు. అందుకే వారు కవుల్లో చిత్రకారుడు, చిత్రకారుల్లో కవి అని పేరు పొందారు. నండూరి వారు ఎంకిని, విశ్వనాథ కిన్నెరసానిని, కృష్ణశాస్త్రి ఊర్వశిని, మునిమాణిక్యం నరసింహారావు కాంతాన్ని సృష్టిస్తే అడవి బాపిరాజు శశికళను మనకు పరిచయం చేశారు.

చారిత్రక, సాంఘిక నవలా రచనల్లో సవ్యసాచిగా రాణించారు. కవిగా, గాయకునిగా, చిత్రకారునిగా, నాట్యాచార్యునిగా, కళాదర్శకునిగా, పత్రికా ప్రతినిధిగా, నవలాకారునిగా, కథకునిగా, వక్తగా అనేక రంగాల్లో ప్రజ్ఞావంతునిగా గుర్తింపు పొందారు.

1933లో హరిజనయాత్ర సందర్భంగా గాంధీజీ గ్రామ పునర్నిర్మాణ విద్యకు ప్రారంభోత్సవం చేశారు. ఈ కళాశాలలో హిందీ అధ్యాపకులుగా రాజగోపాల కృష్ణయ్య, చరిత్ర, రాజకీయ శాస్త్రాధ్యాపకునిగా మానికొండ సత్యనారాయణ శాస్త్రి పనిచేసేవారు. వీరే కాక మహాకవి కాటూరి వెంకటేశ్వరరావు ఇదే కళాశాలలో పనిచేసేవారు. వీరు కొండయ్యకి భారతం మొదలు ఆనాటి భావ కవిత్వం వరకు గల పురాణ ప్రబంధ కావ్యనాటకాదుల్ని, అప్పటి వరకు తెలుగులో వెలసిన మాలపల్లి లాంటి గొప్ప నవలల్ని పరిచయం చేశారు. అంతేకాక సంస్కృత కావ్య నాటకాల్ని వివరించారు.

'పింగళి కాటూరి ఇరువురూ జంట కవులు. నాకంటే నా శిష్యులు రసవత్తరంగా కవిత చెప్పగలరనటానికి సౌందరనందం ఒక గీటురాయి కాగలదన్నారు' చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి. అలాంటి మహానుభావునికి ప్రియశిష్యుడు ఊట్ల కొండయ్య. గురుకులం కావడంతో అధ్యాపకులందరూ కొండయ్యను ఎంతో మక్కువతో చూసేవారు.

1.7 కాటూరితో అనుబంధం:

కాటూరి అధ్యాపకుడైనా కొండయ్యపై తండ్రిలాగా వాత్సల్యం చూపేవారు. అందువల్ల కొండయ్య కాటూరిని 'నాన్నగారు' అని పిలిచేవారు. లోకం దృష్టిలో వీరు గురుశిష్యులు. కాని నిజజీవితంలో తండ్రి కొడుకుల్లా మెలిగేవారు. సెలవుల్లో కాటూరి కొండయ్యను తన స్వగ్రామమైన కాటూరికి వెంటబెట్టుకు పోయేవారు. తమ పొలం, తోటలు చూపించేవారు. 50 ఎకరాల మాగాణి వారిది. ఆ రోజుల్లో పల్లెటూళ్లలో కులబేధాల పట్టింపులు ఎక్కువగా ఉండేవి. అయినా కాటూరి కొండయ్యను తన పక్కనే కూర్చోబెట్టుకుని భోజనం పెట్టించేవారు.

1.8 సంకల్పబలం:

ఓ సారి తన తల్లిని చూడాలని కొండయ్యకి సంకల్పం కలిగింది. సాయంత్రం బందరు నుండి విజయవాడ వెళ్లే రైలులో వెళ్లాలి. చేతిలో చిల్లిగవ్వ లేదు. అయినా అధైర్యపడలేదు. చేతిలో సంచీ పట్టుకొని బయలుదేరాడు. ఆ సంచీలో ఒక అంగవస్త్రం, మరో తుండుగుడ్డ, గోచీ, భారతం ఆది, సభా పర్వాలున్నాయి. అలా ఆ సంచీని ఒక చేత, గొడుగు మరో చేత పట్టుకొని తలవంచుకుని నడుస్తూ ఉంటే కళాశాల ఆవరణలో కాటూరి ఎదురువస్తూ రెండు రూపాయలు ఇచ్చారు. డబ్బులెందుకిస్తున్నారని కాటూరిని ఆయన ప్రశ్నించగా 'నాయనా! మీరు అవధూతలు, మేము గృహస్థులం. ఇది మా కర్తవ్యం' అంటూ వెళ్లిపోయారు. కొండయ్య చాలా ఆశ్చర్యపడ్డాడు. నిజానికి బందరు నుండి చీరాలకు రైలు టిక్కెటు ధర సరిగ్గా రెండు రూపాయిలే. కాటూరి వారు ఆ రెండు రూపాయిలు ఇవ్వకుంటే కొండయ్య నడిచిపోవాల్సిన పరిస్థితి వచ్చేది. కాని అతను కోరకుండానే డబ్బు వచ్చింది. ఇలా తనకేదైనా కావాలనిపిస్తే ఎవరో ఒకరు తమంతతాముగా సహాయపడేవారు.

కాటూరి ఇచ్చిన రెండు రూపాయలు తీసుకొని రైల్వేస్టేషన్ చేరుకొని రైలెక్కారు. 'గుండెగొంతుకలోన కొట్లాడుతాది' అని నండూరి అన్నట్లు ఏవో చెప్పలేని భావాలు గేయాల రూపంలో వెలవడుతున్నాయి.

"ఎవరో నీవెరవో

ఎవరవో నీవెవరవో

కొండమీదే వుండి నవ్వే

చిన్ని చెక్కా చెప్పవానా ॥ఎవరవో॥

వాసనలతో విచ్చి పిలిచే

చిన్నిపూవా చెప్పవా నా ।ఎవరవో॥

చీకటంతా చీల్చిపాడే

చిన్నిగొంతా చెప్పవా నా ॥ఎవరవో॥" (పరిణతవాణి: పుట: 114) అనే ఓ పాట అప్రయత్నంగా కొండయ్యగారి నోటి వెంట వెలువడింది. దీంతో కొండయ్యగారు గేయరచనకు శ్రీకారం చుట్టినట్లైంది. కాటూరి క్లాసుల్లో రవీంద్రుని గీతాంజలి, తాత్విక ప్రబంధాలు తరచూ విన్పించడం వల్ల వాటి ప్రభావంతో

చాలా గేయాలు రాయగలిగారు, రాయడమేకాక వాటిని కూనిరాగంతో పాడేవారు. ఆ పాటలన్నీ దార్శనిక ప్రణయ గేయాలే. ఈ పాటల సంగతి గమనించిన కాటూరి ఒక సారి కృష్ణ పత్రిక దర్బారు సమయంలో కొండయ్య పాటలు రాస్తాడని ప్రకటించారు.

ముట్నూరి కృష్ణారావు నవ్వుతూ పాడమన్నారు. వారి ఆజ్ఞను శిరసా వహించి కొండయ్య గేయమాలపించారు. మరుసటి వారం కృష్ణాపత్రికలో కొండయ్య రాసిన పాటలు 'చిరంజీవి పాటలు' శీర్షికతో వెలువడ్డాయి. 1940 ప్రాంతంలో ప్రతిభ సంచికల్లోనూ చిరంజీవిపాటలు కొన్ని వెలువడ్డాయి. 'చిరంజీవి పాటలు' 1945లో గ్రంథ రూపంలో వెలువడ్డాయి. ముట్నూరి కృష్ణారావుగారి వద్ద కొండయ్యగారు ఉ పనిషత్ పాఠాలు నేర్చుకొన్నారు.

1.9 ఉద్యోగ జీవితం:

కొండయ్యగారి వేషం, ఆహార విహారాలు చూసి తల్లి బాధపడింది. అది గమనించిన కొండయ్య ఏదైనా ఉద్యోగం చూసుకోవాలనుకున్నారు. కాని తనకు తగిన అర్హతలు లేవు. ఆ కాలంలో డిగ్రీలు లేని పాండిత్యం పత్రికలవారికి మాత్రం పనికివచ్చేది. అందువల్ల ఉన్నవ లక్ష్మీనారాయణగారి సాయంతో 'దేశాభిమాని' అనే పత్రికలో సహ సంపాదకునిగా చేరాడు. అదే సమయంలో 'క్విట్ ఇండియా' ఉద్యమం చెలరేగింది. విద్యార్థులు, కార్మికులు, కర్షకులు తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. పోలీసు ఠాణాలు, పోస్టాఫీసులు తగులబెట్టారు. టెలిఫోన్ తీగలు తెంచేశారు.

కొండయ్య కూడా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కలక్టరేట్‌లో ఒకరోజు రాత్రి టెలిఫోన్ తీగలు తెంచడానికి ప్రయత్నిస్తూ చాలా ఎత్తు నుండి కింద పడ్డారు. దాంతో ఎడమకాలు తొంటి విరిగింది. పోలీసులకు భయపడి స్వగ్రామమైన పేరాల చేరి చికిత్స చేయించుకున్నారు. కాని పూర్తిస్థాయిలో నయం కాలేదు. 1947 స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రారంభమైన 'చేనేత' వారపత్రికలో పనిచేయాల్సిందిగా ప్రజాబంధు ప్రగడ కోటయ్యగారు కొండయ్యగారిని కోరారు. వారి మాటల ప్రకారం నిడుబ్రోలు వెళ్లి వర్కింగ్ ఎడిటర్‌గా పనిచేశారు.ఆ పత్రికలో 'పిచ్చాపాటి' అనే రాజకీయ పరిహాసం పద్యాలు వారం వారం రాసేవారు.

కొండయ్య రాసిన ఈ శీర్షికలు ప్రముఖుల మెప్పు పొందాయి. ఆ తర్వాత గుంటూరు వెళ్ళి ప్రగడ కోటయ్యగారి సహకారంతో 'భారత్' అనే పత్రికను నడపడానికి యత్నించారు. అది రెండు నెలలు నడిచి ఆగిపోయింది. అటుపైన విజయవాడలోని కేంద్ర చేనేత సహకార సంఘంలో పబ్లిసిటీ అసిస్టెంటుగా చేరారు. రెండేళ్లు పనిచేసి ఆ ఉద్యోగం మానుకొని దేశికవితా మండలి వారికి రచయితగా పనిచేశారు. అప్పటి వరకు తెలుగులోకి రాని అండర్‌సన్, బర్మా, దక్కన్ జానపద, చైనా కథలు తెలుగులోకి అనువదించారు. బాల సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలు తెలుగులోకి తీసుకు వచ్చారు.

1956లో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 'నేత' పత్రిక సంపాదకుడిగా వ్యవహరించాల్సిందిగా కోరగా కొండయ్యగారు హైదరాబాదుకు వచ్చారు. అక్కడ రెండేళ్లు పనిచేసి హైదరాబాదు రేడియో స్టేషనులోని గ్రామీణ శాఖలో స్క్రిప్టు రైటరుగా చేరారు. జరత్కారువు, ప్రమద్వర లాంటి నాటకాలను రచించారు. ఈ నాటకాలు హైద్రాబాదు నుండే కాక మద్రాసు స్టేషను నుండి ప్రసారమయ్యాయి. ఆకాలంలోనే ప్రభాకర్జీ గాంధీజీకి సంబంధించిన సంఘటనలను చిన్న చిన్న కథల రూపంలో రాయగా వాటిని 'గాంధీపథం' పేరిట సుమారు రెండు సంవత్సరాలు ఆంధ్రపత్రిక దినపత్రిక ప్రచురించింది. అవి పాఠకులను విశేషంగా ఆకట్టుకొని అనంతరం గ్రంథ రూపంలో వెలువడింది.

1960లో కొండయ్యగారి తల్లి మహాలక్ష్మి స్వర్గస్థురాలైంది. ఎకరంన్నర పొలంలో ఆమె పేర తులసికోట కట్టించారు. అంతేక కొంతకాలం వ్యవసాయం చేశారు. నష్టమే తప్ప లాభం రాలేదు. దాంతో 1963లో కృష్ణాపత్రికలో చేరి 3500 ఉన్న పత్రిక సర్కులేషన్‌ని 8500 కి వృద్ధి చేశారు. తర్వాత 'ఆంధ్రజనత' ,'బహుజన' వార పత్రికల్లో సంపాదకునిగా చేరి ఒక సంవత్సరం పాటు పనిచేశారు. అన్నింటిలో విసిగిపోయి చివరకు ఊళ్లో ఉన్న భూమిని విక్రయించి హైదరాబాదులో చిన్న ప్రెస్‌కొని జీవయాత్ర సాగించారు.

1.10 పద్య కవిత్వం:

1989లో ఒకరోజు భగవాన్ సత్యసాయికి సంబంధించిన కరపత్రం ఒకటి మధ్యాహ్నం సమయంలో పోస్టులో వచ్చింది. మరు నిమిషంలో అప్రయత్నంగా ఈ క్రింది పద్యం స్ఫురించిందట.

"శరణము సత్యసాయికి ప్ర
శాంతి వదస్థనకున్ ప్రసన్నతా
కరునకు లోకపూజ్యునక
ఖండకృపా పరతంత్ర పర్తికిన్,
గురునకు సృష్టిలోన తన
కున్ ప్రతిబింబము చూచువానికిన్,
శరణము సత్యజీవ భయ
శంకల తీరిచి బ్రోచు స్వామికిన్" (పరిణతవాణి: పుట: 121) ఇలా రాత్రి పది గంటల వరకు 19 పద్యాలు రాశారు. ఈ పద్యాలు మొదటి ఖండ కావ్యమైన 'వానవచ్చె వరదవచ్చె' లో వెలువడ్డాయి. రెండవదిగా 1990లో 'చాకిరేవు' అనే కావ్యం రచించారు. ఈ కావ్యానికి గాను తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారం పొందారు. అంతేకాక కోరుట్ల (భారతీ సాహిత్య సమితి) వానమామలై వరదాచార్య పురస్కారం, 'కవిపితామహ' బిరుదు గ్రహించారు. మూడవది "ప్రకృతి పురుషుడు" అనే కావ్యం. ఇది సాంఖ్యశాస్త్ర ఇతివృత్తాన్ని కలిగివున్న కావ్యం.

ఈ కావ్యం ప్రథమోల్లాసంలో పురుషుని విరహకారత్వం, సంవామ ప్రాశస్త్యం, అంతర్ముఖత్వం వర్ణించబడ్డాయి. ద్వితీయోల్లాసంలో పురుషుని మాటల్లోనే ఆ విరహకారత్వంతో పాటు అతను చేసిన సాంత్వనమూ, అందులో వారి గతంలోని ప్రేమానువర్తనం కలిసి ఉండి, కైవసం చేసుకోవాల్సిన సౌఖ్యాల కలలు, పిల్లల మీద ప్రేమ వద్దు అనడం పతివ్రతాతత్వమా! అనడం కనిపిస్తాయి. తృతీయోల్లాసంలో పురుషుని వాక్యాల్లో ఆమెకోప వర్ణన, అందులో జలప్రళయం, అగ్ని విజృంభణ, గాలి తాకిడి, మళ్లీ ఆమె సౌమ్య స్వభావం వర్ణించబడ్డాయి.

చతుర్థోల్లాసంలో పురుషుడే తమ కుమారుడైన నరుడు చెడిపోతున్నాడని చెప్పుకుంటున్న బాధ కనిపిస్తుంది. పంచమోల్లాసంలో భారతదేశంలో పురుషుడు అనేక ఆశలు పెట్టుకుంటాడు. మన భారత భూమి ఒక యోగి, అన్నపూర్ణ, మహాత్మా, సత్యభూమి, ఆనంద శివ స్వరూపమంటారు. మంచి కాలం కోసం ప్రకృతిని ఎదురుచూస్తూ సంతోషంగా కాలం గడపమంటారు. ప్రకృతి పురుషులకు చాలా కాలానికి సంతానం కలిగింది. పుట్టిన నరుణ్ణి ప్రేమతో పెంచి పెద్ద చేసి ఈ భూమినంతా వాని చేతుల్లో పెడుతుంది ప్రకృతి. వాడు మద మత్సర కామ శోకాకుల గంధ కలుషాత్మకమౌ వికృతి స్వరూపంగా మారుస్తాడు. కొండయ్యగారు

ఈ పాత్ర ద్వారా ఈనాటి భయంకర పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు. అడవులను నరికివేస్తున్నారు. పండ్లు, పూలు లేక ఎక్కడ చూసినా పచ్చదనమే లేకుండా మారిపోయింది ప్రపంచం. నాగరికత పేరిట మనం అనుసరిస్తున్న విధానాలు, చేపడుతోన్న ఆనాలోచిత చర్యల ఫలితంగా వాయుకాలుష్యం, జల కాలుష్యం, ఉష్ణోగ్రతలో పెను మార్పులూ, కరువు కాటకాలు వంటి వాటిని చవి చూస్తున్నాం. వంట చెరుకు కోసం, కలప, నివాస స్థలాల కోసం వ్యవసాయ భూముల కోసం అడవులను విచక్షణా హితంగా నరికివేయడం ఈ పర్యావరణ సమస్యలకు ప్రధాన కారణమైందని తెలియజేసారు.

నాల్గవది 'నావలెన్' (చాటువులు) కావ్యం. ఈ కావ్యంలో 201 పద్యాలున్నాయి. శృంగారం, హాస్యం, వ్యంగ్యం, చమత్కారం, రాజకీయాలు, కుటుంబ విషయాలు మొదలుగునవి ఎన్నో ఉన్నాయి. నాయకులు నీతి గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంటుందని తన ప్రతి కావ్యంలో నాయకుల నీచ గుణాలను తూర్పారబట్టారు. ఐదవది లోకుల భ్రష్టుత్వాన్ని చూడలేక ఒక వృద్ధకవి పెట్టుకున్న మొర ఇతివృత్తంగల 'మృత్యుమాత'. ఈ కావ్యం కన్నరుణానికి కానుకగా తల్లి మహాలక్ష్మికి అంకితమిచ్చారు.

ఆరవది భారతీయ సంస్కృతిని ఉద్ఘాటించే *'యుగయుగమ్ముల భారతీయుడ నేను'* కావ్యం. ఈ కావ్యంలో 16 పర్వాలున్నాయి. అవి.

1. అవతారికా పర్వం	2. ఆత్మీయ పర్వం	3. మాతృ పర్వం	4. స్వప్న పర్వం
5. ఆశయ పర్వం	6. ప్రకృతి పర్వం	7. జీవన పర్వం	8. నిర్వేద పర్వం
9. జిజ్ఞాస పర్వం	10. కుల మత పర్వం	11. అనుభవ పర్వం	12. మహిళా పర్వం
13. కావ్య పర్వం	14. దార్శనిక పర్వం	15. యోగ పర్వం	16. గార్హస్థ్య పర్వం

అవతారిక పర్వంలో కవి జన్మస్థలం, మాతృ, గురు ప్రసక్తి, కవితా ప్రాశస్త్యాలను వివరించారు. ఆత్మీయ పర్వంలో సత్యం, అహింసలను గుఱ్ఱాలుగా మార్చి శాంతి అనే రథంపై మానువుల్ని కూర్చుండబెట్టి ఆ రథాన్ని నడిపిన మహాత్మా గాంధీ శిష్యుణ్ణంటాడు కవి. అమ్మ త్యాగ నిరతిని గురించి మాతృ పర్వంలో తెలియజేశారు. ఆశయ పర్వంలో కోప, తాప, పాప శాపాలను శాంతి అనే సముద్రంలో నిమజ్జనం చేస్తానంటారు. తాను మానవకులం వాణ్ణనీ, తన తల్లి భారతాంబ అని ప్రకటించుకున్నారు.

మహిళా శ్రేయస్సుకు పాటుపడతానంటూ ఆమె చల్లని దీవెనలుంటే లోకం చల్లగా ఉంటుందంటాడు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకూ వంటావార్పు మొదలైన పనులు చేస్తూ మైమరచే నారీమణులకు చేయెత్తి నమస్కరిస్తానంటారు. ఇటువంటి భావననే చాకిరేవు కావ్యంలో శివయ్య గంగమ్మతో పలికినట్లు చెప్పాడు.

ఏడవది *'గృహిణి'* ఆయా పరిస్థితుల్లో ఉత్తమ ఇల్లాలు ఎలా ప్రవర్తిస్తుందో తెలిపే మనోహరమైన 18 కథల కావ్యమిది. దీనిలోని ప్రతి వృత్తాంతంలో గృహిణి ఔదార్యం, ప్రేమ, కరుణ కనబడతాయి. స్త్రీలు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని అయితే విశృంఖలత్వం పనికిరాదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజానికి అవసరమైన, ఉపయోగకరమైన పనులు నిర్వర్తిస్తూనే భర్త పట్ల గౌరవం, పిల్లల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని ఆశించారు. స్వేచ్ఛ కాముకత్వం పట్ల వైముఖ్యాన్ని పద్యాల్లో తెలియజేశారు. ఒకానొక స్వైరిణి దుశ్చేష్టలను గమనించి పురుషుడు ఆమెకు శీల ప్రాధాన్యాన్ని వివరిస్తారు. ఎనిమిదవది *'నిర్వేదం'*. భారతదేశ స్వాతంత్రానంతరం పరిస్థితుల గురించి తెలిపే పద్య కావ్యమిది. తొమ్మిదవది *'భగవనాన్ సత్యసాయి శతకం'*. సత్య సాయిబాబా మహాత్మ్యాన్ని చూసి తాదాత్మ్యం చెంది రాసిన శతకమిది.

పై రచనలేకాక బాల సాహిత్యానికి సంబంధించి *'స్వయం సహాయం'*, *'గాంధీజీ'* (వచనం), *'స్కూలుకి పోతున్నాను నేను'* అనే 27 చతుర బాలగేయ సంభాషణలు, *'ఎర్రయ్య చెప్పిన హాస్యకథలు'* మొదలైనవి రచించారు.

రచనలే కాక కొండయ్యగారు కవి సమ్మేళనాల్లో పాల్గొనేవారు. రేడియో ప్రసంగాలు చేశారు. ప్రముఖులపై ప్రశంసా పద్యాలు రాశారు. పింగళి–కాటూరి పీఠం నెలకొల్పారు. ప్రసిద్ధ కవుల గ్రంథాలను ఈ పీఠం ద్వారా ముద్రించి సాహితీ జిజ్ఞాసువులకు పంచారు.

వృద్ధాప్యంలో రచన ఆరంభించిన ఆయన బాల్యం నుంచే కావ్యాలు రాయటం మొదలుపెడితే ఒక చెళ్లపిళ్ల, ఒక ముట్నూరి, ఒక కాటూరి, బాపిరాజు వరుసలో కొండయ్య పేరు వచ్చి ఉండేది. అయినప్పటికీ గాంధేయవాదిగా దేశభక్తునిగా, పాత్రికేయుడిగా, మానవతావాదిగా, ప్రజ్ఞాపాటవం గల ప్రసిద్ధ కవిగా ఊట్ల కొండయ్య తన ప్రత్యేకతను నిలుపుకున్నారు.

1.11 రచనల జాబితా :

I.బాల సాహిత్యం (1952-1956)

1. తాతా తాటాకు బుట్ట	దేశికవితా మండలి ప్రచురణలు
2. గ్రీమ్స్ కథలు. రెండు సంపుటాలు	"
3. అండర్‌సన్ కథలు	"
4. దక్కన్ జానపద కథలు	"
5. అమెరికన్ అధ్యక్షులు కథలు. జార్జ్ వాషింగ్టన్	"
6. వియత్నాం కథలు. 1956-1958	"
7. ఈజిప్టు కథలు	"
8. జపాన్ కథలు	"
9. చిలిపి చిన్నయ్య	"

10. స్కూలికి పోతున్నా నేను. 1994 కాటూరి కవితా పీఠం. హైద్రాబాద్.

II.పద్య కావ్యాలు

1. వానవచ్చె వరదవచ్చె (ఖండ కావ్యం.1989)	పింగళి-కాటూరి సాహిత్య పీఠం
2. చాకిరేవు 1990	"
3. ప్రకృతి పురుషుడు 1990	"
4. నావలెన్ చాటువులు 1991	"
5. మృత్యుమాత 1992	"
6. యుగయుగమ్ముల భారతీయుడనేను 1993	"
7. ప్రతిబింబాలు 1993	"
8. గృహిణి 1993	"
9. నిర్వేదం 1993	"
10. భగవాన్ సత్యసాయి శతకం 1996	"

III వచన రచనలు

1. గాంధీపథం 1966
2. ఎర్రయ్య చెప్పిన హాస్య కథలు- వివరణ 1984
3. స్వయం సహాయం గాంధీజీ 1991

రెండవ అధ్యాయం

అధ్యాయం - 2
చాకిరేవు కావ్యం : ఇతివృత్తం, పాత్ర చిత్రణ

2.1 పద్యకావ్య ప్రస్తావన

ఆధునిక యుగంలో పద్యం ఖండ కావ్యాల ద్వారా బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. ప్రసిద్ధ భావకవులైన దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యదనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, వేదుల సత్యనారాయణ మొదలగు వారు చక్కని రచనలు చేశారు. పద్యం నాజూకుగా తయారైంది. ఆధునిక యుగంలో పద్య రచన చేసిన ప్రముఖులలో గుర్రం జాషువా, గడియారం వేంకట శేషశాస్త్రి, దుర్భాక రాజశేఖర వధాని, దాశరథి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, జంధ్యాల పాపయ్య శాస్త్రి, ఎస్.టి జ్ఞానానందకవి మొదలైన వారు ఎన్నదగినవారు. వీరి పద్య నిర్మాణంలోనూ, నిర్వహణలోనూ నవ్యత్వం గోచరిస్తుంది.

పద్యమైనా, వచనమైనా చెప్పే విషయం ప్రధానం. ఈనాటి పద్య సంపుటాలు, కావ్యాలు వాస్తవ సమాజ స్వరూపాన్ని చిత్రించే ప్రయత్నం చేస్తున్నాయి. సంప్రదాయ భావాలు కలిగిన కొందరు కవులు పద్య ఖండికల సంకలనాల్ని వెలయించారు. వారిలో పుట్టపర్తి నారాయణాచార్యులు, వానమామలై వరదాచార్యులు, కోవెల సంపత్కుమారాచార్యులు, వేముగంటి నరసింహా చార్యులు మొదలుగువారు ప్రసిద్ధులు. కొందరు కవులు స్వత్వంత్ర ధోరణితో, అనుభూతి గాఢతతో, సామాజిక సమస్యల నేపథ్యంతో పద్య కవితా సంకలనాలను వెలయించారు. వారిలో తుమ్మపూడి కోటేశ్వరరావు, బోయి భీమన్న, ఉత్పల సత్యనారాయణాచార్యులు, కోవెల సంత్కుమారాచార్యులు, బేతవోలు రామబ్రహ్మం, ఊట్ల కొండయ్య మొదలైన వారు చెప్పుకోదగ్గవారు.

2.2 ఇతివృత్తం

ఊట్ల కొండయ్య గారి పద్య కవిత్వంలో వచ్చిన రెండవ కృతి చాకిరేవు కావ్యం. మొదటిది వానవచ్చె-వరదవచ్చె. యవ్వనంలో వచన రచన మాత్రమే చేసిన కొండయ్య, ప్రౌఢ వయసులో పద్య కవిత్వం రాయడం మొదలు పెట్టారు. అలాగని ఇది శ్రమపడి పదాలు కూర్చిన, గణాదులు పేర్చిన కవిత్వంకాదు. ఏడు పదుల జీవిత పోరాటం నుంచి ఎగసి పైకుబికిన సహజ కవితా ప్రవాహం.

"ఔదును నేను కొండయనె, ఐన సృజించినదేవిఝ తాతనై
పోదునె? ప్రొద్దుక్రుంకకయెమున్ను, త్వరం గగనెంచి, అష్టక
ష్టాదుల కగ్గమై ఉదయ మందిన పద్యకవిత్వమిద్ది, నీ
కాదర బుద్ధితో పరిణయమ్మున నిచ్చితి కావ్యకన్యకన్" (చాకిరేవు: పద్యం:13: పుట 7)

ఏ సాహిత్య రూపానికైనా ముడి సరుకు సమాజమే. మానవుల జీవిత సంఘర్షణలు, సంబంధ–బాంధవ్యాలు, భావోద్వేగాలు, అనుభూతులు, సుఖ–దు:ఖాలు, రాజకీయ–ఆర్థిక–సాంస్కృతిక సమస్యలు మొదలైన వాటన్నింటి సమన్వయ సమాహారమే సమాజం. సమాజంలో జరిగే రాజకీయ, ఆర్థిక, సాంఘిక, చారిత్రక, ఆధ్యాత్మిక, తాత్విక, మార్పులకు, పరిణామాలకు వివిధ వ్యక్తులు సృష్టించే అక్షర రూపమే సాహిత్యం. సాహిత్య రచనకు సమాజ స్థితిగతులు దోహదపడుతాయి. కనుక సాహిత్యం సమాజానికి ప్రతిబింబంగా నిలుస్తుంది. సమాజాన్ని, సాహిత్యాన్ని ఒకదానితో ఒకటి పోల్చి చూస్తే సమాజం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుందా? సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుందా? అనే ప్రశ్నలు ఎదురవుతాయి. మంచి సాహిత్యం కోసం సమాజం, మంచి సమాజం కోసం సాహిత్యం నిరంతరం పాటుపడుతూ ఉంటాయని ఎందరో సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. కనుక సమాజ, సాహిత్యాలు పరస్పరం ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిశీలించినపుడు రెండు విషయాలు ప్రస్ఫుటంగా ద్యోతకమవుతాయి. ఒకటి వ్యవహారిక భాషలో రచన, రెండు – ఇతివృత్తంలో సామాజిక జీవితం. గురజాడ పేర్కొన్నట్లుగా "పుష్కలమైన, అనంతమైన సంఘటనలతో నిండి వున్న ఎంతో గాంభీర్యమూ, వైవిధ్యమూ గల నేటి జీవితాన్ని వీక్షించక ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన ప్రాచీన కాల్పనిక కథకల నుంచి రచయితలు ఎందుకు ఇతివృత్తాలు స్వీకరిస్తారో అర్థంకాక నాకు ఆశ్చర్యం వేసింది. ఈ కారణాల వల్ల నేను వాస్తవ జీవితం నుంచి ఇతివృత్తాన్ని స్వీకరించి దానిని తెలుగు వాడుక భాషలో నాటకంగా రూపొందించాను." (కన్యాశుల్కం ఒక అపూర్వసృష్టి: పుట: 186). "దీనితో సాహిత్యం దేవతల కథల నుండి, రాణుల ప్రేమగాథల నుండి, రాజుల సాహస కృత్యాల నుండి భూమి మీదకు దిగివచ్చి జీవితాన్ని చిత్రీకరించడం ప్రారంభించింది."(యుగకర్త శ్రీశ్రీ: పుట: 16). ఈ పరిచయం కొండయ్య గారికి కూడా సరిపోతుంది. అష్టకష్టాల నుండి ఉదయించిన కవనమని, పొద్దుకూకక మునుపే తన అనుభవసారాన్ని అందరికీ పంచుతానని స్వయంగా కవే ఈ కావ్యాంలో చెప్పుకున్నారు.

చాకిరేవు దగ్గర ఒకనాటి మధ్యాహ్నం నుంచి సాయంత్ర సమయం వరకు గంగమ్మ, శివయ్య దంపతులు చేసిన పనుల వరుస ఈ కావ్యానికి ఇతివృత్తం. ఇందులో కథ ఏమి ఉంటుంది? ఏమీ లేనిదానిలో నుండి కవిగారు చిన్న కథను అల్లారు. కథైతే చిన్నదే కాని కల్పన విశిష్టమైంది. 'మడివేలు' అనే పేరుతో కవతాకల్పకంలో ఉండేల మాలకొండా రెడ్డిగారు చాకలిపై రాసిన పద్యాలను చదివి ఊట్ల కొండయ్య వారు ఆనందించారట. ఆ పద్యాలను చదివి స్ఫూర్తిపొంది 'చాకిరేవు' పద్య కావ్యాన్ని వెలయించారు. చాకిరేవు కావ్యాన్ని ఉండేల మాలకొండారెడ్డికి అంకితమిచ్చారు.

కవిగారు ఈ కథను నేరుగా చెప్పలేదు. చాకిరేవు చేత చెప్పించారు. అది తరతరాలుగా గ్రామీణ రజక వృత్తికి ఆలవాలంగానూ, ఆ వృత్తివారి కష్ట సుఖాలకు సాక్షీభూతంగానూ ఉంది. అందుకే కవి చాకిరేవుతోనే కథను చెప్పించి ఎంతో ఔచిత్యాన్ని పాటించారు.

కావ్య ప్రబంధాదులను ఆశ్వాసాలుగా విభజించడం సంప్రదాయం. అయినప్పటికీ ఈ కావ్యంలో కొండయ్యగారు వారి గురువులైన పింగళి కాటూరి కవివర్యుల *సౌదర్యనందం* లోని పద్ధతిని పుణికిపుచ్చుకొని ప్రకరణ విభాగం చేసి వాటికి పేర్లు పెట్టారు. కావ్యంలో మొత్తం ఏడు ప్రకరణాలున్నాయి. చాకిరేవులో మొదటి ప్రకరణం ఉపోద్ఘాత ప్రాయమైన ***జనవాక్యం,*** రెండవది ***మలినాంబరం,*** మూడవది ***కలుషహరణం,*** నాల్గవది ***సాంత్వనం,*** ఐదోవది ***శ్వేతాంబరం,*** ఆరవది ***గృహోన్ముఖం,*** ఏడవది ***నిమజ్జనం,*** ప్రతి ప్రకరణం చివరి ద్విపదలలో కావ్య సందేశాన్ని ఎక్కడికక్కడ వివరించారు.

ప్రథమ ప్రకరణం చివరన;

'చాకిరేవు'న కల్గుజన వాక్యమిద్ది
మూక ప్రజల నోటి వాకున సుద్ది (చాకిరేవు: పుట: 6)

ద్వితీయ ప్రకరణం చివరన;

అల 'చాకిరేవు'న మలినాంబరమిది
కలుష విముక్తికై నిలిచి యున్నది. (చాకిరేవు: పుట: 14)

తృతీయ ప్రకరణం చివరన;

కలుష సంహార ప్రకార మిట్లాయే
కలుష హరణమాయె కలిమాయ పోయే (చాకిరేవు: పుట: 20)

చతుర్థ ప్రకరణం చివరన;

చాకిరేవున కల్గు సాంత్వాన గాథ
సాలక్యముగ ప్రవచనము చేసెనిది (చాకిరేవు: పుట: 25)

పంచమ ప్రకరణం చివరన;

అంబర చుంబి భావంబుల రూప
బింబమై శ్వేతాంబరంబు రాజిల్లే (చాకిరేవు: పుట: 30)

షష్ఠ ప్రకరణం చివరన;

తల్లి వంటిది గృహమెల్ల జీవులకు

ఇల్లు జేరుట జూపె నీ గృహోన్ముఖము (చాకిరేవు: పుట: 39)

సప్తమ ప్రకరణం చివరన;

మలినాల బాపు నిర్మల జీవనములు, గల

'చాకిరేవు' సత్కావ్యం ముగిసె (చాకిరేవు: పుట: 44) ఈ విధంగా ప్రతి ప్రకరణం చివర ద్విపదలను రచించి కావ్య సందేశాన్ని సులభంగా వివరివచే ప్రయత్నంచేశారు.

చాకిరేవు జనవాక్యంద్వారా మనలోని ప్రతి ఒక్కరిని దర్శనమిచ్చి పొమ్మని తన వద్దకు ఆహ్వానిస్తుంది. అక్కడ మలినాంబరం కాలుష్యహరణాన్ని పొంది, ఆ విధంగా పొందిన క్లేశం సాంతన్వంలో తీరిపోగా శ్వేతాంబరమై గృహోన్ముఖం కాగా మాలిన్యాలన్నింటిని తనలో నిమజ్జనం చేసుకొని మన వద్ద సెలవు పుచ్చుకొని విశ్రమిస్తుంది. అతి స్వల్పమైన కథేతివృత్తంతో చాకిరేవు కావ్యాన్ని జీవిత నైర్మల్య సిద్ధిని కలిగింపచేసే ధ్వని కావ్యంగా మలిచారు.

కథ రెండవ ప్రకరణం మలినాంబరంతో ప్రారంభమౌతుంది. ఈ ప్రకరణ నేపథ్యంలో భాగంగా చాకిరేవు ఒడ్డున ఉన్న జువ్వి చెట్టు దృశ్యంతో కథ మొదలవుతుంది. కవి మన నేత్రాలను బట్టలు ఆరవేస్తున్న రజక గృహిణివైపు మళ్లేలా చేస్తారు. ఆమె జువ్వి చెట్టు దగ్గరికి వచ్చి పిల్లవాడికి పాలిస్తూ ఉంటుంది. ఇంతలో సుడిగాలి వీచి బట్టలు ఎగిరిపోతుంటే ఆమె భర్తను కేకవేస్తుంది. అతను వచ్చి గాలికి ఎగిరిపోతోన్న బట్టలు, కంచములు మొదలగు వాటిని ఒక చోట చేర్చుతాడు. అటుపైన అన్నం తినడానికి సిద్ధమవుతాడు. ఆ క్రమంలో రజక దంపతుల మధ్య చిన్నపాటి వాగ్వాదంలాంటి సంభాషణ చోటు చేసుకుంటుంది. శివయ్య కొంచెం తిన్న తర్వాత చేయి కడుక్కొని బీడీ కాల్చటం మొదలుపెడతాడు.

మధ్యలోనే ఎందుకు తినటం ఆపేసావన్న గంగమ్మ ప్రశ్నకు ఆకలిలేదు, తప్పక తింటాను అనే సమాధానం లభిస్తుంది. తర్వాత గంగమ్మ అన్నం తింటూ తమ బతుకులు బాగుపడేలా రాజకీయాల్లోకి వెళ్ళమనే సలహానిస్తుంది. ఆ క్రమంలో శివయ్య జీవితంలో ధన ప్రాధాన్యతను వివరిస్తూ రాజకీయాల్లోకి వెళ్తే జరిగే పరిణామాలు ఆమెకు కళ్లకు కట్టినట్లు తెలియజేస్తాడు. అలా తెలిపే సందర్భంగా రాజకీయాల్లోకి ప్రవేశించాక మంత్రి అవుతానని, అప్పుడు ఆ భాగ్యానికి తగిన సకల వసతులు అనుభవిస్తానని చెప్తాడు. అంతటితో ఆగక అర్ధమైన సుందరీమణి తనంతట తానుగా వచ్చినపుడు పొమ్మనటం తప్పుకదా అని అంటు ఇక నీ కాపురం గంగపాలవడం నిజం, నీకు నీ పిల్లలకు చాకిరేవే దిక్కు. ఇప్పుడు చెప్పు, నీకు ఏది ఇష్టమో?

అని ఆమెను ప్రశ్నిస్తాడు. ఆ మాటలకు పొంగుకు వచ్చిన దు:ఖాన్ని ప్రకటిస్తుండగా వారి మధ్య జరిగిన గొడవ తీర్చేందుకు లచ్చువమ్మ, పేరమ్మ ప్రయత్నిస్తారు. ఆ ఇద్దరూ శివయ్య గంగమ్మ చెరో పక్షం నిలిచి హాస్యాన్ని పండిస్తూ ఆమెను సాంత్వనపరచి కాసేపటికి అక్కడి నుంచి వెళ్లిపోతారు.

అంతలో జువ్వి చెట్టు దగ్గరకు ఎముకనోట కరుచొని ఓ కుక్క వస్తుంది. మాంసం లేకున్నా ఓ ఎముకను కొరికి కొరికి ఆస్వాదిస్తున్న సన్నివేశాన్ని ఆమెకు చూపించి శివయ్య జీవిత సత్యాలను చెప్తాడు. మహిళల త్యాగ నిరతిని ప్రస్తుతిస్తాడు.

కథ ఇలా సాగుతుండగా ఆరవ ప్రకరణమైన గృహోన్ముఖంలో పెద్ద పిల్లవాడు స్కూలు నుండి సరాసరి చాకిరేవుకు వచ్చి తల్లిదండ్రులకు లాటరీలో ఐదవ ప్రైజు లభించిందన్న విషయాన్ని తెలియజేస్తాడు. ఆ ప్రైజు మొత్తాన్ని ఏం చేస్తావని గంగమ్మ శివయ్యను అడుగుతుంది. అప్పుడు శివయ్య లాటరీ మొత్తాన్ని లైబ్రరీకి ఇస్తాడనే సంగతిని తెలియజేస్తాడు. అలా గంగమ్మ శివయ్య పిల్లలతో పాటు గ్రామానికి బయలుదేరుతారు. సంధ్యా సమయంలో జీవజాలం తమ తమ ఆవాసాలకు చేరుకునే వర్ణనతో కావ్యం ముగుస్తుంది.

చాకిరేవు మలినాలనే కాదు మన హృదయాలను కూడా కలుషరహితం చేయగలదనే మహత్తర సందేశాన్ని ఈ కావ్యం ద్వారా కవి మనకు అందిస్తున్నారు.

2.3 చాకిరేవు కావ్యంలోని పాత్రలు

పింగళి–కాటూరి సాహిత్య ప్రచురణలలో పదవది ఈ 'చాకిరేవు' పద్యకావ్యం. 1989 చివరి రోజుల్లో కొండయ్య గారు రచించిన కావ్యమిది. చాకిరేవు కావ్యానికి 1991లో పద్య కవితా విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు.

వస్త్రధవన కర్మను కథా వస్తువుగా గ్రహించిన ప్రథమ కావ్యం ఇదే. ఈ వస్త్రధావనను గురించిన ప్రస్తావన ఆంధ్ర కావ్యాలలో అక్కడక్కడా ఉంది. కానీ మొదటిసారిగా దీనికి ఒక పరిపూర్ణ కావ్య స్వరూపాన్ని ఇచ్చిన గౌరవం కొండయ్య గారికే దక్కింది.

చాకిరేవు మనుషుల మురికిని వదలగొట్టి శుభ్రపరిచే ప్రదేశం. ఈ వస్త్ర ధావన కర్మను తమ రెక్కలు ముక్కలు చేసుకొని రజకులు నిర్వహిస్తారు. వారి సామాజిక సేవ ఎంతో విలువైనది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రతి పనిని యంత్రాల సహాయంతో చేసే వెసులుబాటు కలిగింది.

1. శివయ్య
2. గంగమ్మ
3. సంతానం
4. లచ్చువమ్మ
5. పేరమ్మ

మొదలైనవి ఈ కావ్యంలో కనిపించే పాత్రలు. వివిధ సన్నివేశాల్లో వివిధ పాత్రల ప్రవర్తన ఆయా పాత్రల స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంది. కావ్యంలోని పాత్రల చిత్రణ, కథాకథనం, సంభాషణలు, వర్ణనలు మొదలైనవి రసపోషణకు కారకాలు, ప్రేరకాలు. పాత్రల చిత్రణలో భాగంగా కొన్ని పాత్రలు కావ్యం ప్రారంభమైనప్పటి నుంచి కావ్యాంతం వరకు నిలిచి ఉంటాయి. మరికొన్ని వాటికి అనుబంధంగా ఉంటూ మధ్యలో వచ్చి పోతుంటాయి.

ఒక రచయిత తానెన్నుకున్న వస్తువు సంక్లిష్టమైన దైనప్పటికీ దాన్ని చక్కగా కళాత్మకంగా చూపగలిగితే అది పాఠకులకు చక్కగా అర్థమవుతుంది. సున్నిత భావోద్వేగాలను తట్టి లేపుతుంది. అందుచేత పామరులు సైతం వారి జ్ఞానంతో సంబంధం లేకుండా అత్యంత సంక్లిష్ట భావాలను కూడా చాలా సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. పండితులైతే ఆ భావాలను మరింత లోతుగా అర్థం చేసుకొని ఆస్వాదిస్తారు. అందరిలోను ఆజన్మసిద్ధంగా ఉండే అనుభూతులను, అనుభవాలను సాధారణీకరణం చేసి విశ్వజనీనం చేస్తూ అపూర్వ సంఘటనలుగా మలిచి పాత్రల ఆలంబనగా భావోద్వేగాలను, స్వభావాలను, చిత్త ప్రవృత్తులను, గుణ దోషాలను సంభాషణల రూపంలో వెల్లడి చేస్తూ ఉత్తమ కథనరీతిని, ప్రతిభను కథకుడు/రచయిత కనపరుస్తాడు.

పాత్ర చిత్రణను స్వరూప, స్వభావ విభాగాలుగా విభజిస్తే వాటిలో పరోక్ష పద్ధతి, ప్రత్యక్ష పద్ధతి అనేవి ఉప విభాగాలు. ప్రత్యక్ష పద్ధతిలో రచయిత కావ్యానికి వక్తగా ఉంటాడు. పరోక్ష పద్ధతిలో రచయిత ప్రసంగం ఉండదు. రచయిత తన అభిప్రాయాలు పాత్రల సంభాషణల ద్వారా వ్యక్తపరుస్తాడు. అయితే, కొన్ని సందర్భాలలో ప్రత్యక్ష పద్ధతిలో కూడా పాత్రలను ఆకర్షణీయంగా చిత్రించవచ్చు. ఉదాహరణకు బారిష్టరు పార్వతీశం నవల. ఇందులో రచయిత ప్రత్యక్ష పద్ధతిని అనుసరించారు. అయినా పాత్రలు సజీవంగా అనిపిస్తాయి. అవి ఈనాటి తరానికీ ప్రతిబింబాలుగా నిలుస్తాయి. కాబట్టి కొన్ని సందర్భాలలో ప్రత్యక్ష పద్ధతి కూడా పాత్ర చిత్రణకు అనువైనదే.

“చూడుము నాదు కూలమున జువ్విన వ్రేలు దుకూలడోలలో
నేడుచు చంటివాని జ్వలియించు నిదాఘమునం జరించు నా
చేడియ జూడు,మాపె నునుజెక్కిళులం దిగు ఘర్మరత్నముల్
చూడుము, నల్లగల్వ సొగసుం గను మత్తరుణీముఖమ్మునన్” (చాకిరేవు: పద్యం 27: పుట 7)

రెండవ ప్రకరణంలోని ఈ పద్యంతో కథ ప్రారంభమవుతుంది. రచయిత చాకిరేవు రంగస్థలంపై పాత్రలను ఎంత నాటకీయంగా ప్రవేశపెట్టారో ఇక్కడ గమనిద్దాం. ముందుగా జువ్వి చెట్టు దృశ్యం గోచరిస్తుంది. దీనితో కథ మొదలవుతుంది. ఆ పక్కనే గంగమ్మ బట్టలు ఆరవేస్తుంటుంది. ఇంతలో సుడిగాలి వీచి బట్టలు ఎగిరిపోతుంటే ఆమె భర్తను పిలుస్తుంది. అంతవరకు అతను అక్కడ ఉన్న సంగతి మనకు తెలియదు. ఆ పిలుపుతో అతన్ని కవి పాఠకులకు పరిచయం చేస్తాడు.

చతుర్ధ ప్రకరణ ఆరంభంలో

“పేడ తట్టబట్టి పేరమ్మ రివ్వున
బాణమట్లు వచ్చి పడియెనచట
ఈతయినె త్రాడు చేత బట్టి చిదుకు
లటనె విడిచి లచ్చువమ్మ వచ్చె”(చాకిరేవు: పద్యం 88: పుట 21) ఊహించని రీతిగా ఒక విశిష్ట విధానంలో లచ్చువమ్మ పేరమ్మలు(ప్రాసంగిక పాత్రలు) మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ రంగస్థలం మీదకు విచ్చేస్తారు. ఐదవ ప్రకరణం అనుకోని రీతిగా రజక దంపతుల పిల్లవాడి కేకతో రంగస్థలం మీదకి అతని రాకను సూచిస్తోంది. ఇలాంటి పిల్లవాడు ఒకడున్నాడనే సూచన రెండవ ప్రకరణంలో గంగమ్మ చెప్పిన

“వీడు చంక దిగడు వాడు మాట వినడు” (చాకిరేవు: పద్యం 88: పుట 10) అనే మాటల ద్వారా కావ్యకర్త ముందే చెప్పి వున్నారు. ఇలా పాత్రలను నాటకీయంగా ప్రవేశపెట్టడంతో చాకిరేవు కావ్యం ఆసక్తికరంగా సాగుతుంది.

కథానాయకుడి పేరు, కథానాయకి పేరు ఏమిటో వారిని పిలిచేవరకు పాఠకులకు తెలుపకుండా ఉంచారు కవిగారు. కథాకథనంలో ఇది ఒక విశిష్టమైన పద్ధతి. నాయకీనాయకుల రూపు రేఖల్నీ , వ్యక్తిత్వాన్నీ ఒక చోట రాశిపోసి వర్ణించలేదు. అక్కడొక మాట, ఇక్కడొక మాట మాత్రం చెబుతూ వాళ్ళ సౌందర్యాలనూ, సంస్కారాలనూ క్రమక్రమంగా వికసింపచేస్తూ సాగిపోయారు. భార్యాభర్తలిద్దరూ చతురులు, పరిహాస ప్రియులు. జీవిత సుఖాన్ని కొల్లగొట్టి అనుభవించగల శాంత గంభీరులు.

2.3.1 శివయ్య

చాకిరేవు కావ్యంలోని కథానాయకుడు శివయ్య. ఈ పాత్రను చిత్రించడంలో కవి చూపిన నేర్పు విశిష్టమైనది. ఈ పాత్ర ద్వారా కవి పాఠకులకు తన సందేశాన్ని వినిపించారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యం, ధనాకర్షణ లేకుండా ఉండటం, కష్టపడి పైకి రావాలనే తలంపు, లోకజ్ఞత, పదవులను ఆశించకపోవడం, ధర్మ చింతన మొదలైన వాటన్నింటి కలయికగా ఈ పాత్రను మలిచారు. శివయ్య ఎలా ఉన్నాండంటే

"ఈ ఎగు భుజమ్ములు మూటల మోతేకేనటయ్యా" (చాకిరేవు: పద్యం 66: పుట 16)

"కింది చూపెగాని పొందదు పై చూపు

వంగి నంచగలవు బండుమీద" (చాకిరేవు: పద్యం 33: పుట 8) అని భార్యతో అడిగించి బలిష్ఠమూ,సమగ్రమూ అయిన అతని శరీర సౌష్టవాన్ని స్ఫురింపచేశారు.

మరొక చోట, అతని చేతనే తన రూపాన్ని గురించి

"ఇనుము పోతబోసి ననుజేసె దేవుడు" (చాకిరేవు: పద్యం 126: పుట 29) ఇక అతని మనస్తత్వమోలాంటిదంటే ఇనుముపోతగా తనను దేవుడు సృష్టించాడని అనిపించారు.

"బద్ధకమ్ము పోసి ప్రాణ మొసగె " (చాకిరేవు: పద్యం 126: పుట 29) బద్ధకం పోసి ప్రాణమిచ్చాడట దేవుడు.

లచ్చువమ్మ చేత

"వదినె! నీ శివయ్య పరమశివుండెను

పుస్తకాలయమున పూను తపము " (చాకిరేవు: పద్యం 93: పుట 22) అతను పుస్తకాలము(గ్రంథాలయం)తో తపస్సు చేస్తాడని తెలియచేశారు.

"ఇంపుగా నట్టు లామె గద్దింప, నార

గింప దొడగె బాలకువలె గిక్కురనక" (చాకిరేవు: పద్యం 41: పుట 10) అన్నం తినమని అన్నం, గోంగూర పచ్చడి ఉన్న గిన్నెను శివయ్య దగ్గరకు తోస్తుంది అతని భార్య. పచ్చడి వాసన నచ్చడంతో తొలిముద్ద ఇష్టంగా భార్యకు తినిపించబోతాడు. ఆమె కన్నులు పెద్దవిగా చేసి ఈ వేషాలు చాలు త్వరగా తిని తొందరగా పనికి ఉపక్రమించమని అంటుంది. ఆమె అలా గద్దించడంతో పిల్లాడిలాగా కిక్కురమనకుండా ఆరగిస్తాడు.

"కేలుకందు" ననుచు,కేల వారించి, ఆ

మగడు పంచె చెరగు తిగిచి తుడువ" (చాకిరేవు: పద్యం 65: పుట 15) గంగమ్మ చేయి కడుక్కుని చీరకొంగుతో చేయి తుడుచుకుని, అరచేతులతో మూతి తుడుచుకోబోతున్న ఆమెను చెయ్యి కందుతుందని వారించి అతని పంచె అంచును లాగి తుడువబోతాడు.

"ప్రాణము వంటి దాన!నిను బాసి వసింతునె?" (చాకిరేవు: పద్యం 127: పుట 29)

"ఇక నీ నా యనుబంధ మెట్టిదని మంటేనినె,వచిపంపంగా మా
టకు శక్యంబె?మగండు పెండ్లమయి కూడన్ పుట్టినా, మీక పే
రుకు దాంపత్యములున్న వెన్నొ నటనా రుగ్మాకృతుల్ దాల్చి, వా
రికి దూరమ్మున నుంచి ప్రోచుటకు ప్రార్థింతున్ సతమీశ్వరున్" (చాకిరేవు: పద్యం 132: పుట 30) ప్రాణం లాంటి నిన్ను విడిచి నేను జీవిస్తానా?, మన అనుబంధం చెప్పతరమా పేరుకు దంపతులన్నట్టుగా ఉండే వారికి ఎల్లప్పుడూ దూరంగా ఉంచమని ఆ ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తానని రజకుడు చెప్పడాన్ని చూస్తే అతనికి భార్యపట్ల గల అనురాగం తెలుస్తుంది. ఎంతో కాలం కలిసి మెలిసి జీవించి సరదాగా ఒక మాట అంటే దాన్ని పట్టుకొని అదే మనిషి స్వభావమన్న నిర్ధారణకి వస్తే ఇంక భర్త ఎలా మనగలడని రజకుడు ప్రశ్నిస్తాడు.

"ఉండనిమ్ము చెంత నుండక పోవని
మ్మెట్టి వగలు మనకు నిముడ వమ్మ!" (చాకిరేవు: పద్యం 138: పుట 32) చెంత ఉన్నా లేకున్నా ఒకేలా ఉంటానని, నటన రాదంటూ భార్యకు తన ప్రేమను వ్యక్తపరుస్తాడు.

ధన సంపాదన చేయడం కోసం రాజకీయాల్లోకి వెళ్ళమని భార్య సలహానివ్వగా

"నీవన్నట్టులె రాజకీయమగు దుర్నీతిన్ దురాచారమున్
భావింతున్, చరియింతునట్టులె, మహాభాగ్యమ్ములున్ భోగముల్
రావింతునే పదపూజ సల్పుటకు నిర్వక్ర ప్రతాపంబునన్
దైవమ్మీతడనన్ నరుల్ కనక సౌధమ్మందు వాసించెదన్" (చాకిరేవు: పద్యం 80: పుట 18) ఆమె చెప్పినట్లుగా రాజకీయాల్లోకి వెళ్తే ఎలాంటి పరిణామాలుంటాయో గృహిణికి భర్త వివరించే సందర్భంలో

"ధనము మీద నడతు ధారుణిపై కాదు
కనక వసనములనె కట్టుకొందు
వారి ద్రావ సీమ వారుణినేగాని
ముట్ట పంచభక్ష్యములనెగాని" (చాకిరేవు: పద్యం 81: పుట 19) ఒక్కసారి చదవగానే అర్థమయ్యేంత సులువుగా, భావధారతో తన భావాల్ని కవి వ్యక్తీకరించారు.

'రాజకీయాల్లోకి వెళ్తే ధనము మీదే తప్ప భూమిపై నడవనని, పట్టు పీతాంబరాలనే ధరిస్తానని, సీమ సారాయినే తప్ప నీరు తాగనని, పంచభక్ష్య పరమాన్నాలు తప్ప ఇంకేం ముట్టబోనని' శివయ్య చెప్పటం అంతటితో ఆగక ఆ సమయంలో తన అంతస్తుకు తగిన మగువ తనంతట తాను వస్తుందని, భార్యా పిల్లలకు చాకారేవే దిక్కంటాడు.

"నేను మంత్రినగుట నిక్కమ్ము, నిజము నీ

కాపురమ్ము గంగ గలయుటయును,

నీకు, నీ సుతులకు చాకిరేవే దిక్కు

ఇపుడు చెపుయేది ఇష్ట మగునొ?" (చాకిరేవు: పద్యం 84: పుట 19) ఇలా భార్య ధన సంపాదన కోసం ప్రోత్సహించినపుడు ఆమె ధర్మసంవాదం చేస్తాడు.

"ఎంతని ప్రస్తుతిందు సుదతీ, గృహిణీ మహిళాశ్రుధారలీ

వింత నరుండు నేల ప్రభవించిన దాదిగ పారుచుండు, నీ

యింతులు పుట్టరెట్లు, తమ కింతయు గోరరు, భర్త కోసమో

సంతతి కోసమో సతము చచ్చుట కేయియు సిద్దమేకదా?" (చాకిరేవు: పద్యం 119: పుట 28) 'స్త్రీలు తమ కోసం ఏమీ కోరుకోకుండా తమ భర్తకోసమో, సంతతి అభివృద్ధి కోసమో కష్టపడుతుంటారు. చివరకు తమ ప్రాణాల్ని అర్పించడానికి సైతం వెనుకాడరు. ఎంతో ఓర్పుగా వ్యవహరిస్తారు' అంటూ రజకుని పాత్ర ద్వారా స్త్రీల ఔన్నత్యాన్ని కవి వివరించారు.

"పంతంబులేల?

ఎవరి బరువులు వారికి,ఇంతయేల

బడిబరువు నీది, బట్టల బరువునాది,

ఇల్లు పిల్లల బరువు నీ తల్లి మోయు" చాకిరేవు: పద్యం 160: పుట 37) సంసార యాత్రలో ఎవరి బరువులు వారు మోయాలి. కుమారునిది బడిబరువు, తండ్రి రజకునిది బట్టల బరువు, ఇల్లాలిది ఇల్లు పిల్లల బరువు. అంటే కుటుంబ నిర్వహణలో ఎవరి బాధ్యతలు వారికుంటాయి. ఈ సూక్ష్మాన్ని రజక దంపతలకు అన్వయిస్తూ సరళంగా తెలిపారు.

చిత్రకారుడు తన కుంచె అంచుతో గీసిన ఒక్క రేఖతో తన చిత్రానికి ఒక కొత్త అందాన్ని చేర్చినట్లుగా ఒకే ఒక మాటతోనో, చిన్న సన్నివేశంతోనో పాత్రకి విశిష్ట వ్యక్తిత్వాన్ని కలిగించడం ఒక పద్ధతి.

లాటరీలో పదివేలు గెల్చుకున్నారన్న వార్తను కొడుకు ద్వారా తెలుసుకున్న శివయ్య దంపతులు గృహానికి పయనమవుతున్న సందర్భంలోని సంభాషణను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. లాటరీ మొత్తంగా వచ్చే పదివేలను ఏం చేస్తావని భార్య అడుగగా..

"ఈశ్వరున కాలయము గట్టి యిచ్చు కంటె

పొత్తముల కాలయము గట్టు పుణ్యమధిక

మమ్మి! అందున పూజారి నగదు నేను,

జ్ఞానమును మించగలుగు ధనమ్ము లేదా" (చాకిరేవు: పద్యం 165: పుట 38) జ్ఞానమును మించిన ధనం లేదని అందువల్ల పుస్తకాలకు ఆలయం (గ్రంథాలయం) కట్టడమనేది ఈశ్వరుని ఆలయం కట్టించిన దానికంటే అధిక పుణ్య కార్యమని తెలిపి శివయ్య వ్యక్తిత్వాన్ని కవి విశిష్ట స్థానంలో నిలబెట్టారు.

పిల్లవాణ్ణి గురించి పట్టించుకోమని భార్య భర్తకు చెప్తుంది. బడికి వెళ్లి రావడం తప్ప చిన్న పనైనా ఆ పిల్లవాడు ముట్టుకోడని, చదవడం వల్ల మనిషి బుద్ధి మొద్దుబారిపోయి మంచి, మమతను మరచిపోతున్నాడని ఆక్షేపిస్తుంది.

అప్పుడు భర్త,

"గాంధి జాడలేదు,కాని వింటిమి కదా?
చదువు వాని దైవ సముని జేసే,
వాని మాట తేనెవాకలై లోకుల
బ్రదుకులం దమృతము పండలేదె?" (చాకిరేవు: పద్యం 50: పుట 12) గాంధీజీకి సంబంధించినంత వరకూ స్వతంత్ర సంగ్రామ సారథిగా జన సముద్రాన్ని కదిలించి, ముందుండి నడిపించటం ఒక పార్శ్వం మాత్రమే. అంతకు మించి ఆయన ప్రయోగశీలంగా సకల జీవన పార్శ్వాలను మథించి, సంక్షుభిత సమయాల్లోనే కాదు నిత్య జీవితంలో కూడా మనం హృదయాలకు హత్తుకోవాల్సిన నమ్రత, సహనం, అహింస, ప్రేమ, క్షమ వంటి అత్యున్నత విలువలను స్పష్టంగా పరిచయం చేశారు.

'గాంధీని చూడకపోయినా ఆయన గొప్పతనం గురించి విన్నాం కదా. చదువే ఆయనను దైవసమానుణ్ణి చేసింది. ఆయన మాటలు ఎందరో జీవితాల్లో వెలుగు నింపాయని' కవి తన గాంధీయ వాద సందేశాన్ని శివయ్య చేత చెప్పించారు.

యుగయుగాలుగా సంక్రమిస్తున్న భారతీయ సంస్కృతికి శివయ్యను ప్రతిరూపంగా చిత్రించారు. అతను నిరంతర స్వాధ్యయనపరుడై మహాజ్ఞాని, త్యాగశీలి అయ్యాడు. ధనాకర్షణనూ, దురాశనూ, పదవులను, కీర్తినీ నిరసించాడు. భార్య పట్ల ప్రేమానురాగాలను మనోహరంగా అభివ్యక్తం చేశారు. ఇలా కొండయ్య గారు సామాన్య రజకుని పాత్రలో ఒక ఆదర్శ యువకుణ్ణి ప్రత్యక్షం చేశారు.

2.3.2 గంగమ్మ

చాకిరేవు కావ్యంలోని కథానాయిక గంగమ్మ. తనవంతు సాయమందిస్తూ భర్తకనుగుణంగా నడుచుకునే ఇల్లాలి పాత్ర ఈమెది.

కవి ముందుగా..

".. జ్వలియించు నిధాఘమునం జరించు నా
చేడియజూడు,మాపె నను జెక్కిళులందిగు ఘర్మరత్నముల్
చూడుము, నల్లగల్వసొగసుంగను మత్తరుణీముఖమ్మునన్" (చాకిరేవు: పద్యం 27: పుట 7) అంటూ కావ్య నాయికను వర్ణించారు.

తర్వాత

"కెంపు పెదవులపుడు కెందామరపు టర

చేత తడువబోవు చెలియగాంచి" (చాకిరేవు: పద్యం 65:పుట 15)

ఆమెను చూపెట్టారు. కథ కొంత దూరం నడిచిన తర్వాత ఆమె ఎలా ఉందో భర్త మాటల్లో ఇలా చెప్పించారు.

"మల్లెపూవు వంటి తెల్లని మనసుండి

పరిమళించు తేనె పలుకలుండి

పలుకరించు నల్ల గలువ కన్నులు నుండి

బొమ్మ వోలె నందు వమ్మి నీవు!" (చాకిరేవు: పద్యం 125: పుట 29)

"మోము విడువక ముద్దిడు ముంగురులను

వెలది ముంజేతులం ద్రోసి వెడల నడుపు,

నడచునెడు,వ్రాలు నెడ,లేచు నెడల జారు

పైట పొగ రడచును కౌనుపైన జుట్టి" (చాకిరేవు: పద్యం 28: పుట 7)

మరోచోట,

"నీలమణులు మెదపి నిను జేసెపో దేవు

డోర్పు రసము పిండి యుసురుపోసె," (చాకిరేవు: పద్యం 126 : పుట 29) ఆమె మనుసు ఎలాంటిదంటే తెల్లని మల్లెపువ్వు లాంటిదట, ఆమె మాటలు తేనె పలుకులు, కన్నులు నల్లకలువలాంటివట. భర్త ఆమె సౌందర్యాన్ని చూసి నీలమణులతో తయారు చేసి, ఓర్పు రసంతో దేవుడు ప్రాణం పోసిన బొమ్మలాగా ఉందని అంటాడు. అక్కడక్కడా గీసిన రేఖలన్నింటినీ ఒక క్రమంలో కలిపితే అందమైన చిత్రం తయారైనట్టుగా ఆ గృహిణి రూపం మన కళ్లకు కవి సాక్షాత్కారింపజేశారు.

కూర చేయడానికి సమయం దొరకక ఎలాగో గోంగూర పచ్చడి నూరింది ఆ గృహిణి.

"కూర కుదురకేట్లొ గోంగూర నూరితి

ప్రాణమటకె తోక వరకు వచ్చె" (చాకిరేవు: పద్యం 42: పుట 10)

"తెచ్చి వంటి పెట్టు తేకువ గలయాలు

కలుగువాడు శివుడు కాకపోడు" (చాకిరేవు: పద్యం 93: పుట 22) ఈ రెండు సందర్భాల ద్వారా గృహభారంలో ఆ గృహిణిదే ఎక్కువ పాత్ర అని స్పష్టం చేశారు. ఆమె పిల్లాడికి పాలిస్తుంటే ఒక్కసారిగా సుడులు తిరుగతూ గాలివీస్తుంది. ఆ గాలి వేగానికి ఒళ్లంతా దుమ్ము పడడంతో పేదలు అన్నింటా లోకువేకదా అనుకుంటుంది. తమ స్థితి బాగుపడాలని భర్తను రాజకీయాల్లోకి వెళ్లమని ప్రోత్సహిస్తుంది. ఆ విషయంలో దంపతుల మధ్య జరిగిన సంవాదంతో ఆ పాత్రలను ఉత్సుకత రేపేవిగా చిత్రించారు.

"రెక్కలు ముక్కలేనటులు రేబవ లన్నదిలేక, దేవుడే
దిక్కుగ గొడ్డు చాకిరికి దీపము పెట్టి భజింపనేల? నీ
చక్కియు నున్న పోరశికసక్కెము లాడుచు రాజకీయమం
దెక్కిరి చూడు మీవయి పిదే వయికుంత పెటమ్మునిచ్చెనన్" (చాకిరేవు: పద్యం 58: పుట 13)

"పథ మొకటి చూడు మీపాడు బ్రతుకులన్ ర
వంత సౌభాగ్య మబ్బి నిశ్చింత నుండ,
నిల్లు వాకిళులన్ పిల్లజెంల్ల లెల్ల
హాయిగా మనగ కను ముపాయ మొక్కటి" (చాకిరేవు: పద్యం 71: పుట 17) పిల్లలతో హాయిగా జీవించేందుకు అనువుగా ఏదో ఒక ఉపాయం ఆలోచించమని భర్తకు సలహా ఇస్తుంది.

"కర్మపరదు కార్య మర్మమ్మరసి ఫల
సిద్ధిపొందు, సర్వవృద్ధి పొందు" (చాకిరేవు: పద్యం 70: పుట 16) భర్తను కార్యోన్ముఖున్ని చేయడానికి ఎంతో చక్కగా జీవితంలో మెలగాల్సిన తీరును అతనికి వివరిస్తుంది.

"పిన్నయపుడు పురుషుబెంచును జనయిత్రి
పెద్దయైన వెనుక పెంచు భార్య, (చాకిరేవు: పద్యం 69: పుట 16) దీని ద్వారా పురుషుని జీవితంలో తల్లి, భార్యల స్థానాన్ని ఎంతో సులభంగా కవి వ్యక్త పరిచారు.

"నా మట్టుకు సర్వమున్ ముడుపు గట్టితి నీకయి" (చాకిరేవు: పద్యం 136: పుట 31) అంటూ గంగమ్మ భర్తపై తన ప్రేమను విశదీకరిస్తుంది. లాటరీలో వచ్చిన ధనాన్ని లైబ్రరీకి ఇస్తానని భర్త అన్నప్పుడు భర్త నిర్ణయాన్ని గౌరవిస్తుంది. ఇలా గంగమ్మ పాత్రను తరతరాలుగా సంక్రమించిన సచ్ఛరిత్రకు ప్రతినిధిగా చిత్రించారు.

2.3.3 సంతానం

గంగమ్మ శివయ్య దంపంతులకు ఇద్దరు సంతానం. ఒకరు చంక దగని చంటివాడు. మరొకడు స్కూలుకు వెళ్లే వయసు కలవాడు. పెద్ద పిల్లవాడి పాత్రను ఆసక్తికరంగా రూపొందించారు. ఆ పాత్రకు కావ్యంలో ఎక్కడా పేరు కనిపించదు. అతనికి చదువంటే అమితాసక్తి. పుస్తకాలంటే మహా ఇష్టం. బడికి వెళ్లడమంటే చెప్పలేని ఉత్సాహం. అందుకే అతనికి చదువు తప్ప వేరే ధ్యాస లేదు. చిన్న పనైనా ముట్టుకోడని తల్లి ఇలా అంటుంది.

"వీడు చంక దిగడు, వాడు మాట వినడు" (చాకిరేవు: పద్యం 42: పుట 10)

".. తిండియనడు వాడు తిప్పలనడు
పొత్తమున్న చాలపో పిచ్చి సన్నాసి
తల్లితండ్రి మరచు నిల్లు మరచు" (చాకిరేవు: పద్యం 43: పుట 10)

"బడియె వాని తల్లి, పనిముట్ట దొక్కింత
నెంత మొత్తుకొన్న నేమి ఫలము?" (చాకిరేవు: పద్యం 44: పుట 10) ఆమె అలా అనగానే తండ్రి కొడుకుని సమర్థిస్తూ **"నీ తనయునకిపుడేమియాయె తక్కువ చెపుమా"** అంటాడు.

చదివి చదివి మనిషి బుద్ధి మొద్దుబారిపోయిందని, చదువు నేర్చినా అక్కడ ఉద్యోగం ఉండదని చివరకు ఇప్పుడు మనం చేసే పని చేయలేడని భార్య వాదిస్తుంది. గాంధీని చూడకపోయినా ఆయన గొప్పతనాన్ని విన్నాం కదా, చదువే ఆయనను ఆ స్థానంలో నిలబెట్టిందని భర్త చెప్పగా గాంధీ ఎక్కడ చాకలి ఎక్కడ పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని అంటుంది గంగమ్మ.

"గాంధీ యెట? చాలిలి యెట?
నింగియౌనొకొ ఎగసిన నేలతాను?" (చాకిరేవు: పద్యం 51: పుట 12)

"పిచ్చి భ్రమలు మాని పిల్లవానికి చెప్పు,
అచ్చరాలు మనకు అచ్చిరావు" (చాకిరేవు: పద్యం 52: పుట 12) పెద్ద పిల్లవాడు స్కూలు నుండి సరాసరి చాకిరేవు దగ్గరకు వెళ్లాడు. ఎప్పుడూ రాని వాడు ఆ రోజు అలా రావడం తల్లిదండ్రులకు ఆశ్చర్యాన్ని కలిస్తుంది. అతను రొప్పుకుంటూ తల్లిదండ్రులను సమీపించి ఒక విశేషం చెప్పడానికి వచ్చానంటాడు. లాటరీలో ఐదవ ప్రైజు తనతండ్రికి వచ్చిందని, ఎవరో చెప్తే నమ్మేవాన్ని కాదు కాని కరణమే స్వయంగా చెప్పడంతో నమ్మానని, లైబ్రరీ క్లర్కు కవియన్ త్వరగా శివయ్యను కలవమన్నాడని చెప్తాడు. ఇంటికి వెళ్లేముందు తమ్ముణ్ణి ఎత్తుకోమంటూ తల్లి చెప్పగా చిన్నవాడు నా నిక్కరు తడుపకుండా విడవడని అంటాడు. చిన్న వయస్సు వాడైనా ఆ పాత్ర ద్వారా పిల్లవాడి తెలివి తేటల్ని స్ఫురింపజేశారు.

2.3.4 ప్రాసంగిక పాత్రలు

కావ్యంలోని నాయికా నాయకులు, ప్రతినాయకుడు ప్రధాన పాత్రలు. వీటికి అనుబంధంగా మరికొన్ని పాత్రలు ఉంటాయి. ప్రధాన పాత్రలు కావ్యం ప్రారంభం నుండి చివరి వరకు నిలిచివుంటాయి. అనుబంధ పాత్రలు మధ్యలో వచ్చి మధ్యలోనే ముగుస్తాయి. అలా వచ్చి వెళ్లే పాత్రల్లో, కొన్ని హాస్యాన్ని పండించేవి

ఉంటాయి. అలాంటి పాత్రలే ఈ కావ్యంలోని లచ్చువమ్మ, పేరమ్మ పాత్రలు. లచ్చువమ్మ గంగమ్మకు వరుసకు పిన్ని, పేరమ్మ అత్తవరుసవుతుంది. అంటే శివయ్యకు పిన్ని వరుస అవుతుంది. రాజకీయాల్లోకి వెళ్లమని గంగమ్మ శివయ్యకు చెప్పిన సందర్భంలో వారి మధ్య జరిగిన సంభాషణ ఫలితంగా గంగమ్మ ఏడవడం మొదలుపెడుతుంది. ఆమె ఏడుపు వినపడగానే దగ్గర్లో ఉన్న లచ్చువమ్మ, పేరమ్మలు వచ్చి తమ మాటలతో గంగమ్మను ఓదార్చే ప్రయత్నం చేస్తారు. దంపతులిరువురికీ మంచి మాటలు చెప్పి అక్కడి నుండి వెళ్లిపోతారు.

"పేడ తట్టబట్టి పేరమ్మ రివ్వున
బాణమట్లు వచ్చి పడియనచట,
ఈతయీనెత్రాడు చేతబట్టి చిదుకు
లటనె విడచి లచ్చువమ్మ వచ్చె" (చాకిరేవు: పద్యం 88: పుట 21)

2.3.4.1 లచ్చువమ్మ

లచ్చువమ్మ గంగమ్మకు పిన్ని వరుస. గంగమ్మ ఏడుపు విని ఈత తాడు అల్లేదల్లా చిదుకులు అక్కడే పడేసి గంగమ్మ దగ్గరకు వస్తుంది. అమాయకురాలైన గంగను ఏడిపించటానికి మనసెలా ఒప్పిందని శివయ్యను అడుగుతుంది. తాను గంగమ్మను ఏమీ అనలేదని, తనెందుకు ఏడుస్తోందో తెలియదని, కారణం మీరే అడగండని శివయ్య అంటాడు. భయపడకుండా జరిగిన విషయమేమిటో చెప్పమని గంగమ్మను అడుగుతుంది. శివయ్యకు మరొకరిపై మనసుందని గంగమ్మ చెప్పడంతో వివాహ బంధం, మగవారి ప్రవర్తన గురించి లచ్చువమ్మ ప్రసంగం సాగుతుంది. 'స్త్రీ,పురుషులను ఒక్కలాగే సృష్టిస్తే ఇబ్బంది ఉండదు కదా, అయినా అలా ఏ గడబిడలు లేకపోతే సృష్టి నడవదుగా' అంటూ లచ్చువమ్మ పాత్ర ద్వారా మగవారు, ఆడవారు అనే తేడా లేకుండా ఇద్దరూ సుఖంగా ఉంటే దు:ఖానికి స్వస్తి పలకవచ్చని సూచించారు.

2.3.4.2 పేరమ్మ

పేరమ్మ గంగమ్మకు అత్త వరుస అవుతుంది. పేడ తట్ట పట్టుకొని వెళ్తున్నా కాస్త గంగమ్మ ఏడుపు విని ఆమె దగ్గరకు వస్తుంది. భర్త వల్ల గంగమ్మ ఏడుస్తుందని లచ్చువమ్మ అంటే శివయ్య తరపున మాట్లాడుతుంది.

"కొట్టకుండ నేడ్చు కూతురు నీ గంగ,
నెత్తినుండు ఓటి నీటికుండ,
మా శివయ్య అచ్చు మా శివుండేనమ్మ!
మునులు వానిముందు పనికిరారు" (చాకిరేవు: పద్యం 91: పుట 22) అంటూ శివయ్య గుణాన్ని ప్రస్తుతిస్తుంది. మగవారి ప్రవర్తన గురించి లచ్చువమ్మ మాట్లాడుతుండగా ఆమెతో పాటు మాట కలుపుతుంది.

"ఔను, లచువమ్మ! మగువల

కానుపునకు ముందు వెనుక గల కాలములో

పూనునె దయ్యము మగలను?

కాని యెడల నిట్టి చెట్ట కలుగునె చెపుమా!" (చాకిరేవు: పద్యం 101: పుట 24) ఆలుమగల కోప తాపాలు అంతుపట్టవని, చీకటి అవగానే అవి చక్కబడతాయని లచ్చువమ్మ , పేరమ్మల పాత్రల ద్వారా వివరించారు.

2.4 తాత్వికాంశాలు

సాహిత్యానికి తత్వశాస్త్రానికి సంబంధం చాలా గాఢమైంది.స్థూలంగా చూస్తే సాహిత్యం సారాంశంలో వ్యక్తీకరించేది ఏదో ఒక తాత్వికతనే. తాత్విక ప్రేరణలోంచి రూపొందే సాహిత్యం చివరకు తాత్విక వ్యక్తీకరణగా ఉంటుంది. నిర్దిష్ట చారిత్రిక,రాజకీయ సంబంధం నుండి రూపొందే సాహిత్యం అంతిమంగా ఏదో ఒక తాత్విక దృక్కోణాన్నే ప్రతిఫలిస్తుంది. అందువల్ల సాహిత్యాన్ని దాని సూక్ష్మసూత్రాలలో విశ్లేషించినప్పుడు మనకు ఎదురయ్యేది ఈ తాత్వికత. ఈ చరాచర భౌతిక ప్రపంచం మానవుని చైతన్యానికి వెలుపల స్వతంత్రమైన అస్తిత్వాన్ని కలిగి ఉంటుందని భౌతికవాదం భావిస్తుంది. పదార్థం నుండే చైతన్యం, ఆలోచన ఉత్పన్నమవుతుంది చెబుతుంది.

మన దేశంలో ఉపనిషత్తులు, భగవద్గీత, శంకరాద్వైతం, విశిష్టాద్వైతం వంటి వాటి ప్రభావం మన సమాజంపై విస్తృతంగా ఉంది. వీటికి భిన్నమైన ఆలోచనలతో ఉన్న జైనం, బౌద్ధం ప్రభావమూ బాగానే ఉంది. ఉపనిషత్తులకు ముందు వేద సాహిత్యం మనకుంది.

వేదాలు లిఖిత సాహిత్యం కాదు. అవి అపౌరుషేయాలు. వేదాలలో ఎక్కువగా ప్రకృతి వర్ణన, దేవతలను సుత్తించడం ఉంది. తత్వచింతన హేతువాదాన్ని, తర్కాన్ని ఆధారంగా చేసుకొని సాగుతుంది. ప్రతిదాన్ని సంశయించి ప్రశ్నిస్తుంది. అందుకే మన తాత్వికాంశాలు దేవుడు, నమ్మకాలు, క్రతువుల చుట్టూ తిరిగాయి. అయితే భారతదేశంలో భావవాదంతో పాటుగా భౌతికవాద ఆలోచనలు కూడా కొనసాగాయి. ఇవి రెండూ అంతిమమైన సత్యంతో ఐక్యం పొందుతాయి. ఈ భావం ఉపనిషత్తుల ఆలోచనకు ప్రాతిపదిక. చైతన్యమనేదే వాస్తవం. విజ్ఞాన సాధనకు ఉపయోగించే సాధారణ జ్ఞానేంద్రియాలతో దాన్ని గ్రహించలేము. మామూలు భాషలో వర్ణించలేం. భావవాద దృక్పథం భారతీయ తత్వ చింతనను కమ్ముకున్న తీరిది. భారతీయ తాత్విక ఆలోచనలను స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలను, చరిత్రను కూడా అవగాహన చేసుకోవాలి.

పాశ్చాత్య ప్రపంచంలో గత 100సంవత్సరాల కాలంలో వెలువడిన అనేకానేక తాత్వికసిద్ధాంతాల ప్రేరణ, ప్రభావం తెలుగు సాహిత్యం మీద స్పష్టంగా గుర్తించవచ్చు. ఈ సిద్ధాంతాల సారాన్ని తెలుగు రచయితలు, తమ రచనలలో భాగం చేసుకున్నారు. సంస్కరణ విధానంతో మానవునిలో మానుషత్వాన్ని నిల్పడానికి కొందరు మహానుభావులు కంకణం కట్టుకొని ప్రయత్నించారు. అలాంటి వారిలో రాజారాంమోహనరాయ్, వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలగు వారు ఉన్నారు. వీరు సంఘంలో నెలకొన్న అంధ విశ్వాసాల్ని, సాంఘిక దురాచారాల్ని, ఆర్థిక పీడనల్ని సంస్కరించే ప్రయత్నం చేశారు.

సంఘం కలుషితమైందిగా భావించినప్పుడు సంఘంలో తానూ ఒక వ్యక్తిగా ఉన్నందువల్ల కవి లేదా రచయిత ఆ సంఘాన్ని సంస్కరించడానికి తనవంతు ప్రయత్నం చేయాల్ని ఉంటుంది. ఊట్లకొండయ్య గారి దృక్పథంలో స్త్రీలు, విద్య, రాజకీయాలు మొదలగు విషయాల్లో సంస్కరణ రావలసి ఉందనే అభిప్రాయం కనిపిస్తుంది.

చాకిరేవు మనుషులు ధరించిన బట్టల మురికిని వదలగొట్టి శుభ్రపరిచే ప్రదేశం. ఈ శౌచ కార్యక్రమాన్ని రజకులు తమ రెక్కలు ముక్కలు చేసుకొని నిర్వహిస్తారు.వారి సామాజిక సేవ ఎంతో విలువైనది. చాకిరేవు కావ్యంలో రజక దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చాకిరేవు, చాకలి, అతని జీవనవిధానం, సంసార సరళి, రజకుడు, అతని అర్ధాంగి చేసే శౌచ కార్యక్రమం నుండి గంభీర తాత్విక చింతనను కవి ప్రతిపాదించారు. కావ్య ప్రారంభం నుండి మొదలుకొని తుది వరకు తాత్విక భావ సంపదతో ఈ రచన సాగింది. కొండయ్య గారి జీవిత గమనంలో సేకరించిన తాత్విక సంపదను ఈ కావ్యం ద్వారా మనకందించారు.

"లోని మాలిన్యముం బాపలేని కతన

చింతపడబోను,దేవుని యంతవాడె

నరమనఃక్షాళనము తన తరము గాక

ఆలయము జొచ్చి విగ్రహమాయె కాదె?" (చాకిరేవు: పద్యం 2: పుట 1) మనిషి మనస్సులోని మాలిన్యాల్ని తొలగించడం తన తరంగాక దేవుడంతటి వాడే ఆలయంలోకి వెళ్లి విగ్రహమయ్యాడు. కాబట్టి ఆ మాలిన్యాల్ని తొలగించడానికి తనవంతు కృషి చేస్తానని చాకిరేవు చెప్పటం పై పద్యంలో కనిపిస్తోంది. మనిషి ఎన్నో దుర్గుణాలను కలిగి ఉన్నాడని, అందుకే వాటి నుండి మనిషి మనస్సును మరల్చడం దేవుడికి కూడా కష్టతరమైనదిగా కవి తెలియజేశారు.

చాకలి మాట విని రాముడు సీతను అడవులకు పంపాడనే విషయం లోక వ్యవహారంలో ప్రసిద్ధం. అలాంటి నింద మోపడానికి దొరకక దొరకక రజకుడే దొరికాడా అంటూ,

"..... సీతవింత గాథ

లోతు తెలియలేని లోకుల నేమందు?

సత్యమునకు లేదసత్య రక్తి!" (చాకిరేవు: పద్యం 22: పుట 5) ఒక అబద్దం చేరినంత వేగంగా నిజం ప్రజలను చేరకపోవడం సాధారణంగా మనందరికీ తెలిసిందే. సీత అడవులకు వెళ్లడానికి చోటు చేసుకున్న సంఘటనలు, వాటి వెనుక గల కారణాలు ప్రజలకు తెలియదు. ఎందుకంటే నిజం కన్నా అబద్ధమే వెర్రిజనాలకి నచ్చుతుందని, అంధుడైన వాడికి కనపడకపోయినా వివరంగా తెలియజేయవచ్చు కాని కన్నులుండి చూడను అనే వారికి చివరకు ఆ బ్రహ్మదేవుడైనా ఏం చూపించలేడని కవి భావన. అంటే ఒక రకమైన అభిప్రాయంలో ఉండి తమకు తెలిసిందే నిజమని నమ్మే అజ్ఞానంలో ఉన్న వారికి చివరకు బ్రహ్మ దేవుడైనా వివరాన్ని తెలియజేయలేడన్న అంతరార్థం గమనించదగినది. చదువుకున్న వాని కంటే చాకలి మేలనే సామెతను పురస్కరించుకొని

"చదువుకంటె మేలు చాకలి తనమని..

చదువు మురికి జేర్చు,చాకలి మది తీర్చు

నెవరి చంకనాక నీ చదువులు?" (చాకిరేవు: పద్యం 45: పుట 11) మనిషి బుద్ధి చదివి చదివి మొద్దు బారిపోవడంతో మంచి మనసు, మాటలు, నడత, మమత లేకుండా తయారవుతున్నాడని వివరించే ప్రయత్నం చేశారు.

జీవిత చక్రాన్ని వర్ణిస్తూ

"ప్రాత కన్నతల్లి వంటిది,నూతన

మాలియగును పెండ్లియాడి నరుని,

ప్రాత తొలగి పోవు, నూతనమటజేరు

జీవచక్ర మిట్లె పోవుచుండు" (చాకిరేవు: పద్యం 88: పుట 16) పురుషుడి చిన్నతనంలో అతని ఆలనాపాలనా తల్లి చూసుకుంటుంది. వివాహం తర్వాత భార్య ఆ బాధ్యతను స్వీకరిస్తుంది. ఒక వేళ పెళ్లైన తర్వాత ఇంకా అమ్మ అంటూ ఆమె చుట్టూ తిరిగేవాడు తెలివితక్కువ వాడని చెప్తూ, 'పాత' తల్లిలాంటిదని, 'కొత్త' భార్యలాంటిదని పాత పోయి, కొత్త ఆస్థానంలో చేరుతుందని తెలియజేస్తున్నారు. జీవిత చక్రంలో పాతకాలం పోయి దాని స్థానంలో కొత్తకాలం రావడం సహజం. అలా తల్లి, భార్యలను 'పాత కొత్త'లతో పోలుస్తూ జీవిత చక్రాన్ని వర్ణించారు.

ఒక కుక్క ఎముక నోట కరుచొని రజక దంపతుల దగ్గర్లోకి వస్తుంది. నీడ మధ్యలో నించొని ఆ ఎముకను కొరికి కొరికి ఆస్వాదిస్తుంటుంది. ఆ దృశ్యం చూసిన రజకుడు దాన్ని భార్యకు చూపిస్తూ ఆ ఎముకపై కొంచెం మాంసం లేకున్నా కుక్క ఎలా దాన్ని తింటోందో డబ్బు మీద ఆశకూడా అలాంటిదే.

సుఖం నీలోనే ఉంది చూసుకో దాన్నే తృప్తి, సంతోషం అంటారని భార్యకు చెప్తాడు.

"ఈశ్వరున కాలయము గటి యిచ్చుకంటె
పొత్తముల కాలయముగట్టు పుణ్యమధిక
మమ్మి! అందున పూజారి నగుదు నేను
జ్ఞానమును మించలుగు ధనమ్ములేదు" (చాకిరేవు: పద్యం 165: పుట 38) లాటరీలో గెలిచిన పదివేలను ఏం చేస్తావని భార్య అడగ్గా జ్ఞానాన్ని మించిన ధనం లేదని, అందువల్ల శివునికి ఆలయం కట్టించిన దానికన్నా గ్రంథాలయం కట్టించడం అధిక పుణ్య కార్యమన్న రజకుని మాటల ద్వారా జ్ఞాన ప్రాముఖ్యాన్ని కవి తెలియజేశారు.

మీ ముందర ఉన్న ధావకశేషులను వదిలేసి కనపడని శేషునికి పూజలు చేస్తున్నారని కవి చాకిరేవు ద్వారా ప్రశ్నించారు. చివరకు చాకిరేవును ఆత్మాకృతికి పోల్చుతూ

"లోకపు కల్మశమ్ము నతిలోలుప బుద్ధి పరిగ్రహింతు
నాత్మాకృతితోన లీనమగునట్లుగా..."

ఈ విధంగా కవి చాకిరేవు నుండి ఆత్మ గౌరవాన్ని, మానవ జీవిత రహల్ని, ధర్మ మార్గాన్ని ఆవిష్కరింపజేశారు. తత్వ రహస్యాల్ని విశ్లేషించి వివరించారు. మనిషి జీవన సారాంశాన్ని ఉన్నతీకరించే ప్రయత్నం చేశారు. జీవన సంఘర్షణలకు, సామాజిక సంవేదనలకు దగ్గరగా ఉన్న తాత్వికాంశాలు ఈ కావ్యంలో కనిపిస్తాయి.

మూడవ అధ్యాయం

అధ్యాయం - 3
కవి దృక్పథం

3.1 సంస్కరణ దృక్పథం

19వ శతాబ్దంలో ప్రారంభమైన సంస్కరణల్లో రెండు ప్రధాన ధోరణులున్నాయి. అవి మత, సామాజిక సంస్కరణలు. దేశంలో సంఘ సంస్కరణకు ఆద్యుడు రాజా రామోహనరాయ్. ఈయన మతానికి హేతువాద దృక్పథాన్ని జోడించారు. సతీసహగమన నిషేధం, కులీనుల్లో బహు భార్యత్వ నిర్మూలన, స్త్రీ హక్కుల కోసం ఆయన కృషి చేశారు. ఆయన కృషివల్ల అప్పటి గవర్నర్ జనరల్ విలియం బెంటిక్ సతీసహగమన నిషేధ చట్టం (1829, డిసెంబర్ 4) చేశారు. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, రామకృష్ణ మిషన్, ఆర్య సమాజం, థియోసాఫికల్ సంఘంలాంటి మత సంస్కరణాభిలాష గల సంస్థలు తమ కార్యక్రమాలను నడిపించాయి. బ్రహ్మ సమాజం బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏకేశ్వరోపాసనను ప్రోత్సహించింది. దయానంద సరస్వతి నాయకత్వంలో ఆర్య సమాజం విగ్రహారాధనకు వ్యతిరేకంగా ఉద్యమించి 'వేదాలకు తరలండని' ప్రబోధించారు. కరుడుగట్టిన సమాజ పునర్వ్యవస్థీకరణకు భారత తాత్విక సంస్థలు, థియోసాఫికల్ సొసైటీ వంటివి పూనుకొన్నాయి. హేతుబద్ధ పూజా విధానాన్ని రామకృష్ణ మిషన్ వారు ప్రవచించారు. జొరాష్ట్రియన్ల సంస్థ, రహనుమాయి మజ్దాయాన్ సభ, జొరాష్ట్రియన్ల ప్రాచీన పద్ధతుల పరిక్షణను ప్రబోధించింది. ఈ సంస్థలు చేపట్టిన వితంతు పునర్వివాహం, కులాంతర వివాహాలు, స్త్రీవిద్య ఉదార పాశ్చాత్య లౌకిక ధోరణుల్ని సూచిస్తాయి. పరదా నిషేధం, బాల్య వివాహం రద్దు, బహుభార్యత్వం, దళితుల పట్ల వివక్షను రూపుమాపటం కోసం సంస్కర్తలు పూనుకొన్నారు. వివాహ వయోపరిమితి పెంపు, స్త్రీల ఆస్తి హక్కుల్ని వారు కాంక్షించారు. ఈ దురాచాలను రూపుమాపటం కోసం చట్టాల ఏర్పాటుతో దేవాలయ ప్రవేశం, భోజన విషయాల్లో వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. దక్షిణ భారతదేశంలో వితంతు వివాహాలకు కందుకూరి వీరేశలింగం పంతులు కృషి చేశారు.

మహిళా సంఘ సంస్కర్తలకు సంబంధించి మొదటగా చెప్పుకోదగినవారు సావిత్రీబాయి పూలే, పండిత రమాబాయి. సావిత్రీ బాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు. తన భర్త జ్యోతిబాపూలేతో కలిసి స్త్రీల అభ్యున్నతికి పాటు పడ్డారు. ప్రముఖ సంఘ సంస్కర్త గోవింద రనడే భార్య రమాబాయి. 'ది వా క్యాస్ట్ హిందూ ఉమెన్' పుస్తకంలో స్త్రీల అణచివేత, మతం, వలసవాదం మొదలైన అంశాలను విమర్శించారు. పుణెలో,సేవా సదన్ సంస్థను స్థాపించి,స్త్రీల అభ్యున్నతికి కృషి చేశారు. ఎన్నో స్త్రీ పాఠశాలలు, వితంతు ఆశ్రమాలను స్థాపించారు.

ఊట్ల కొండయ్యగారి దృక్పథంలో స్త్రీలు, కులమతాలు, విద్య, రాజకీయాలు మొదలగు విషయాల్లో సంస్కరణ రావలసి ఉందనే అభిప్రాయం కనిపిస్తోంది.

కొండయ్యగారు స్త్రీలు ఆత్మస్థైర్యంతో ముందుకుపోవాలనే అభిప్రాయం తన రచనల్లో వ్యక్తపరచారు. అంతేకాక సమాజానికి అవసరమైన ఉపయోగకరమైన పనులు నిర్వర్తిస్తూనే భర్త పట్ల గౌరవం,పిల్లల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని ఆశించారు. స్త్రీ జాతి సముద్ధరణకు కృషి చేసిన వారి పట్ల కొండయ్య గారికి గౌరవం ఉంది. అయితే స్వేచ్ఛా కాముకత్వం పట్ల వైముఖ్యం కనిపిస్తుందని 'గృహిణి' అనే కావ్యంలోని ఈ కింది పద్యం గమనిస్తే అర్థమవుతుంది.

"గృహము నడిపెడి సారథి గృహిణి యేను
వలయు దాని ననుభవింప గలదె తాను
దేహ సుఖమె కోరెద వేని తీర్చుకొనుము
ధవుని త్వత్కామ భావనాధ్వగు నొనర్చి" (గృహిణి: పుట 157) ఒకానొక స్వైరిణి దుశ్చేష్టలను గమనించి పురుషుడు ఆమెకు శీల ప్రాధాన్యాన్ని చెప్పారు. చాకిరేవు కావ్యంలో

"పతి యౌవన సంపద కథి
పతి సతి యజమానురాలి వంచించి యెవం
డితరుల కయ్యది యిడు న
ప్పతితునకున్ బ్రతికియుండ బట్టున్ పురుగుల్" (చాకిరేవు: పద్యం 141: పుట 32) కులస్త్రీని వంచించి పరస్త్రీల కోసం తిరిగేవాడు బతికి ఉండగానే పురుగులు పడి పోతారని నిర్మోహమాటంగా చెప్పేశారు. మరోచోట

"కులకాంతను మించగల సఖులు కలరెయిలన్ ?" (చాకిరేవు: పద్యం 145: పుట 33) 'భార్య ' గొప్పతనాన్ని తెలియజేస్తూ స్త్రీల గురించి తనకు గల ఆదరాభిమానాల్ని వారి ఔన్నత్యం ఇనుమడించేలా వీలైన ప్రతి సందర్భంలోనూ ఆయన కావ్యాల్లోని పద్యాలలో వ్యక్తీకరించారు.

"...... తమ కింతయు గోరరు,భర్త కోసమో
సంతతి కోసమో సతము చచ్చుట కేనియు సిద్ధమే కదా?" (చాకిరేవు: పద్యం 119: పుట 28)

గడియారంలోని ముల్లులా అనుక్షణం ఇంటికోసం కష్టపడుతూ సాగిపోతుంటారు గృహిణులు. త్యాగానికి నిర్వచనంలాగానూ నిలుస్తుంటారు. ప్రతి క్షణం కుటుంబ యోగ క్షేమాల గురించే ఆలోచిస్తూ తమ కోసం కొంచెం కూడా కోరుకోరని, భర్తకోసమో, సంతతి కోసమో పాటుపడుతూ చివరకు తమ ప్రాణాన్ని ఇవ్వడానికి సిద్ధపడుతారని కవి తెలియజేసిన విధానం పై పద్యంలో గమనించవచ్చు. ఈ వ్యక్తీకరణ ద్వారా స్త్రీ సహజ గుణాన్ని సులువుగా విశదపరచారు. దీన్ని బట్టి కొండయ్య గారికి మహిళలంటే చాలా గౌరవం ఉన్నట్టు అర్థమౌతుంది.

వీరికి పూర్వకాలపు స్త్రీలంటే గౌరవమున్నప్పటికీ కాలానుగుణంగా మారిన ఆధునిక స్త్రీలతో కూడా ఉదాత్తత,కరుణ ఉందని,వారిని గౌరవించాలని, పూజించాలని తన కావ్యాల్లో పేర్కొన్నారు. **'మహిళయే రూపమున నున్న మాత మగును'** అంటారు 'గృహిణి'లో

"నన్ను శిరీష పేశల మొనర్చి సుధామధురమ్మొనర్చి సం
పన్న మొనర్చి సంస్కృతి సువాసనలన్ వసుధైక మోహనా
స్కన్న సురూపమిచ్చి,నరసంతతికిన్ జననీత్వమిచ్చి స
ర్వోన్నత సత్యశీలమిడి ప్రోచెడు స్త్రీత్వముకై నమస్కృతుల్" (గృహిణి: పుట 34)

కొండయ్య గారు గృహిణిని అన్నపూర్ణగా భావిస్తూ ;

"అమ్మా ! మాదాకబళమని యనుదినమ్ము
క్రమము దప్పక నా ప్రాంగణమును మెట్టి
వెలుగు దీపమ్మునగ బిల్చు పిన్నవాడు
నేడు రాడాయె, మెచట నున్నాడొ కాని" (గృహిణి: పుట 26)

ప్రాచీన కాలంలో **అభ్యాగత: స్వయం విష్ణు:** అని భావించే వాళ్ళు ఉండేవారు. **అతిథి దేవోభవ** అనే ఆర్యోక్తి అందరికీ సుపరిచితమే. అతిథిని దేవునిలా భావించి అతిథి కోసం ఎదురు చూడటం, ఆదరించడం 'గృహిణి'లో కన్పిస్తుంది. కొండయ్యగారు 18 వృత్తాంతాలతో 'గృహిణి' అనే పేరుతో ఒక కావ్యాన్ని రచించారు.దీనిలో ఒక గృహిణి వీధిలో యువకుణ్ణి పట్టుకొని కొందరు దుండగులు కొడుతూ ఉంటే వారిని మందలించి అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయిస్తుంది.తప్పు చేసిన కూతురునైనా మందలించి, బెదిరించి కాపురాన్ని నిలబెడుతుంది.

'కామినీ కాపురం' అనే వృత్తాంతంలో కూతురు భర్తపై అలిగి మెట్టినింటి నుండి పుట్టింటికి చేరుతుంది. దాన్ని గమనించిన తల్లి కుమార్తెకు తగిన బుద్ధులు చెప్పి ఆమె కాపురాన్ని చక్కదిద్దిన వైనం కన్పిస్తుంది.

"తల్లియై ధర్మపత్నియై తనయ యగుచు
నన్ను సైరించి పాలించి నయము జూపు
వనిత గౌరీ రమా సరస్వతులు నాకు
యుగ ముగమ్ముల భారతీయుడను నేను

'. మగువ ఆరాధ్య దైవతమ్మగును నాకు" (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 30) అని చెబుతారు. భారతీయ సంస్కృతికి మూలమైంది స్త్రీ.అందువల్ల ఆమె ఏ రూపంలో వున్నా తల్లితో సమానం అని ఈ క్రింది పద్యంలో పేర్కొన్నారు.

"మహిళ యేరూపమున నున్న మాతయగును
మాకు భారతీయులమగు మానవులకు
నామె మా సంస్కృతికి మూల మాయె నీశ
మా చరిత కామె శ్రీకారమాయె స్వామి" (నిర్వేదము: పుట 23)

"జనని యగునింతి, భోగ సాధనము గాదు

మనుజ లోకమునకు మాతృమందిరమయి

పూజ్యురాలవును .... " (నిర్వేదము: పుట 24) ఆడవాళ్ళని ఆట వస్తువులుగా చూసే విష సంస్కృతి సమాజంలో సమసిపోలేదన్న వాస్తవాన్ని గుర్తు చేస్తూ అలా ఉండకూడదంటూ మహిళలు లోకానికి పూజ్యులని ఘంటాపథంగా తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. అందుకే ఎల్లప్పుడూ మహిళా శ్రేయస్సుకే పాటుపడతానంటారు.

"మానినీ పుణ్య గర్భ సంభవము పొంది

మానినీ ప్రాణ సఖుడవై మసలుచుందు

మానినీ శ్రేయములందె మనుచునుంచు

యుగయుగమ్ముల భారతీయుడను నేను" (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 30)

సమయానికి కుటుంబ సభ్యులకి అన్నీ సిద్ధం చేసే గృహిణికి వంట చేసే సందర్భాల్లో అప్పుడప్పుడూ చెయ్యి కాలడం జరుగుతుంటుంది. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకూ వంటా వార్పు మొదలైన పనులు చేస్తూ కష్టపడే నారీమణులకు చేయెత్తి నమస్కరిస్తానంటూ కవి మహిళల పట్ల తనకున్న గౌరవాన్ని తెలియజేస్తున్నారు.

"చేయిగాలుచుకొని వంట చేయు గృహిణి

ధన్యతానంద మందు తాదాత్మ్య మొందు

నమ్మహో త్యాగ భోగ్యత కంజలింతు" (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 31)

సహనం, సంయమనం మహిళలకు సహజ కవచమని అది వారికి పుట్టుకతోనే వస్తుందని 'ప్రకృతి – పురుషుడు ' కావ్యంలో చెప్పారు.

"వనితోద్భవమ్ము తోడనె

జనియించున్ సంయమమ్ము సహజకవచమై

చనకన్ దానిన్ శ్రీరా

ముని యంతటి వానికేని పొసగున్ దేవీ" (ప్రకృతి – పురుషుడు: పుట 4)

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి పోయే ఇల్లాలు చేపు వస్తే తల వంచుకొని యింటికి పరుగెత్తే గోవులాగా వెళ్తుందట. అంతేగాక కూరగాయలు,పూలు,పండ్లతో ఉన్న సంచుల్ని రెండు చేతుల్లో పట్టుకొని పరుగెత్తి వస్తున్న యిల్లాలికి నమస్కారం చేయవయ్యా మగడా! అంటారు కవి.

"పొయెదరిండ్ల కెదొ పడిపోయిన మట్టుల ఔయలాఫిసుల్
మూయుట తోడ చేపెసగ మోరలు వంచి లగెత్తు గోవుల
ట్లీ యెడ నాయెడన్ ధృతి వహింప గరమ్ముల పూలు పండులున్
కాయెలతోడ సంచుల మగండ! నమో యనరాదె నావలెన్" (నావలెన్: పుట 13)

సమాజంలోని పరిస్థితులను స్త్రీలు ధైర్యంగా ఎదుర్కోవాలని, చక్కగా విద్యాభ్యాసం చేసి గృహిణిగా తన ధర్మం నిర్వర్తిస్తూనే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతలు గడించాలనేది కొండయ్య గారి అభిప్రాయమని తెలుస్తోంది.

సమాజంలో వరకట్నమనేది సామాజిక దురాచారం.దీని వల్ల స్త్రీలపై ఊహకందని రీతిలో చిత్రహింసలు,నేరాలు జరుగుతున్నాయి. సమాజంలోని అన్ని వర్గాల స్త్రీల జీవితాలపై అంటే వారు పేదవారు గాని, మధ్య తరగతి వారు గాని, సంపన్న స్త్రీలు గాని వారెవరైనా ఇది దుష్ప్రభావాన్ని చూపుతోంది. కొండయ్యగారు వరకట్నం తీసుకోవడం ఒక దురాచారంగానే భావించారు.

"పెండిలి కాని కుఱ్ఱడు కవిత్వము నేరిచి కావ్య గోష్టులన్
మెండుగ కట్నకానుకల మీద నొనర్చెను దండయాత్రలన్
దండిగ కన్యలా పయిని దాడా యొనర్ప గృహమ్ము మీద నా
తండు కవిత్వ గోష్ఠులకు దండము పెట్టెను చూడు నావలెన్" (నావలెన్: పుట 24) ఓ కుర్రాడు కవిత్వం నేర్చుకొని పెళ్ళికి మందు కట్నకానుకల మీద అనేక ఉపన్యాసాలిచ్చి తీరా పెళ్ళి చేసుకోవాల్సిన సమయంలో వరకట్నంగా కానుకలు స్వీకరించాడట. అది తెలిసి నారీలోకం ఆ యువకుని ఇంటిపై దాడి చేసే సరికి కట్నకానుకల మీద ఉపన్యాసాలివ్వడం మానుకున్నాడట. అందువల్ల ఏది చేసినా త్రికరణ శుద్ధిగా చేయాలని చెప్పే మాటలకు చేసే పనులకూ పొంతన ఉండాలని కొండయ్యగారి అభిప్రాయం.

కొండయ్య గారికి అపారమైన లోకానుభవం ఉంది.నాయకులు నీతి గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉంటుందని కావచ్చు ప్రతి కావ్యంలో నాయకుల నీచ గుణాలను తూర్పారబట్టారు.

"నూతనముగ నిపుడు నీతికి వచ్చిన
భంగమేమి దేశ భక్తులార!
సిగ్గు నెగ్గు చచ్చి, మ్రగ్గి భాష్పజలము
రాయియాయెనీతి నాయటులనె" (నావలెన్: పుట 3) కొత్తగా నీతికి కలిగిన భంగం ఏం లేదని అది ఎప్పుడో సిగ్గు లజ్జ విడిచి పెట్టి ఏడ్చే శక్తి లేక రాయిలాగా మారిందని చెప్పారు.

'చాకిరేవు ' కావ్యంలో

"నీవన్నట్టులె రాజకీయమగు దుర్నీతిన్ దురాచారమున్

భావింతును, చరియింతునట్టులె : మహాభాగ్యమ్ములున్ భోగముల్

రావింతున్ పదపూజ సల్పుటకు నిర్వక్ర ప్రతాపంబునన్

దైవమ్మీతడన్ నరుల్ కనక సౌధమ్మందు వాసించెదన్" (చాకిరేవు: పద్యం 80: పుట 18) గంగమ్మ తన భర్తను రాజకీయాల్లోకి వెళ్ళమని అడుగగా భార్య చెప్పినట్టు రాజకీయ దుర్నీతి, దురాచారంలోకి ప్రవేశించి భోగభాగ్యాల్ని చవిచూస్తూ అందరూ అతణ్ణి దేవుడిగా భావిస్తుండగా బంగారు భవంతిలో నివసిస్తానని అంటాడు. ఇలాంటి మాటలను చెప్తూ రాజకీయ నాయకులు నీతిగా ఉండాలని కవి అభిలషించారు.

3.2 కులమత దృక్పథం

కుల వ్యవస్థను నిర్మూలించాలని, కుల రహిత సమాజం కోసం పోరాడాలని స్వాతంత్ర్యం రాక ముందు నుంచే మన దేశంలో ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఇప్పటికీ వ్యవస్థలు, సంస్థలు ఈ దిశగా చాలా కష్టపడుతున్నాయి. మతం, దేవుడు విషయాల్లో చాలా శతాబ్దాల కిందటే మనది చైతన్య వంతమైన సమాజంగా పేరొందింది. కులం అనేది చాలా తక్కువ దేశాల్లో మాత్రమే అమల్లో ఉంది. మన దేశంలో మాత్రం కులం చాలా లోతుగా సమాజంలో భాగమైపోయింది.

"ఎవ్వడు సంస్కృతిన్ సమత నెంచక ప్రాత కులమ్ము గుర్తుగా

క్రొవ్వి చరించు నా చెనటి కోల్పడు జీవన శాంతి సౌఖ్యముల్

నవ్వుల పాలగున్ తుద కనామయుడై నశియించు నిట్టులై

నెవ్వగ గూరునే బ్రదుకు నేరుపు గల్గు మనీషి యీశ్వరా" (నిర్వేదము: పుట 17)

ఎవరైతే కులాల కుమ్ములాటలు చేస్తారో వారు నాశనమౌతారని కవి భావన. కుల చట్రంలో మానవులను బంధించడం ఇష్టం లేక అందరూ ఒకే కులం, ఒకే మతం, ఒకే జాతిగా మెలగాలని ఉద్బోధించారు.

"కులము నాయది మానవ కులము,జనని

భరత జనయిత్రి ………" (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 7)

మతమనేది ఆధ్యాత్మిక విషయానికి సంబంధించింది. మతం పట్ల అభిమానం హర్షణీయమైనా మత దురభిమానం మాత్రం పనికిరాదు. దురభిమానం వల్ల పరమత ద్వేషం పెరుగుతుంది.

"కులము నమ్మితి నదియె వ్యాకులము దెచ్చె

మతము నమ్మితి నదియె ప్రమాద మాయె

నిప్పుడా రెండు నను పొలియింప జూచు

యుగయుగమ్ముల భారతీయుడనేను"(యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 38) కులాన్ని నమ్మితే అది ఎన్నో చిక్కులను తెచ్చిందని, మతాన్ని నమ్మితే అది ఇంకా ప్రమాదంగా మారిందని, చివరికి ఈ రెండు కలిసి నన్నే నాశనం చేయడానికి పూనుకున్నాయని వాపోయరు కవి.

"కులమతమ్ములు లేని ఋషుల యుగమను

వేద నాదముల్ వీచిన విపినములను

తలచి తలిచి పిలిచి పిల్చి కలవరింతు

యుగయుగమ్ముల భారతీయుడనేను"(యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 40)

కవిగారికి కుల మతాలపై ఎంతో విసుగు పుట్టిందని పై పద్యం ద్వారా తెలుస్తోంది. ఈ కుల సమరాలు వద్దంటూ

"కువలయానంద సాహిత్య కులము నాది !

కులము నాయది మానవకులము నాది" (మృత్యుమాత: పుట 16) తనది మానవ కులమని చెప్పుకున్నారు.

3.3 మానవతా దృక్పథం

మానవతావాదంలో మానవుడే నాయకుడు. మానవ సమాజం పట్ల కరుణానురాగాల్ని ప్రదర్శించి మానవుల్ని తరింపజేయాలనే సిద్ధాంతమే మానవతా దృక్పథానికి బీజం. ఆంగ్లభాషలోని Humanism అనే పదానికి మానవతావాదం అనేది తెలుగు పర్యాయ పదంగా వాడబడుతోంది. మతం ఒక ప్రాంతానికి కొందరు ప్రజలకు సంబంధించిన జీవిత విధానాల విశ్వాసాల సమాహారమైతే మానవత విశ్వ జనీనమైంది.

"మతములన్నియు మాసి పోవును

జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును." (ముత్యాలసరములు: పుట 3) అని గురజాడ అప్పారావు పలికారు. అంతేగాక,

"చెట్టపట్టాల్ పట్టుకొని దే

శస్థులంతా నడువ వలె నోయ్!

అన్నదమ్ముల వలెను జాతులు

మతములన్నియు మెలగ వలెనోయ్!" (గురజాడ రచనలు: పుట 62) ఈ కోవలో ఊట్ల కొండయ్యగారు కూడా అచ్చమైన మానవతా వాదిగా నిలుస్తారు.

"నాడు భ్రష్టమైనష్టమై పాడుపడిన

గుణవిహీన కులమునకై కుందనేల

మానవత్వమ్ము రక్షింప బూనుకొందు" (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 38) అని అంటారు. కులమతాలు ఏనాడో భ్రష్టమై పోయాయి. వాటికోసమై చింతించడం ఎందుకు? అన్నింటికంటె మించింది మానవత్వం. దాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తానంటాడు కవి.

అందుకే,

"అన్ని మతములు మాయవి యన్ని కులము

లన్ని భాషలు ప్రాంతములన్ని మావి

ఎవరు మీరని యడిగిన నేమి యందు

భరతసంతతి మేమందు నరులమందు." (గృహిణి: పుట 13) పై పద్యం వల్ల కవిగారికి కులభేదం, మత భేదం,ప్రాంతీయ భేదం గాని లేనట్లుగా తెలుస్తుంది. మానవతా దృక్పథానికి మూలమైంది కరుణ విహీనుడైనవాడు. మానవతా వాది కాలేడు. 'గృహిణి' అనే కావ్యంలో 'మానవురాలు' అనే వృత్తాంతంలో ఒకానొక యువకుణ్ణి పట్టుకొని కొంతమంది దుండగులు కొడతున్నారు. ఆ దృశ్యాన్ని అటువైపే వెళుతున్న గృహిణి చూసి ఆ దుండగులను మందలించింది. పాపమా యువకుడు గృహిణిని చూసి అమ్మా అని మూల్గినాడట.

"అమ్మ! యనెడు తత్కరుణా స్వరమ్ము జగము నెల్ల

బిలుచున్నట్లు ప్రతిధ్వనించె చెవుల

సృష్టిగల తల్లి తనమెల్ల జేరెనన్న" (గృహిణి: పుట 17) అంటుంది. దీనిలో గృహిణి దయాహృదయం వెల్లడౌతుంది.

ఎంతో మంది నిరుపేదలు వారి సుఖాన్ని త్యజించి చెమటోడ్చి ఈ ప్రపంచానికతంతా ధారవోస్తారని కొండయ్యగారు 'నిర్వేదం' అనే కావ్యంలో వివరించారు.

“పేదలు సాదులున్ కులము పేర మతమ్ముల పేర జీవన

స్వాదు ఫలానుభూతి కెడబాసి, పునర్జననమ్ము పూర్వజ

న్మాదుల భీతి వెస్దవుల, మానవతా ప్రభలీనుచున్ శ్రమ

స్వేదములో సుఖాలయము జేయ రె ఈ భువనమ్ము నీశ్వరా” (నిర్వేదము: పుట 18) ఈ జగత్తుకు కాళ్ళూ చేతులూ శ్రమ జీవులేనని, వారు దుర్భర దారిద్ర్యంతో బాధపడుతున్నారని ఆవేదన వెలిబుచ్చాడు కవి.

“హరి జనులని గిరిజనులని

నరులున్ నారులు దరిద్రనారాయణులై

చరియింత్రుర్వికి లజ్జా

కర దారిద్ర్యమున ధరకు కాల్సేతులునై” (నిర్వేదము: పుట 18)

“నాకు శాత్రవులే లేరు లోకమందు

సోదరీ సోదరులె యెట జూతునేని

విశ్వమే స్వకుంటుంబమై వెలయువాడ

యుగయుగమ్ముల భారతీయుడనేను.” (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 18)

ఎక్కడ చూసినా నాకు సోదరీ సోదరులే కనిపిస్తున్నారు. ఈ ప్రపంచంలో నాకు శత్రువులే లేరని చెబుతున్నారు కవి. అందుకే

“విశ్వమే మందిరము నాకు విశ్వ మంది

రస్థము చరాచరము సోదరమ్ము నాకు.” (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 15)

అని పలికిన విశ్వమానవ సౌభ్రాతృత్వగుణశీలి కొండయ్య గారు. అంతేకాదు

“కవిత యొకడె మానవతా ప్రవృత్తి జేసె” (యుగయుగమ్ముల భారతీయుడను నేను: పుట 4)

అని త్రికరణ శుద్ధిగా నమ్మి అవసాన దశ వరకూ సాహితీ వ్యాసంగములో గడిపిన శ్రీ కొండయ్యగారు అచ్చమైన మావవతావాది.

నాలుగవ అధ్యాయం

అధ్యాయం - 4
చాకిరేవు కావ్యం : ఛందస్సు, భాషా విశేషాలు

4.1 ఛందస్సు

ఆహ్లాదపరచునది ఛందం. భావ లయతోపాటు భాషా స్థిరత్వాన్ని అది ప్రతిబింబిస్తుంది. పద్యం నడక, నడతను ఛందస్సు నిర్దేశిస్తుంది.

చాకిరేవు ఒక అపూర్వ ఆధునిక పద్యకావ్యం. దేహంపైన మురికినేకాక మనస్సులోని మాలిన్యాలను సైతం చాకిరేవు పోగొడుతుంది ఈ కావ్యం. కవి ప్రజ్ఞా ప్రతిభాదులు వారి రచన, విశేష పాండితీ గరిమ ఛందోలంకారాలను ఎంచుకోవడంలో స్పష్టపడుతుంది. ఆ విషయంలో కొండయ్య గారు అశేష పండిత లోకాన్ని మెప్పించగల పాండితీ ప్రకర్ష నిండుగా, మెండుగా కలవారని చెప్పవచ్చు. అటు పండితులకే కాక పామరులకు సైతం అవగతమయ్యేలా అలతి అలతి పదాలతో జాతి, ఉపజాతి పద్యాల జోడింపుతో కావ్యం ఆద్యంతం మనోహారంగా, సుబోధకంగా రచించారు.

చాకిరేవు కావ్యం ఏడు ప్రకరణాలతో, సుమారు 200ల పద్యాలతో విలసిల్లుతున్న కావ్యం. కావ్యం ముందలి మున్నుడులలోని పద్యాలను మినహాయిస్తే మొదటి ప్రకణం నుండి ఆరవ ప్రకరణం వరకు 186 పద్యాలున్నాయి. కవి, సందర్భానుసారంగా కావ్యంలో ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం వంటి వృత్తపద్యాలేకాక కందం, ఉపజాతులైన ఆటవెలది, తేటగీతిలను కూడా అద్భుతంగా రచించారు.

4.1.1 ఉత్పలమాల

నల్లకలువ వంటి ఉత్పలమాల పద్యాన్ని చాకిరేవు లోని నీళ్లని ధ్వనిస్తూ కవి చెప్పినట్లుగా ఉంది. కొండయ్యగారు ఈ కావ్యంలో మొత్తం 28 ఉత్పలమాల పద్యాలను రాశారు. వారి కావ్య ఆరంభాన్ని ఉత్పలమాల ఛందస్సులో మొదలెట్టడం ఉత్పలానికి, నీటికి ఉన్న అవినాభావ సంబంధాన్ని వ్యక్తం చేయడానికి కావచ్చు.

<u>నేనటు</u> <u>మానస</u> <u>హ్రదము</u> <u>కానిటు</u> <u>గంగను</u> <u>కాను</u> <u>లో</u> <u>ని పా</u> (చాకిరేవు: 1:1)

భ ర న భ భ ర వ

ఇది చాకిరేవులోని మొదటి పద్యం. తాను మానసరోవరము, గంగనో కాదని మనస్సులోని పాపాలను సైతం కగడలేనని, తాను కేవలం వినయంతో దేహమాలిన్యాలను వదిలించే చాకిరేవునని చాకిరేవే చెప్తుంది.

ఉత్పలమాల పద్యంలో వలె ఇందులోనూ 4 పాదాలు, ప్రతి పాదంలో భ-ర-న-భ-భ-ర-వ అను గణాలు ప్రతి పాదంలో 20 అక్షరాలు, 10వ అక్షరం యతి మైత్రిని కలిగి ఉన్నాయి. కవి ఎప్పటిలాగా పూర్వీకుల ఛందోనియతినే పాటించారు.

4.1.2 చంపకమాల

నాలుగు పాదాలతో ప్రతి పాదంలో న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలు కలిగి ఉండి 11వ అక్షరంతో యతిమైత్రిని పాటిస్తుంది. ప్రాస నియమాన్ని కూడా కలిగి ఉంటుంది. చాకిరేవు కావ్యంలో కొండయ్య గారు మొత్తం 15 చంపకమాల పద్యాలు రచించారు.

చంపకసోయగాన్ని, తళుకులీనే శోభత్వాన్ని సీతారాములకి అన్వయిస్తూ చంపకమాల వృత్తంలో కొండయ్య గారు అద్భుతంగా రచించిన పద్యం ఇది.

ఇరువు రునేక మౌచు వ సియించి న కాన నసీమ దివ్య సుం

న జ భ జ జ జ ర

దర గృహమౌచు చారుశయ నమ్మగుచున్ సుమాడలయౌచు, భా

ఇ-యిం యతి (చాకిరేవు: పద్యం 14: పుట 4)

మరొక పద్యం,

అనిక దుపుబ్బ నవ్వుస తినార సి, చిర్న గవప్పు లించి (చాకిరేవు: పద్యం 38: పుట 9)

న జ భ జ జ జ ర

అ - నా యతి

4.1.3 శార్దూలం

సంస్కృత, కన్నడ, తెలుగు సాహిత్యాలలో సాధారణంగా కనిపించే పద్యం శార్దూలం. మ-స-జ-స-త-త-గ గణాలతో ఇది విరాజిల్లుతుంది. అన్నపూర్ణాష్టకం, దక్షిణామూర్తి స్తోత్రం వంటి పలు దైవారాధన సోత్రాలు శార్దూల ఛందస్సులో ఉన్నాయి. కొండయ్య గారు చాకిరేవు కావ్యంలో నాలుగు శార్తూల పద్యాలు రచించారు. తృతీయ ప్రకరణమైన కలుషహరణంలో శివయ్యను రాజకీయల్లో చేరి డబ్బు సంపాదించమన్న భార్యతో నాయకుడు పర్యావసానాలు పలికే సందంర్భంలో వచ్చే ఈ పద్యాన్ని కొండయ్య గారు రచించారు.

నీ వన్నట్టులె రాజకీయమగు దుర్నీతిన్ దురాచారమున్

భావింతున్ చరియిం తునట్టు లె మహా భాగ్యము లున్ భోగ ముల్

మ స జ స త త గ

(చాకిరేవు: పద్యం 80: పుట 9)

పులుల పోరాటంలా ఉండే శార్దూల పద్యాన్ని భార్యాభర్తలు మద్య వాగ్వివాదాన్ని చిత్రించడానికి కవి ఉపయోగించారు.

4.1.4 మత్తేభం

కొండయ్య గారు చాకిరేవు కావ్యంలో ఆరు మత్తేభం పద్యాలు రచించారు.

అను నీకేక వినంబడన్ రజకు పూర్ణాలోకనంబుల్ వెసన్

కనెకాం తా మృదు మందహా స వద నాకారం బు, వెన్వెం ట నా

స భ ర న మ య వ

(చాకిరేవు: పద్యం 34: పుట 8)

అనియా భామిని జోలలో నినిసు పున్ అంక మ్మునంబె ట్టి యా

స భ ర న మ య వ

(చాకిరేవు: పద్యం 71: పుట 17)

4.1.5 ఆటవెలది

ఆటవెలది ఉపజాతి పద్యం. నాలుగు పాదాలుంటాయి. నాలుగు పాదాల్లోనూ, రెండు పాదాలు అనగా 1,3 పాదాలు ఒక విధమైన ఛందస్సును, 2-4 పాదాలు మరో విధమైన ఛందస్సును కలిగి ఉంటాయి. 1,3 పాదాల్లో 3 సూర్య గణాలు, 2 ఇంద్ర గణాలు, 2-4 పాదాల్లో 5 సూర్య గణాలు వస్తాయి. 1వ గణం మొదటి అక్షరానికి 4వ గణం మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. ప్రాసనియమం లేదు. ప్రాస యతి చెల్లుతుంది. చాకిరేవు కావ్యంలో కొండయ్యగారు ఎక్కువగా ఉపయోగించిన ఛందస్సు ఇదే. మొత్తం 53 ఆటవెలది పద్యాలను రచించారు.

ఇదిగొ పులియ నంగ నదిగొ తోక యనును ఇ-న

న హ నగ నల

వెర్రి జనము సీత వింత గాథ వె-వి

లోతు తెలియలేని లోకుల నేమందు లో-లో

సత్య మునకు లేద సత్య రక్తి స-స

హ న హ హ హ (చాకిరేవు: పద్యం 22: పుట 5)

మొదటి ప్రకరణం జనవాక్యంలో సీతాదేవిని అడవకులకు పంపిన సందర్భంలో అక్కడ ఉన్న నిగూఢ అర్థం, ఆ దంపతుల మధ్య జరిగిన విషయం గ్రహించకుండా చాకలిపై మిష, వ్యాజం మోపారు వెర్రి జనాలు అనే భావాన్ని ఆటవెలది ఛందస్సులో ఇలా రచించారు.

మైల **లుడుకు** **వారు** **మాలిన్య** **ములనూడ్చు**   మై - మా
హ న హ త సల
వారు **తల్లి** **కంటె** **వంద** **నీయు**   వా - వం
హ హ హ హ హ (చాకిరేవు: పద్యం 23: పుట 5)

నీల **మేఘ** **మొకట** **నింగి** **ప్రే** **లెనెవరొ**   నీ - నిం
హ హ న ర నల
ఆర **గట్టి** **మరచి** **నట్టి** **చీర**   ఆ - న
హ హ న హ హ (చాకిరేవు: పద్యం 173: పుట 41)
చాకి **రేవు** **నీర** **నేకవీ** **చీవల**   ఛా - నే
హ హ హ ర భ
మధిక **భీతి** **నీటి** **యడుగు** **జొచ్చె**   మ - య
న హ హ న హ (చాకిరేవు: పద్యం 179: పుట 42)

4.1.6 కందం

కందం జాతి భేదాలలో ప్రశస్తమైనది. తెలుగు, కన్నడ భాషలలో కందం నాలుగు పాదాలుగా కన్పించగా, సంస్కృత-ప్రాకృత భాషల్లో రెండు పాదాలలో కన్పిస్తుంది. సుమారు 10వ శతాబ్దం నాటి తెలుగు శాసనాల్లోనూ కందపద్యం కనిపిస్తోంది. కందం జాతిపద్యం. కందం రాసిన వాడే కవి అన్న ఆర్యోక్తులతో కందం రాయడం కవులకు, పండితులకు ఎంతటి ప్రకర్షనో అర్థమౌతోంది. ఎందరో లక్షణ కారులు కందాన్ని నిర్వచించినా కవిజనాశ్రయ కర్త నిర్వచనం ప్రమాణికంగా ఉంది. కొండయ్యగారు ఈ కావ్యంలో 33 కంద పద్యాలు రచించారు.

విగ్రహ **యయ్యును** **వస్త్రప**
భ భ భ
రిగ్రహణ ముచే నలంకరించు కొనును దై
వ గ్రామణి యన, రాగ
వ్యగ్ర సుపర్వాయంబర ప్రియత్వమఘమ్మే (చాకిరేవు: పద్యం 3: పుట 1)

4 పాదాలుగా గా-బ-జ-నల ములనే గణాలతో నల-జ ఆరవ గణంగా బేసిగణం జగణం లేకుండా ఒకటవ గణానికి నాలుగవ గణానికి తుది గురువుతో యతి మైత్రితో, ప్రాసనియమంతో కందం భాసిస్తుంది.

4.1.7 తేటగీతి

తేటగీతి ఉపజాతి పద్యం. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో వరుసగా ఒక సూర్యగణం,2 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు ఉంటాయి. ప్రాసనియమం లేదు. ప్రాస యతి వేయవచ్చు. 1 గణం మొదటి అక్షరానికి, 4వ గణం మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. కొండయ్య గారు చాకిరేవు కావ్యంలో 46తేటగీతి పద్యాలు రచించారు.

ద్వితీయ ప్రకరణం మలినాంబరములో

<u>మోము</u> <u>విడువక</u> <u>ముద్దిడు</u> <u>ముంగు</u> <u>రులను</u> మో – ముం– యతి

గల నల భ గల /హ న (చాకిరేవు: పద్యం 28: పుట 7)

చతుర్థ ప్రకరణం స్వాంతనంలో

<u>అట్లు</u> <u>గలగల</u> <u>పరిహాస</u> <u>మాడు</u> <u>పొరుగు</u> అ–మా (యతి)

హ నల నగ హ న (చాకిరేవు: పద్యం 94: పుట 22)

పంచమ ప్రకరణం శ్వేతాంబరంలో

<u>వృక్ష</u> <u>మూలవి</u> <u>శ్రామము</u> <u>విడిచి</u> <u>మదగ</u> వ – వి (యతి)

హ భ భ న న (చాకిరేవు: పద్యం 110: పుట 26)

<u>ఇట్టి</u> <u>యాత్మీయ</u> <u>తలు (బ దు)</u> <u>కెల్ల</u> <u>నిండ</u> ఇ– కె (యతి)

త నల హ హ (చాకిరేవు: పద్యం 128: పుట 30)

4.2 అలంకారాలు

తెలుగు సాహిత్య ప్రాశస్త్యాన్ని ఇనుమడింపచేయడంలో ఛందోలంకారాల పాత్ర ఎన్నదగినది. అందులోనూ అలంకారాలు సాహిత్యానికి నూతన సొగబును, మాధుర్యాన్ని అద్దుతాయి. కావ్యంలోని అలంకారాల విశిష్టతను పలువురు లాక్షణికులు ప్రశస్తంగా చెప్పారు.

'కావ్యానికి సౌందర్య హేతువులు గుణాలంకారములు' అని ఉద్భటుడు, 'కావ్యానికి సౌందర్యాన్ని కల్పించి, దానిని అలంకరించునవే' అలంకారములు అని దండి పేర్కొన్నారు. కావ్య మీమాంస కర్త రాజశేఖరుడు అలంకారాలను 'సప్తమ వేదాంగం' గా చెప్పాడు.

అలంకారాలు 2 విధములు

1. శబ్దాలంకారాలు
2. అర్థాలంకారాలు

కొండయ్య గారు చాకిరేవు కావ్యంలో శబ్దాలంకారాలను, అర్థాలంకారాలు అందంగా, సందర్భోచితంగా ఉపయోగించారు. శబ్దాలంకారాలలో వృత్త్యానుప్రాస, అంత్యానుప్రాసలను, అర్థాలంకారాలు, ఉపమాలంకారం, ఉత్ప్రేక్ష, రూపకాలంకారాలను రచించారు.

4.2.1 శబ్దాలంకారాలు

అర్థం కంటే శబ్దానికి ప్రాధాన్యమున్నవి శబ్దాలంకారాలు. కవి అక్షరాలు, శబ్దాల కూర్పునకు ప్రాధ్యామిస్తాడు.

4.2.1.1 వృత్యనుప్రాస అలంకారం

ఒక పద్యంలో కాని వాక్యంలో కాని ఒక హల్లు లేదా హల్లుల జంట పలుమార్లు ఆవృత్తి అవడాన్ని వృత్యను ప్రాస అలంకారం అంటారు. కొండయ్య గారు 'చాకిరేవు' కావ్యంలో వృత్యనుప్రాసను విరివిగా ఉ పయోగించారు. సారళ్యమైన భాషలో సహజ నుడికారాలతో అందంగా, చెవులకింపుగా వృత్యనుప్రాసను వేశారు. కావ్యం మొత్తంలో 14 వృత్యనుప్రాస అలంకారాలు ఉన్నాయి.

దొరకక దొరకక రజకుడె
దొరకెనె రామునకు మోపదుర్యశ, మిదియా
రరామరాజ్యమనగా
రమా మిత్రునకునైన వలదు వలదయా (చాకిరేవు: పద్యం 21: పుట 5)

లోతు తెలియలేని లోకుల నేమందు
సత్యమునకు లేద సత్యరక్తి (చాకిరేవు: పద్యం 22: పుట 5)

పై పద్యాల్లో మొదటి పద్యంలో 'ర' కార వృత్తి వినసొంపును కలిగిస్తుంది. రెండవ పద్యంలో 'త' కార, 'ల'కార ఆవృత్తి వృత్యనుప్రాస అలంకారాన్ని శోభస్కరంగా ఆవిష్కరించాయి.

4.2.1.2 అంత్యానుప్రాస అలంకారం

పదాల చివర లేదా పాదాల చివర వచ్చిన అక్షరాలే మళ్ళీ మళ్ళీ రావడం అంత్యానుప్రాసాలంకారం. ఉదాహరణ:

విశ్వమోహన దండక విపిన <u>తలము</u>
లమల గోదావరీ మాత అంక <u>తలము</u>
పాయనేరవు సీతమ్మ భావ <u>తలము</u> (చాకిరేవు:పద్యం 17: పుట 4)

ఈ పద్యంలో ప్రతిపాదం చివర 'తలము' అనే పదాన్ని ప్రయోగిస్తూ శ్రావ్య సంపదగా రచించారు కొండయ్య గారు.

4.2.2 అర్థాలంకారాలు

శబ్దం కంటే అర్థానికి ప్రాధాన్యం ఉండేవి అర్థాలంకారాలు. ఇవి భావనాశక్తిని ప్రతిబింబిస్తాయి. జయదేవుని చంద్రాలోకంలో అర్థాలంకారాల వివరణ బాగా కనిపిస్తుంది.

4.2.2.1 ఉపమాలంకారం

ఉపమ అంటే పోలిక, సాదృశ్యం. ఉపమేయ ఉపమానాలకు మనోహరమైన పోలిక చెప్పడం ఉపమాలంకారం. ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమావాచకం అనే నాలుగూ ఉంటే పూర్ణోపమాలకారం అంటారు. ఏదో ఒకటి లోపిస్తే లుప్తో పమాలంకారం అంటారు.

ఉపమేయం – చెప్పదలుచుకున్నది

ఉపమానం – పోలికకు తీసుకున్నది

సమానధర్మం – సమానమైన గుణం లేదా స్వభావం

ఉపమావాచకం – అన్వయించేది – వలె, పోలె, అట్లు, భంగి మొదలైనవి.

ఉదా:

కసరి బుసగొట్టి వడగాడ్పు విసరె, సుడులు (చాకిరేవు: పద్యం 30: పుట 8) ఇక్కడ కవి గాలిని పగబట్టిన పాముతో పోల్చారు. సుడులు తిరిగిన గాలి పాములాగా ఉందని సహజ సుందరంగా ఉపమాలంకారంలో వర్ణించారు. సప్తమ ప్రకరణంలో ఆకాశంలోని పక్షులను పోల్చిన తీరు హృద్యమని చెప్పవచ్చు.

విశ్వమయునకు భూమాత పెట్టుకొన్న
కష్టసుఖముల దరఖాస్తు కాగితముల
వోలె పరచె విగంహముల్ వ్యోమసీమ
గమ్య మెరిగిన సందేశకారులట్లు (చాకిరేవు: పద్యం 169: పుట 40) పక్షులను కష్టసుఖాల కాగితాలతో పోల్చారు.

అటువంటివే మరికొన్ని

అడవులును బుషు ... (చాకిరేవు: పద్యం 11: పుట 3)

వినుము, శరీర శౌచము పవిత్ర విధాయక మౌనుకాదె? (చాకిరేవు: పద్యం 24: పుట 6)

ఇంపుగా నట్టులామె గద్దింప (చాకిరేవు: పద్యం 41: పుట 10)

చేతకానివాడు చెలగి సుద్దులు జెప్పు (చాకిరేవు: పద్యం 70: పుట 16)

ప్లక్ష వృక్ష పార్శ్వ వల్మీకమ్ము వెడలె (చాకిరేవు: పద్యం 176: పుట 42)

నీవు సువర్ణ కాంతివయి నిల్చితి వీతని భీకరాంధకా (చాకిరేవు: పద్యం 123: పుట 29)

4.2.2.2 ఉత్ప్రేక్షాలంకారం:

ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించడం ఉత్ప్రేక్షాలంకారం. ఉత్ప్రేక్ష అంటే ఊహ. అసమంజసం, అసహజం అయిన అంశాన్ని సమంజసమైనట్టు, సహజమైనట్లు వర్ణిస్తారు.

ఉదా:

నీల మేఘ మొకటి నింగి వ్రేలె నెవరొ
ఆరగట్టి మరిచినట్టి చీర
యనగ, నెగుర వేసికొని పోయె నంతట
చూచి చూచి గాలి చోరునట్లు (చాకిరేవు: పద్యం 173: పుట 41) ఆకాశంలోని నీలిమేఘాన్ని ఆరవేసి మర్చిపోయిన చీరలాగా భావించారు. మరో ఉదాహరణ

వృక్షమూల విశ్రామము విడిచి మదగ
జమ్ము మంద మందగతుల సాగిపోవు
నట్టు లాజువ్వి నీడ కన్పట్టె: వాయు
భయమునన్ పండుటాకులు వణికి రాలె (చాకిరేవు: పద్యం 110: పుట 26) అప్పటిదాకా చెట్టుకింద విశ్రాంతి తీసుకున్న ఏనుగులు మెల్లమెల్లగా సాగితే ఎలా ఉంటుందో జువ్వి చెట్టు నీడను అలా భావించారు.

మరొక పద్యంలో,

ఆడుమగదనములు త్రాడు పేనినయట్లు
ప్రేమ దీరగ పెనబాములాడె,
వ్యోమ భామ చూచె నొడ లెల్ల కన్నులు
గా ననంగ తారకములు తోచె (చాకిరేవు: పద్యం 177: పుట 42) గంగమ్మ, శివయ్యల ప్రేమ బంధాన్ని తాడు ముడివేసుకున్నచందంగా భావించారు. ఈ విధంగా చిన్న చిన్న పదాలతో ఎంతటి భావాన్నైనా సులభంగా అర్థమయ్యేలా, సుందరంగా రచించారు.

4.3 భాషా విశేషాలు

భాషా విశేషాల్లో భాగంగా చాకిరేవు కావ్యంలోని సంధులు, సమాసాలు, సామెతలు, నుడికారాలు, లోకరీతి వాక్కులు, విశిష్ట పద ప్రయోగాలు, వివిధ సందర్భాల్లో స్త్రీని సూచించడానికి ప్రయోగించిన పదాలు మొదలైన భాషా విశేషాల్ని పరిశీలించటం ఈ అధ్యాయంలో జరుగుతుంది.

4.3.1 సంధులు

' 'సంధి' అంటే కూడిక లేదా చేరిక అని అర్థం. సంధి అనే పదం 'ధా' అను ధాతువుకు 'సమ్' అనే ఉపసర్గ చేరి సంధి అనే పదరూపం ఏర్పడింది. 'పర:సన్నికర్ష సంహిత' అని పాణిని మహర్షి సంహితను నిర్వచించారు. సంహిత అంటే వర్ణాల సామీప్యం. రెండు వర్ణాలు అర్థమాత్రాకాలం కంటే ఎక్కువ వ్యవధానం లేకుండా ఉచ్చరించడమే సంహిత. సంహితలో పదాలకు వర్ణలోప, వర్ణాగమ, వర్ణాదేశ ప్రకృతి భావాల్లో ఏదైనా కలగవచ్చు. అలా కలిగితే ఏర్పడే రూపాలే సంధిరూపాలు.ప్రాచీన తెలుగు వ్యాకర్తలు సంస్కృత సంధి సంప్రదాయాన్ని అనుసరించి వారి వ్యాకరణ నిర్మాణానికి అనుగుణమైన సంధి నిర్వచనాలను ఇచ్చారు' (కట్టా వరదరాజు ద్విపద రామాయణం భాషా పరిశీలన).

మొదలి పదము తుది వర్ణము
వదలక పై పదము మొదలి వర్ణముతోడన్
గదియగ సంధులు నాదగు

(ఆంధ్రభాషాభూషాణం) అని కేతన నిర్వచించినారు.

ఆది శబ్దాంత వర్ణంబు నంత్య శబ్ద
పూర్వ వర్ణంబుతో, గూడ బొత్తు చేత
సంధియగు, గారక క్రియా సంగతములు
పెక్కు రూపంబులవి గానిపించు తెలియ

(కావ్యాలంకార చూడామణి) అని పెద్దన నిర్వచనం.

కేతన, పెద్దన సంధికి ఇచ్చిన నిర్వచనాలను పరిశీలిస్తే వారు అంతస్సంధిని మాత్రమే సంధిగా గుర్తించారని తెలుస్తోంది. 'పూర్వ పర స్వరంబులకు పరస్వరం ఏకాదేశంబగుట సంధియనంబడు' అని చిన్నయసూరి సంధిని నిర్వచించారు. బాలవ్యాకర్త సంధి లక్షణం కన్నా కేతన, పెద్దనల సంధి లక్షణాలు కొంత అధిక వ్యాప్తిని కలిగి ఉన్నా తెలుగు భాషలో జరిగే సంధి స్వరూపాన్ని సమగ్రంగా నిరూపించలేవని భాషావేత్తలు అభిప్రాయపడ్డారు.

'కొన్ని అర్థకాలు కలిసి పదంగా ఏర్పడేటప్పుడు, కొన్ని పదాలు కలిసి వ్యాకంగా ఏర్పడేటప్పుడూ వాటిలో ధ్వనులు పరస్పర ప్రభావం వల్లనో లేక చారిత్రక కారణాల వల్లనో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటువంటి ధ్వనుల మార్పు సంధి' అని పి.ఎస్ సుబ్రహ్మణ్యం ఇచ్చిన సంధి నిర్వచనం చాలా వరకు తెలుగు భాషా సంధి సంప్రదాయాన్ని వివరిస్తుంది. సంధిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

1. అంతస్సంధి
2. బాహ్యసంధి

అంతస్సంధి

రెండు అర్థకాలు కలిసి ఏర్పడేటప్పుడు జరిగే సంధినే అంతస్సంధి లేదా పదమధ్య సంధి అంటారు. ధాతువుకు లేదా ప్రాతిపదికకు లేదా ప్రత్యయానికి సంధి జరిగితే ధాతువు లేదా ప్రాతిపదికల్లోని చివరి అచ్చుకు నిత్యంగా లోపం వస్తుంది.

బాహ్య సంధి

పదం ఏర్పడిన తర్వాత రెండు పదాలు కలిసి పదంగా ఏర్పడే సంధిని బాహ్యసంధి లేదా పదాంత సంధి అంటారు. ఇది రెండు రకాలు అవి

1. అచ్సంధి
2. హల్సంధి

4.3.1.1 అత్వసంధి

పూర్వ పదంలోని చివరి అచ్చు 'అ' కారానికి పరపదం మొదట ఉన్న అచ్చుపరమైతే లోపం బహుళముగా జరుగుతుంది. అలా లోపించినప్పుడు పూర్వ అకారానికి పర పదాది అచ్చుకు మధ్య యకారాగమం వస్తుంది. దీనినే బాల వ్యాకర్త "సంధిలేనిచోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు" అనే సూత్రంలో చెప్పారు.

అజాది రూపం పర పదంగా ఉన్నప్పుడు పూర్వపదంలోని సహజ హ్రస్వ అకారం లోపించిన రూపాలు

అ + అ

గంగ + అమ్మ = గంగమ్మ (4.2)
శివ + అయ్య = శివయ్య (4.6)

4.3.1.2 ఇత్వసంధి

పూర్వపదం చివర ఉన్న హ్రస్వ 'ఇ' వర్ణానికి అచ్చు పరంగా ఉంటే 'ఇ'కి లోపం వికల్పంగా వస్తుంది. ఇదంత రూపాలకు అజాది రూపాలు పరమైనప్పుడు ఇత్వసంధిం జరుగుతుంది. అజాది రూపం పరమైనప్పుడు పూర్వ పదాంత ఇకారానికి లోపం కొన్నిచోట్ల నిత్యంగా, కొన్నిచోట్ల వైకల్పికంగా వస్తుంది. మరికొన్ని చోట్ల లోపానికి బదులుగా 'య' కారం ఆగమంగా వస్తుంది.

4.3.1.3 ఉత్వ సంధి

పూర్వపర పదాలలో పూర్వ పదాంతంలో హ్రస్వ ఉకారం ఉన్నప్పుడు దానికి అచ్చు పరమైతే (పర పదాది వర్ణంగా అచ్చు ఉన్నప్పుడు) ఆ ఉకారం లోపిస్తుంది. దీనినే బలవ్యాకర్త 'ఉత్తనకచ్చు పరంబగునపుడు సంధియగు' అని సూత్రీకరించారు.

ఉ + అ

చూడను + అన్న = చూడనన్న (1.25)

ఎప్పుడు + అబ్బె = ఎప్పుడబ్బె (2.6)

ఉ + ఆ

యౌవనము + ఆది = యౌవనమాది (1.15)

ఉ + ఇ

పరుగులు + ఇడె = పరుగులిడె (2.4)

ఉ + ఉ

కన్నులు + ఉండి = కన్నులుండి (1.25)

ఉ + ఎ

ఎవరు + ఎటులైన = ఎవరెటులైన (2.4)

ఉ + ఐ

ఏకము + ఐరి = ఏకమైరి (1.13)

అంధుడు + ఐన = అంధుడైన (1.24)

ఉ + ఒ

ఒండు + ఒరుల = ఒండొరుల (1.5)

ఉ + ఔ

ఏకము + ఔచు = ఏకమౌచు (1.14)

గృహము + ఔచు + గృహమౌచు (1.14)

4.3.1.4 త్రికసంధి :

దూరవర్తి సర్వానామాంగమైన 'ఆ' సమీపవర్తి సర్వానామాంగమైన 'ఈ' ప్రశ్నార్థక సర్వనామాంగమైన 'ఏ'లలో 'ఆ, ఈ' నిర్దేశాత్మకాలు. 'ఏ' ప్రశ్నార్థక సర్వనామం. వీటిని బాలవ్యాకర్త: 'ఆ,ఈ,ఏ అను సర్వనామంబులు త్రికంబు నాబడు' అనే సూత్రంలో వివరించాడు. వీటికి ఊష్మరేఫలు, ద్విరుక్త హల్లులు పరమైనపుడు జరిగే సంధి విధానాన్ని 'త్రికంబు మీది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు గలుగదు" **'**ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు డాచ్చికంబు దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే సూత్రాలలో వివరించాడు.

ఆ + వారలు = అవ్వారలు (1.6)

ఆ + ఇంతి = అయ్యింతి (2.5)

4.3.2 సమాసాలు

'సమసనం సమాస:' సమసించునది సమాసం. సమాసం అంటే పదాల కలయిక. సమర్థవంతాలైన రెండు లేదా అంతకంటే ఎక్కువ పదాలు కలిసి ఒకే పదంగా రూపుదిద్దుకోవడమే సమాసం. వేర్వేరు అర్థాలు ఉన్న పదాలు ఒకే అర్థం ఉన్న పదంగా రూపొందడమే సమాసం. ఉదాహరణకు 'ఉమాపతి'లో ఉమ అంటే పార్వతి, పతి అంటే భర్త అని అర్థం. ఈ రెండు పదాలు కలిసి ఏర్పడిన 'ఉమాపతి' అనే సమాసానికి శివుడు అని అర్థం. ఈ విధంగా వేర్వేరు అర్థాలు ఉన్న రెండు పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడుటయే సమాసం.

శబ్దాన్ని బట్టి సమాసాలు 3 రకాలు : 1.సాంస్కృతికం

2. ఆచ్ఛికం

3.మిశ్రమం

సంస్కృత పదాలు లేదా తత్సమ పదాలతో ఏర్పడేది సాంస్కృతిక సమాసం. ఇది మరలా సిద్ధ సాంస్కృతికం, సాధ్య సాంస్కృతికం అని రెండు రకాలు. కేవలం తెలుగు పదాలతో ఏర్పడేది ఆచ్ఛికం. సంస్కృత, తెలుగు పదాలకు జరిగే సమాస మిశ్ర సమాసం.

అర్థభేదం వల్ల ఏర్పడే సమాసాలు 4 రకాలు

1. అవ్యయీ భావ 2. తత్పురుష 3. ద్వంద్వ 4. బహువ్రీహి

తత్పురుషం

ఉత్తర పద అర్థం ప్రధానంగా కల్గిన సమాసం తత్పురుష సమాసం. అంటే రెండవ పదానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇది సమానాధికరణం, వ్యధికరణం అని రెండు రకాలు.

సమానాధికరణం:

ఇది విశేషణం, నామవాచకాలతో ఏర్పడే సమాసం.

ద్విగు, కర్మధారయమని మరల రెండు రకాలు:

4.3.2.1 ద్విగు సమాసం

సంఖ్యా పూర్వయు ద్విగువు. అనగా సంఖ్యా వాచక విశేషం పూర్వపదరంగా, నామవాచకం పరపదంగా ఉంటుంది.

త్రిదశ – మూడు దశలు (1.5)

పదునాల్గువసంతాలు – పద్నాలుగు వసంతాలు (1.14)

కర్మధారయం

విశేషణ, విశేష్యాలకు, ఉపమాన ఉపమేయాలకు జరిగే సమాసాలను కర్మధారయ సమాసాలంటారు.

4.3.2.2 విశేషణ పూర్వపద కర్మధారయం

విశేషణం పూర్వపదంగా ఉంటే ఆ సమాసాన్ని విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం అంటారు.

శుభారంభం	-	మంచిదైన ఆరంభం (1.12)
చిన్నచూపు	-	చిన్నదైన చూపు (1.23)
వింతగాథ	-	వింతైన గాథ (1.22)
పవిత్రవిధాయకము	-	పవిత్రమైన విధి / పవిత్రమైన ఆజ్ఞ (1.24)
పావన జన్మ	-	పావనమైన జన్మ (26)
పుణ్యకర్మ	-	మంచిదైన పని (1.26)
నల్లకల్వ	-	నల్లనైన కలువ (1.27)
వడగాడ్పు	-	వేడైన గాలి (2.4)
పాడుగాడ్పు	-	చెడ్డదైన గాలి (2.5)

4.3.2.3 సంభావనా పూర్వపద కర్మధారయం

సంభావన అనగా సంబోధన, గుర్తు అని అర్థం. ఈ సమాసంలో పూర్వపదం సంజ్ఞానామ వాచకమై ఉంటుంది. ఉత్తర పదం జాతి వాచకంగా ఉంటుంది.

గోదావరీమాత - గోదావరి అనే పేరు గల మాత (1.17)

అరబీలదేశం - అరబ్ అనే పేరుగల దేశం (3.17)

వ్యధికరణం

ద్వితీయా విభక్తి మొదలుకొని సప్తమీ విభక్తి గల అర్థవంతమైన పదాలు గల సమాసమే వ్యధికరణం.

4.3.2.4 షష్ఠి తత్పురుష

షష్ఠీ విభక్తి ప్రత్యయాలు కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ ఈ విభక్తులతో ఏర్పడే సమాసాన్ని షష్ఠీ తత్పురుష సమాసం అంటారు.

పుణ్యులచెంత - పుణ్యుల దగ్గర (1.10)

రాముని మాట - రాముని యొక్క మాట (1.10)

శరీర శౌచము - శరీర యొక్క శుద్ధి (1.24)

తరుణీ ముఖము - తరుణి యొక్క ముఖం (2.1)

4.3.2.5 నఞ తత్పురుష

ఇది వ్యతిరేకార్థాన్ని తెలియజేస్తుంది.

అధర్మం - ధర్మం కానిది (2.3)

4.3.2.6 ద్వంద్వ సమాసం

ఉభయ పదార్థ ప్రధానం ద్వంద్వం. ఇది ఉభయ పదాల అర్థం ప్రధానంగా ఉన్న సమాసం. ఇందులో రెండు పదాలకూ సమ ప్రాధాన్యం ఉంటుంది. రెండు పదాలూ నామవాచకాలై ఉంటాయి.

శస్త్రాస్త్రములు – శస్త్రము, అస్త్రము (1.11)

పతిపత్నులు – పతియును, పత్నియును (1.15)

ఉచితానుచితములు – ఉచితము, అనుచితము (2.5)

4.3.2.7 బహువ్రీహి సమాసం

అన్యపదార్థ ప్రాధాన్యం కలది. అంటే సమాసంలో ఉండే రెండు పదాల అర్థాలు కూకుండా వేరే అర్థాన్ని స్ఫురింపజేస్తే దాన్ని బహువ్రీహి సమాసం అంటారు.

తమ్మిచూలి – తమ్మియందు పుట్టినవాడు (బ్రహ్మ) (1.25)

ఆత్మజుడు – తనయందు పుట్టినవాడు (కొడుకు) (2.3)

4.3.3 సామెతలు

సామెతలు ఒకరివల్ల సృష్టించబడ్డాయని చెప్పలేం. అంటే స్పష్టంగా రచనకు రచయితలాగా సామెతకు కర్తను నిర్ధారించడం కష్టం. జానపద గేయాల్లాగా సామెతలూ మౌఖిక ప్రచారం ఆధారంగా ప్రజల్లో ప్రచారం పొందుతాయి. సామెతల్లో సునిశిత హాస్యం, వ్యంగ్యం, సందేశం, లోకానుభవం మొదలైనవి దాగి ఉంటాయి. సామెతలు ఒక భాషా సమాజంలోని ప్రజల సాంఘిక జీవిత మర్యాదల్ని తెలియజేస్తాయి.

కొండయ్య గారు సంర్భానుచితంగా <u>చాకిరేవు</u> కావ్యంలో సామెతల్ని ప్రయోగించారు. అవి

ఇదిగొ పులియనంగ నదిగొ తోకయనును (1:22)

మూర్ఖో బ్రహ్మాపి న రంజయతి (1:25)

ప్రాణముకె తోకవరకు వచ్చె (1:16)

గుడుము గొట్టు గుండ్రాయియైనచో (2:18)

చదవుకంటె మేలు చ ఆకలితనమని (2:19)

అతివ రా నమవాస మన్న పగిధి (3:8)

ఆడుదేడ్చిన కాపుర మచ్చిరాదు (4:7)

జ్ఞానాన్ని మించిన ధనమ్ములేదు (6:16)

నక్క బెబ్బు లింగని వాతలు పెట్టుకున్న చందమాయె (2:25)

4.3.4 నుడికారం

నుడికారం, పదబంధాలు భాషకు కొత్త సొబగును చేకూరుస్తాయి. ఇవి భాషకు అలంకారం లాంటివి. నుడికారానికి వాచకము, మాట, రచనము, మాట చమత్కారము అనే అర్థాలున్నాయి.

"శ్రీరాముని దయచేతను

నారూఢిగ సకల జనులు నౌరా యనగా

ధారాళమైన నీతులు

నోరూరగ జవులు బుట్ట నుడివెద సుమతీ!" (సుమతీ శతకం) అన్న సుమతీ శతకకారుడి పై పద్యం చూస్తే ఇక్కడ ఔర అనడం నుడికారపు సొగసు అనే విషయం సులభంగా అర్థమవుతోంది. నుడికారం జన జీవనంలో నుండి, వారి మాటల్లో నుండి వస్తుంది.

ఒక భాష నుడికారమనేది ఆ ప్రజల జీవన విధానం, అక్కడి వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, జనబాహుళ్యం ఆమోదించిన పద్ధతులు, ఆచారాలు, ఆట పాటలు మొదలైనవి నుడికారాలలో ధ్వనిస్తుంటాయి. ఈ కావ్యంలో పల్లె ప్రజలు వాడే ఎన్నో పదాలను కవి సందర్భానికి తగ్గట్టు ప్రయోగించారు. వాటిలో దాగివున్న భావ సౌందర్యం ప్రతి ప్రకరణంలో గమనించవచ్చు.

(1) నీల్గుచున్నాడు (6.9)

నీల్గడం అంటే గర్ర, టెక్కు, పొగరుతో ఉండటం అనే అర్థాలున్నాయి. ఎవరైనా పెడసరంగా ప్రవర్తించినపుడు తెగ నీల్గుతున్నాడని అనడం సహజం. గంగమ్మ, శివయ్య దంపతుల పెద్ద కుమారుణ్ణి తన తమ్ముణ్ణి ఎత్తుకోమన్న సందర్భంలో ఎత్తుకున్న ప్రతిసారి ఆ చంటివాడు నిక్కరు తడపకుండా వదలడని, పసివాణ్ణి ఉద్దేశిస్తూ పెద్ద పిల్లవాడు 'తీసికొనుము వీని తెగ నీల్గుచున్నా'డని అంటారు.

(2) ముడుపు గట్టితి (5.27)

ముడుపు కట్టడం అంటే దేవునికి మొక్కకొని డబ్బు మొదలైనవి ఒక పసుపు గుడ్డలో కట్టి దేవుని దగ్గర ఉంచడం. తాము కోరుకున్నవి జరిగిన తర్వాత ఆ ముడుపుని దేవునికి సమర్పిస్తారు. ఇలా ముడుపు కట్టడాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. స్థూలంగా ముడుపు కట్టడం అంటే సమర్పించడం అని అర్థం.

శివయ్య రాజకీయాల్లోకి వెళ్తే జరిగే పరిస్థితులను వివరించినపుడు జరిగిన వాగ్వాదంలో భాగంగా 'నా మట్టకు సర్వమున్ ముడుపు గట్టితి నీకయి' అని గంగమ్మతో కవి పలికిస్తారు.

(3) రెండు జాములు (2.13)

'జాము' పాత తెలుగు కాలగణన పద్ధతికి సంబంధించినది. దీనికే ప్రహారము అని పర్యాయపదం. పహారా (కావాలి/గస్తీ) దీనిలో నుండి వచ్చిందే. జాము అంటే ఇప్పటి లెక్కలో సుమారు మూడు గంటల వ్యవధి. రాత్రిపూట వచ్చే జాములకు వరుసగా 1.రామము 2.విరామము 3.సుప్తము 4.ప్రసుప్తము అని పేర్లు. నాలుగు జాములు పగలు, నాలుగు జాముల రాత్రి కలిసి అహోరాత్రమౌతుంది. రెండు జామలు అంటే మిట్టమధ్యాహ్నమని నైఘంటికార్థం ఉంది. 'ఇకనైన తినుము, తడవేమిటి కాయెను రెండు జాములని' అన్నం తినడానికి ఎందుకు ఆలస్యమైందని రజక గృహిణి మాటల్లో ఈ పదాన్ని కవి ప్రయోగించారు.

(4) కూర్కు (3.24)

కూర్కు అంటే నిద్రించడం అని అర్థం. కూరుపు పాట్లు పడటం అనే ప్రయోగం దీని నుండే వచ్చింది. ఇప్పటికీ పల్లె ప్రాంతాల్లో ఈ పద ప్రయోగం నిలిచి ఉంది. 'పారి పారి యొడిని కూర్కు బాలు నెడదబడిన' గంగమ్మ ఏడ్చి నపుడు ఆమె కళ్ల నుండి కారిన నీరు చెక్కిలిపై, అటు నుండి హృదయస్థానం గుండా ఒడిలో నిద్రిస్తోన్న పిల్లవాడి గుండెమీద పడిందని ఎంతో అద్భుతంగా వర్ణించారు.

(5) చిటపటలు (3.1)

చిటపట అంటే అగ్ని కణాల ధ్వనికి అనుకరణమని నైఘంటికార్థం. జన సామాన్యంలో ఎవరైన అలక పూనినపుడు ఈ తరహా పద ప్రయోగం కనిపిస్తుంది. 'చిటపటలు మాని తిను' కోపం మాని భార్యను అన్నం తినమని శివయ్య పలికే సందర్భంలోని ప్రయోగమిది.

(6) ఏష్ట (3.1)

ఏష్ట అంటే విసుగు, దీని నుండి వచ్చిందే ఏష్ట అనే పదం తెలంగాణ వాసులకు సుపరిచితమైన పదం. బాగా విసుగు చెందిన భావాన్ని వ్యక్తపరిచే సందర్భంలో ఏష్టక్ వస్తుంది అని వాడతారు. 'ఇటు లేష్టపడుచు...' అన్నం గిన్నె ముందు పెట్టుకొని అంతకు ముందు జరిగిన గొడవ వల్ల అన్నాన్ని నేతితో అటు ఇటూ కలుపుతోను గంగమ్మను తినమని అనునయించే సందర్భాంలోని ప్రయోగమిది.

(7) చదికిల కూరుచుండి (2.30)

చదికిల కూర్చోడం/చతికిల కూర్చోడం అంటే నీరసస్థితిలో గాని లేదా మామూలుగా కూర్చోటం, కూలబడి అనే అర్థాలున్నాయి.

(8) పుక్కిలించి (3.2)

పుక్కిలి అంటు బుగ్గ లోపలి భాగం. పుక్క పదానికి రూపాంతరమే పుక్కిలి, పుక్కిలింత, దీన్ని నీళ్లను నోట్లో పోసుకుని మరలా బయటకు పంపించు ఒకానొక విధానంగా చెప్పవచ్చు. ఆధునిక ఆహార మర్యాదల్లో భాగంగా కన్పించే ఈ క్రియ కూడా పాటించేవారని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ.

'చేయి కడిగి చీర చెంగున తుడిచి, తా
నిన్ని నీళ్లు పుక్కిలించి యమిసి'

గంగమ్మ అన్నం తిన్న తర్వాత చేయి కడుక్కుని, చీర చెంగుకు తడి చేతిని తుడుచుకుని నీళ్లు పుక్కిలించిందిని కవి ప్రయోగించారు.

4.3.5 లోకరీతి వాక్కులు, విశిష్ట పద ప్రయోగాలు

కొండయ్య గారు ఈ కావ్యంలో కొన్ని విశిష్ట పదాలను సహజరీతిలో ప్రయోగించారు.

(1) కౌను పైన జుట్టి (2.2)

నాయికను వర్ణించే సందర్భంలో ఎంతో రమ్యంగా ఈ ప్రయోగం చేశారు. ముఖంపైన పడుతున్న ముంగురులను చేతితో సవరించి, నడుస్తోంటే పక్కకు జరుగుతూ , జారుతోన్న పైట పొగణనచడానికి గంగమ్మ ఆ పైటను నడుముకు చుట్టింది. కౌను అంటే నడుమని అర్థం.

(2) ధూళి దూసరము (2.4)

మామూలుగా దుమ్ముధూళి అనే పదం జన సామాన్యంలో విరివిగా ఉపయోగంలో ఉంది. దాన్నే ధూళిదూసరముగా కవి ఉపయోగించారు.

కొంచెమైన అనే అర్థంలో రవ్వంత, కాసింత అనడం సహజం. ఆవగింజ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటుంది. దానితో పోలుస్తూ అంత కొంచెం కూడా ఆలోచించకుండా గాలి వీచడంతో గంగమ్మ తలపైన దుమ్మ పడింది. దానిని చెప్పడానికి 'ఆవంత తలపదాయె నుచితానుచితమ్ములు' అని ప్రయోగించారు.

(4) తవులు (2.9)

తవులు అంటే వెంబడించడం. తగులుకోవడం అనే వ్యంగ్యార్థం ప్రయోగంలో ఉంది.

(5) కట్టెదుట (2.11)

తిరుమల కొండ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 'కట్టెదుర వైకుంతము కాణాచయిన కొండ' అని అన్నమయ్య కీర్తనలలో వర్ణించాడు. ఇక్కడ కట్టెదుట అనే పదాన్ని కంటికి ఎదురుగా అన్న అర్థం వచ్చేలా ఉపయోగించారు.

(6) చెరగు (2.11)

చెరగు అనే క్రియా పదానికి చెరగటం అని అర్థం. బియ్యం, ధాన్యాలు చెరగే సందర్భాల్లో వాడుతుంటారు. అయితే ఇక్కడ చెరగు అనే పదాన్ని అందుకు భిన్నంగా కొంగును సూచించడానికి వాడారు. తన కొంగు అంచు లాగి భర్త ముఖంపైన చెమటను తుడిచిందని కవి ప్రయోగం.

(7) గుడము గొట్టు గుండ్రాయి (2.18)

గుడము అంటే బెల్లం. ఎవరైనా కదలిక లేకుండా, పనిలో చురుకు చూపించని సందర్భంలో బెల్లం కొట్టిన రాయిలా నిల్చున్నావే అనడం చూస్తుంటాం. రాయితో ఏ వస్తువును కొట్టినా శబ్దం వస్తుంది. కానీ బెల్లపు అచ్చును కొట్టినప్పుడు మాత్రం తక్కువ శబ్దం వస్తుంది. అంటే రాయి కాస్తా తన సహజమైన లక్షణాన్ని కోల్పోయింది.

పిల్లవాడికి బడే తల్లి, ఒక్కపని కూడా ముట్టుకోవట్లేదంటూ భర్త బెల్లంకొట్టి రాయిలా ఉంటే ఆడదాని (భార్య) వల్ల ఏమవుతుందని వ్యంగార్థంలో కవి ప్రయోగించారు.

(8) చదికిల కూరుచుండి (2.31)

చతికిల/చదికిలగా కూర్చోడం అంటే నీరసస్థితిలో గాని మామూలుగా కింద కూర్చోవడమని అర్థం. శివయ్య తినడానికి కూర్చున్న స్థితిని ఈ ప్రయోగం ద్వారా తెలియజేశారు.

(9) చిటపటలు (3.1)

విసుగ్గా అన్నాన్ని చేతితో అటూ ఇటూ అంటోన్న భార్యతో చిటపటలు మాని తినమంటూ భర్త చెప్పడాన్ని ఈ పదంతో కవి సూచించారు. కోపంగా ఉన్న ఈ స్థితిని తెలియజేయడానికి ఈ పదం వాడతారు.

(10) ఎకాయెకి (6.5)

ఎకాయెకి అంటే సరాసరి, ఉన్నపలాన, హుటాహుటిన మొదలైన అర్థాలున్నాయి. లాటరీ వచ్చిందని చెప్పడానికి పిల్లవాడు బడినుండి గుడిసెకు పోకుండా సరాసరి తల్లిదండ్రులు చాకిరేవు దగ్గర ఉంటే అక్కడికి వచ్చాడని చెప్పే సందర్భంలో చాలా సహజంగా ఉండేలా ఎకాయెకి పదాన్ని ప్రయోగించారు.

(11) కూర్కు (3.24)

కూర్కు అంటే నిద్ర. కూరుపు పాట్లు పడడం దీని నుంచి వచ్చిందే. గంగమ్మ ఏడస్తోంటే ఆమె కనుల నుండి కారిన నీరు చెంపలపై జారి, ఎద భాగంపై పారి ఒడిలో నిద్రిస్తున్న పిల్లవాడిపై పడగానే ఆ పిల్లవాడు దిగ్గున తేచాడని చెప్పే సందర్భంలో కవి అత్యంత సుందరంగా ఈ ప్రయోగం చేశారు. అటువంటివే మరికొన్ని పదాలు

(12) మెదపి (5.17)

మెదపడం అంటే కలపడం అని అర్థం. “నీలమణులు మెదపి నిను జేసే పో దేవు” నీలమణులను కలిపి దేవుడు గంగమ్మను సృష్టించాడని శివయ్య తన భార్య గురించి వర్ణించిన సందర్భంలోని ప్రయోగం ఇది.

(13) మిత్తి (5.18)

మిత్తి అనగా మృత్యువు, చావు. వివాహ బంధం గురించి శివయ్య ‘భార్య తనకు ప్రాణంలాంటి’దని అంటాడు. సుఖమైన దు:ఖమైనా, స్వర్గమైనా నరకమైనా కలిసే ఉందామని భార్యకు సూచిస్తాడు. చావులో కూడా కలిసే ఉందామని భార్య పట్ల తనకున్న అనురాగాన్ని వ్యక్త పరిచే సందర్భంలోని కవి ప్రయోగమిది.

(14) వాసి (5.34)

వాసికెక్కడం అంటే ప్రసిద్ధి చెందడం.

(15) పదిలం (6.7)

పదిలం అంటే జాగ్రత్తగా అని అర్థం. గ్రామానికి వెళ్ళాలని శివయ్య చెప్పగానే గంగమ్మ చిన్న పిల్లాడిని ఎత్తుకోమని పెద్ద పిల్లవాడి ఒడిలో జాగ్రత్తగా పెడుతుంది. “ఎత్తుకొనుమురా: ఇదిగో నీ తమ్ముండని పదిలమ్ముగ బాలు నొడిని పట్టిం బెట్టెన్” అని కవి ప్రయోగించారు.

ఈ విధంగా కొండయ్య గారు సహజమైన రీతిలో పల్లెపదాలను ప్రయోగించారు.

4.3.6 "స్త్రీ" ని సూచించే పదాలు

కవి నాయికను వర్ణించే సందర్భంలో, వివిధ సందర్భాల్లో స్త్రీని సూచించడానికి ఈ క్రింది పదాలను ఉపయోగించారు.

చేడియ (2.1)

వెలది (2.2)

తరుణి (2.1)

కాంతా (2.8)

వనజాక్షి (2.8)

అంగన (2.9)

సతినారసి (2.12)

చినదాన (2.1)

భామామణి (2.21)

నాయమ (2.24)

చేడి (2.26)

అతివ (3.1)

చెలియ (3.3)

భామిని (3.10)

తన్వి (3.16)

మానిని (3.23)

ఆమె (4.10)

సతి (5.6)

సుదతీ (5.10)

జాయ (5.13)

దార (5.13)

పుబోడి (5.24)

అయిదవ అధ్యాయం

అధ్యాయం - 5

చాకిరేవు కావ్యం : జాతి వార్తా చమత్కారాలు

5. జాతి వార్తా చమత్కారాలు

జాతి, వార్త, చమత్కారం పదాలు తెలిపే అర్థం సాధారణంగా మనకు తెలిసిందే. అయితే సాహిత్యంలో వీటిని విశేషమైన అర్థంలో వాడుతారు. ఏ సాహిత్య రూపానికైనా మూలం, ముడి సరుకు సమాజమే. కవి తన సమకాలీన సమాజంలోని వివిధ అంశాలను సందర్భానుగుణంగా చెప్పి కథను నడిపిస్తాడు. వీటిని తెలుసుకోవడం ద్వారా ప్రజల జీవనవిధానానికి సంబంధించిన అంశాలను గ్రహించే అవకాశం ఉంది. సామాజికాంశాల ప్రతిఫలనంలో జాతి, వార్త, చమత్కారాల పాత్ర ప్రముఖమైంది.

"15వ శతాబ్దిలో తెలుగు సాహిత్య గతిలో మార్పు వచ్చింది. సమకాలీన సమాజంలోని వాస్తవిక జీవితాన్ని అనుభవిస్తూ సాహిత్య జీవితంలో కూడా దానిని ప్రతిఫలింపచేయాలన్న తపన,ప్రయత్నం ఈ యుగరచనలలో కనబడుతుంది. ఈ విధమైన ప్రవృత్తికి శ్రీకారం చుట్టిన మహాకవి శ్రీనాథుడు" (సాహిత్య చరిత్రలో చర్చనీయంశాలు : పుట 156)

సమాజంలో కనిపించే వాస్తవాలకు తన అనుభవాన్ని జోడించి ఆశువుగా చాటువు రూపంలో కవిత్వం వెలువరించడం ఈ మహాకవి ప్రత్యేకత. అనుభవ పూర్వక వాస్తవికతను చమత్కారంగా చాటువుల్లో చెప్పడమే కాక తన ఇతర కృతులలోనూ ప్రతిఫలింపచేశాడు.

సామాజిక వాస్తవాలకు స్పందించి, ఆ స్పందనలను కవిత్వరూపంలో వెలువరించడం,కావ్యాలలో పొందు పరచటం అనే నూతన కవిత్వరచనా ధోరణి క్రీడాభిరామంలో కూడా కనిపిస్తుంది. ఇదే తరహా ధోరణి శ్రీనాథయుగంలోని కథా కావ్యాలైన విక్రమార్క చరిత్ర, భోజరాజీయం, సింహాసన ద్వాత్రింశిక మొదలైన కావ్యాలలోనూ శ్రీనాథ యుగానంతర కథా కావ్యాలైన శుక సప్తతి, హంసవింశతిలలోను మరికొంత ముందుకు వెళ్తే కృష్ణదేవరాయలలోనూ కనిపిస్తుంది. ఆంధ్ర సాహిత్యములో జాతివార్తలను విరివిగా ప్రయోగించిన వారు దక్షిణాంధ్రయుగ కవులు. జాతి వార్తలను సంస్కృతాలంకారికులు నైఘంటికులును ఆయా లక్షణములను చెప్పినను దక్షిణాంధ్రయుగ కవులే వీటికి మిగుల ప్రాచుర్యమును కల్పించి వెలుగులోనికి తెచ్చియున్నారని చెప్పవచ్చును' అని లూకానందం వివరించారు. ఈ ప్రయోగ ఆరంభ వికాసాల క్రమం శ్రీనాథ యుగంలోనే ఆరంభమైనా అవి అప్పటి కావ్య అవతారికలలో స్పష్టంగా వాచ్యం చేయబడలేదు. అనంతర కవులు వాచ్యం చేశారు. జాతి వార్తా చమత్కారాలు వివిధ అర్థాలలో ప్రయోగించబడినా శ్రీనాథుని కాలానికి వీటికి ఒక ప్రత్యేకమైన అర్థం స్థిరపడింది.

5.1 జాతి వార్తా చమత్కారాల పరిచయం

జాతి వార్తా చమత్కార ప్రయోగం శ్రీనాథుని చాటువులలో పుట్టి పెరిగి కథాకావ్యాలకు పట్టుగా నిలిచింది. పరస్పర సంబంధం కలిగిన ఈ జాతివార్తా చమత్కారాలను ముఖ్య కవితా లక్షణాలుగా శ్రీనాథయుగానంతర కవులు గుర్తించారు. జాతి వార్తా చమత్కార ప్రయోగాన్ని గురించి ఎందరో కవులు తమ కావ్యావతారికల్లో పేర్కొన్నారు. తమ కవిత్వ లక్షణాలను వివరిస్తూ 'జాతి వార్తా చమత్కారము'లనే పదాలను వాడిన మొదటి కవి చేమకూర వెంకటకవి.

తా రసపుష్టిమై ప్రతిపదంబున జాతియు వార్తమున్ జమ
త్కారము నర్థగౌరవము గల్గ ననేక కృతుల్ ప్రసన్నగం
భీరగతిన్ రచించి మహి మించిననోనిక శక్తు లెవ్వర
య్యా! రఘునాథ భూపరసికాగ్రణికిన్ జెవిసోక జెప్ప గాన్ (విజయవిలాసము: అవ 31)

చేమకూర తర్వాత జాతి వార్తలకు అధిక ప్రాముఖ్యాన్నిచ్చినవారు సవరం చిననారాయణ కవి.

ఒకచో శబ్ద నిగుంభనంబు,లొకచో యుక్తి క్రియా గౌరవం
బొకచో నద్భుత జాతి వార్త లొకచో నుజ్జృంభితత్త్రదస
ప్రకరంబుం గనిపించినన్ మదికి సంభావింపనర్హంబుగా
కకటా!యేమియులేని కబ్బమది యాహ్లాదంబు గావించునే (కువలయాశ్వచరిత్రము : 1:12)

కొట్రా వెంకటేశ్వర్లు తన *'విమలాంగీ పరిణయం'*లో

"ప్రతి పద ప్రాపితార్థ గౌరవము బాక
రీతి వృత్తి 'చమత్కార జాతి వార్త
లలర దోచిన గతి గూర్చి .... " అని ఆరుద్ర గారు ఉదహరించి చూపారు.

బైచరాజు వెంకటనాథుడు తన *పంచతంత్రం* అవతారికలో

"....... ఒకడు వార్తా సమృద్ధికి జెలంగు
.... ఒకడు జాతి శ్లాఘకుబ్బుచుండు" (బైచరాజు పంచతంత్రం: అవ 14)

అని ప్రయోగించారు. *వైజయంతీ విలాసం* అవతారికలో సారంగు తమ్మయ్య ప్రాచీన కవులను స్తుతించే సందర్భంలో

"జాతుల వార్తల ఉపమల రీతులబద బంధముల .. గృతులొనరించు" (వైజయంతీ విలాసం. అవ 12)

శ్రీకృష్ణదేవరాయులు ఆముక్త మాల్యదలో తన ఇతర రచనలను వివరిస్తూ

"పలికితుత్ప్రేక్షోపమల జాతి పెంపెక్క

రసికులౌనన మదాలస చరిత్ర............" (ఆముక్త మాల్యద : 1:13)

గణపవరపు వేంకటకవి జాతి, జాతి వార్తలు, జాతి వార్తా వచనం మొదలైన పేర్లతో అనేక పద్యాలు రాశారు. *ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసం* కావ్య అవతారికలో తన కావ్య లక్షణాలను వివరిస్తూ

..... జాతి వార్తా పాకరీతి శయ్యల మీటి... (శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విలాసం: 1:23)

"తప్పు గలిగిన చోటనె మొప్పు గలుగు

సరస కవితా చమత్కార సరణియందు.........." (శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విలాసం: 1:19)

"ప్రతి పద్యంబు జమత్కృతి

బ్రతి పదమును బ్రౌఢిమివుల బ్రరగిన కృతి స....." (శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విలాసం: 1:21) అని జాతి వార్తలతో పాటు చమత్కార ప్రాముఖ్యాన్నీ పేర్కొన్నారు.

పూర్వ కవి స్తుతిలో

అల విన్నకోట పెద్దన లక్షణజ్ఞత
శబ్దశాసనకవి శబ్దశుద్ధి
బ్రాబంధిక పరమేశ్వరు నర్థమహిమంబు
భయకవి మిత్రుని పద లలితము

శ్రీనాథు 'వార్తా ప్రసిద్ధి' నాచన
సోము భూరి కాఠిన్యంబు, పోతరాజు
యమక విధము మల్లయ మనీషి చి
త్రంబు బింగళ సూరకవివరుశ్లేష

నాంధ్ర కవితా పితామహు భూషణునియ
ముక్కు తిమ్మన తేటయు భూషణునియ
లంకృతియు,నీకె గలదౌ తలంప లక్ష
ణకవి యప్పయ వేంకట సుకవి చంద్ర

(శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసం: 1:34) ఈ కవితా లక్షణాలన్నీ తనలో ఉన్నట్లు భగవంతుడే వర్ణించినట్లుగా కవి చెప్పుకొన్నారు.

...... కుకవి ప్రబంధంబు మర్యాద జాతి వార్తా శూన్యంబై.........

(శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసం: 1:40) జాతి వార్తాది మర్యాదలు లేకుండా కొందరి ప్రబంధాలుంటాయని విమర్శించారు.

విజయ రాఘవ నాయకుని *హేమాబ్జ నాయికా విలాసం* యక్షగాన నాటకంలో రాజగోపాల స్వామి స్తుతిలో

హార మణీల సద్భూరి వక్ష
'వార్తా చమత్కార ' వైభవ ప్రద నామ
మార్తాండ మండల మహితధామ (*హేమాబ్జ నాయికా విలాసం*)

విజయరంగ చొక్క భూపాలుని ఆస్థానమంత్రి అళఘుర కవి *సుదంతా పరిణయం* ప్రబంధంలో తన పితామహుదులను వర్ణిస్తూ

...లలిత వార్తా చమత్కృతి లక్ష్మీ పతియు నన గ (*సుదంతా పరిణయం*) అని లక్ష్మీపతి కవి రచన లలిత వార్తా చమత్కృతి కలిగినదని వివరించారు.

కామరసు వేంకటపతి సోమయాజి *విజయ రాఘవ చంద్రికా విలాసం* అనే నాటకంలో చోళదేశ వర్ణన,విజయ రాఘువ నాయకుని వర్ణన సందర్భంలో

.... జాతి వార్తల మేటి శౌర్య కిరీటి
సరసుండు నెఱజాణ – చక్కని వాడు (*విజయ రాఘవ చంద్రికా విలాసం*) ఇలా ఎందరో కవులు తమ కావ్య అవతారికల్లో జాతి వార్తా చమత్కాల ప్రయోగాన్ని తెలియజేశారు. వాటిని పరిశీలిస్తే జాతి వార్తా చమత్కార ప్రయోగానికి ఉన్న విశిష్టత ఎలాంటిదో అర్థమవుతుంది.

5.1.1 జాతి

'జాతి' శబ్దం జన్ ధాతు నిష్పన్నం.జాతి అనగా పుట్టుట అని అర్థం. దీనికి 'సామాన్యమ్' అనే సమానార్థకముంది.

ఆకృతి గ్రహణా జాతి:లింగానాఞ్చ న సర్వ భాక్

స కృదాఖ్యాత నిర్గ్రాహ్య గోత్రంచ చరణై: సహ (శబ్దకల్పద్రుమ : పుట 530) అని జాతిని నాలుగు విధాలుగా గుర్తించవచ్చని శబ్దకల్పద్రుమం పేర్కొన్నది. అవి 1. ఆకార వర్ణనల వల్ల మనుష్య, మృగ, గో, హంసాది జాతులుగా గ్రహించటం 2. లింగాన్ననుసరించి స్త్రీ లింగం, పుం. లింగం, నపుంసకలింగంగా గ్రహించటం 3. గోత్రాన్ని బట్టి జాతిని నిర్ణయించటం 4. పాదాలను బట్టి జాతులను నిర్ణయించటం. ఉదాహరణకు ద్విపద - మనుష్య, పక్షి; చతుష్పద - పశువులు; షట్పద - తుమ్మెదలు మొదలైనవి.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో జాతికి జన్మము, వంశము, వర్ణము, రీతి, విధము, గోత్వాది జాతి, అర్థాలంకారం, సప్త స్వరాలు, ఛందం మొదలైన అర్థాలున్నాయి.

జాతి అంటే కులము, పుట్టుక, సామాన్యము, అర్థాలంకారము, జాజి మొదలైన అర్థాలు శబ్దరత్నాకరంలో ఉన్నాయి.జాతికి. Birth, Race, Caste, The properties which are peculiar to a class and distinguish it from all others, The essential characteristics of a specise; as see అన్న అర్థాలను The students Sanskrit English Dictonary సూచించింది. దీని ప్రకారం సాహిత్య పరంగా జాతి అనేది ఆకార వస్తు పాత్ర చిత్రణాదుల వర్ణనమని గ్రహించవచ్చు.ఇంతవరకు జాతికి గల నైఘంటికార్థాలను వివరించటం జరిగింది.ఆలంకారికులు జాతిని గురించి ఇలా వివరించారు.

"నానావస్థం పదార్థానాం రూపం సాక్షాద్వివృణ్వతీ

స్వభావోక్తిశ్చ జాతిశ్చే త్యాద్యా సాలంకృతిర్యథా" (దండికావ్యాదర్శం II: 8) అని స్వభావోక్తికి పర్యాయపదంగా దండి 'జాతి' ని పేర్కొన్నాడు. అంటే వస్తువుల సూక్ష్మ స్వరూపాన్ని స్పష్టంగా వర్ణించడమే స్వభావోక్తి లేదా జాతి అలంకారం. ఇది జాతి, క్రియ, గుణ, ద్రవ్య మొదలైన భేదాలతో భాసిస్తుంది.

సమగ్రాంధ సాహిత్యం పదవ సంపుటిలో జాతి అంటే జోక్ అని ఆరుద్ర అభిప్రాయపడగా, జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ అభిప్రాయాన్ని ఖండిస్తూ "ఆరుద్ర గారి అర్థాన్ని కూడా 'జోక్' గానే మనం తీసుకోవాలేమో" అన్నారు. నాయక రాజుల కాలంలో జాతి అంటే హాస్యోక్తి అని అర్థం. జాతి చెప్పి నవ్వించడం అప్పుడు పరిపాటి" అని ఆరుద్ర వివరణ ఇచ్చారు.

తాపీ ధర్మారావు అభిప్రాయంలో జాతి అంటే స్వభావోక్తి. జాతికీ, స్వభావోక్తికి స్వల్పమైన భేదం కూడా ఉంది. జాతి అంటే స్వభావ వర్ణనలు అని వీరు భావించారు. చేమకూర – కవితా వైభవంలో ఎం.కులశేఖర్‌రావు గారు 'స్వాభావికమై కృత్రిమం కాని వర్ణనలు జాతి' అని పేర్కొన్నారు. జాతి వార్తా చమత్కారాల గురించి మరింత లోతుగా పరిశీలన జరిపిన విమర్శకులు జి.వి.సుబ్రహ్మణ్యం గారు. వీరు 'సమాజంలో కవి చూచిన వాస్తవాన్ని వాస్తవంగా వాఙ్మయంలో రికార్డు చేయటం పదిహేనవ శతాబ్ది సాహిత్య చైతన్యంలోకి శక్తి వంతమైన ధోరణి. దీనిని తరువాతి కాలంలో 'జాతి అని పిలిచినట్లు తెలుస్తున్నది' అంటూ

చిన్ని చిన్ని రాళ్లు చిళ్ళర దేవుళ్లు
నాగులేటి నీళ్లు నాపరాళ్లు
సజ్జ జొన్న కూళ్లు సర్పంబులును తేళ్లు
పల్లనాటి సీమ పల్లెటూళ్లు అన్న శ్రీనాథుని చాటువుని చూపించారు. పల్నాడులోని అప్పటి పల్లెటూళ్ల స్వభావాన్ని వివరించే పద్యం అది. అంటే వర్ణించబడే వస్తువు జాతి లక్షణం లేదా స్వరూప స్వభావాలు అర్థమయ్యేట్లుగా సహజ సుందరంగా సాహిత్య స్ఫూర్తి కలిగించేట్లు చెప్పడమే జాతి అని వారి అభిప్రాయం. వర్ణ్య వస్తువు సమకాలిన సమాజంలోని జీవిత వాస్తవం అయి ఉండాలి. అప్పుడే అది సామాజిక సాహిత్య స్పృహగా లెక్కించబడుతుంది.

సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు గ్రంథంలో ఆధునిక కావ్యాలలో జాతి వార్తలను సమన్వయించి చూపే సందర్భంలో సమాజంలోని "ఒకానొక అవస్థా విశేషాన్ని వాస్తవంగా ఉక్తి చమత్కారంతో ఆవిష్కరించేది జాతి" అంటూ ఉత్పల సత్యనారాయణాచార్యుల *ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు* కావ్యంలోని

సినిమాల ఖర్చుకై తన పుస్తకాలమ్మి
డింభాళి డబ్బు గడించు చోటు....
సోమకాసుర బోలు చోరుల కీనాడు...
వ్యాపార రంగమైనట్టి చోటు.. (*ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు*) పద్యాన్ని *ఉదహరించారు.*

5.1.1.1 చాకిరేవు కావ్యంలోని జాతి వర్ణన

స్వరూప స్వభావాలను వర్ణించడంలో మొదటి మెట్టు జాతి.సమాజంలోని ఒకానొక అవస్థా విశేషాన్ని వాస్తవంగా ఉక్తి చమత్కారంతో ఆవిష్కరించేది జాతి.చాకిరేవు కావ్యంలోని వివిధ జాతి వర్ణనలను ఇక్కడ గమనిద్దాం.

“మైలలుదుకు వారు మాలిన్యముల నూడ్చు

వారు తల్లికంటె వందనీయు............” (చాకిరేవు: పద్యం 23: పుట 5) పై పద్యం ద్వారా రజక వృత్తిని గురించి కవి తెలియజేస్తున్నారు.మన బట్టల మురికిని వదలగొట్టే పనిని చేస్తున్న రజకలు తల్లి కన్నా వందనీయులని కవి భావన.

“తరతరముల్ చనెన్ శతము ధావకు లీ మలినాంబరమ్ములన్
శిరమున మోతుబూని,ఒక శేషుడు భూమిని మోమునందు రె
వ్వరు కనిరయ్య?కన్పడని వానికి పూజలు సేతురేల?ముం
దర ధరబోలు మూతముల దాలుచు ధావక శేషులుండగన్” (చాకిరేవు: పద్యం 62: పుట 14)

తరతరాలుగా రజకులు ఏ విధంగా తమ వృత్తిని కొనసాగిస్తున్నారో,వారి శారీరక శ్రమను గురించిన ఈ పద్యంలో ఆ జాతి వర్ణన కనిపిస్తోంది.

“రెక్కలు ముక్కలౌనటులు రేబవలన్నదిలేక,దేవుడే
దిక్కుగ గొడ్డు చాకిరికి దీపము పెట్టి భజింపనేల?నీ
చక్కియ నున్న పోరళెకసక్కెము లాడుచు రాజకీయమం
దెక్కిరి చూడు మీవయి పిదే వయికుంఠ పటమ్మునిచ్చెనన్” (చాకిరేవు: పద్యం 58: పుట 13)

వైకుంఠపాళి ఆటలో నిచ్చెన వస్తే సులువుగా ఆటలో ముందుకు సాగవచ్చు.ఆ నిచ్చెనతో వారు నివసిస్తున్న ప్రాంతంలో యువకులు రాజకీయల్లోకి వెళ్ళడాన్ని పోల్చి భర్తకు రజక గృహిణి రాజకీయాల్లోకి వెళ్ళమనే సలహానివ్వడాన్ని బట్టి చూస్తే ఆప్పట్లో యువకులు సులువుగా ధనం సంపాదించేందుకు రాజకీయాలను అవకాశంగా భావించేవారని తెలుస్తోంది.

“........నాయమ నెత్తినోట మే
నంతయు దుమ్ముపోసిచనెబీ నన్నిట పేదలు లోకువే కదా?” (చాకిరేవు: పద్యం 31: పుట 8)

ఒక్కసారిగా వడగాలి వీచి రజక గృహిణి ఒళ్ళంతా దుమ్ము పడేసరికి పేదలు అన్నింటిలో లోకువే కదా అని ఆమె తలచడాన్ని వర్ణించి పేదలపై సమాజంలో ఎలాంటి చిన్న చూపు ఉంటుందో గాలిని ప్రతీకంగా తీసుకొని చెప్పారు.

"....కూడును గుడ్డ,సంతతిన్

గుట్టలుగా నొసంగు మగ గొడ్డటడెట్లు సతీవ్రతుండగున్" (చాకిరేవు: పద్యం 144: పుట 33)

భర్త తిట్టినా కొట్టినా లెక్కచేయక,ఇల్లు తప్ప వేరే ప్రపంచం లేదనుకుంటూ బతకడం, వంట వార్పు చేస్తూ ఉంటే ఆ గుణాన్ని బానిసత్వం అంటారు.అలాగే జీవనం సాగించేందుకు అవసరమయ్యే కూడు, గుడ్డ, సంతతిని భర్త సమకూర్చినంత మాత్రాన అతను సతీవ్రతుడు కాదని చెప్తూ వారి స్వభావాన్ని వర్ణించారు.

"కార్లు,డ్రయివర్లు,నురుకు నౌకరులు,వంట

వారు వడ్డనవారు,నూర్వశులు,రంభ

లప్సరసలు నాఫీసరు,లఖిలజనులు

అను నిమిషము నాకనుసన్న లరయుచుంద్రు" (చాకిరేవు: పద్యం 82: పుట 19) గొప్ప అధికారం కలవారు ఎలాంటి వసతులను అనుభవిస్తారో పై పద్యంలో వివరించారు. వారి కింద ఎంతమంది పని చేస్తారో కూడా తెలియజేస్తున్నారు.

"అద్రి పగిలినట్టు లాబోతరచి యాల

మంద వెనుక నడచె మల్లునివలె,

దూడల దరి పడుచు దూరె తల్లుల చంక,

లవియు మూరు కొనుచు ననునయింప" (చాకిరేవు: పద్యం 171: పుట 40) పశువులు ఇంటికి వెళ్ళే సమయంలో ఆవులు గుంపులుగా వెళ్తుంటే వాటి వెనుక ఓ ఎద్దు మల్లునిలాగా వెళ్తోందట.అది అరిచిన అరుపు కొండ పగిలిన శబ్దంలా ఉండే సరికి దూడలు ఒక్కసారిగా ఉలిక్కిపడి తల్లుల చంకల్లోకి దూరాయని వర్ణించారు.పశువుల గురించి ఈ పద్యం ద్వారా తెలియజేశారు.

"పతియౌవన సంపద కథి

పతి సతి,యజమానురాలి వంచింది యెవం

డితరుల కయ్యది యిడు న

ప్పతితునకున్ బ్రతికియుండ బట్టున్ పురుగుల్" (చాకిరేవు: పద్యం 141 : పుట 31) భార్యను వంచించి తిరిగే భర్తల స్వభావాన్ని తెలుపుతూ అలాంటి చెడ్డ పనులు చేయకూడదని చెప్తున్నారు.

5.1.2 వార్త

కవుల ప్రయోగాల వల్ల, అవతారికా పద్యాల వల్ల 'వార్త' అన్నది కావ్య లక్షణంగా తెలుస్తోంది. వార్తా శబ్ద వ్యుత్పత్తి అర్థాలను కాలానుగుణంగా అది సంతరించుకొన్న మార్పులను పరిశీలిస్తే అది కావ్య లక్షణంగా ఎట్లా స్థిరపడిందో తెలుస్తుంది.

"ఆన్వీక్షికీ త్రయీ వార్తా దండనీతిశ్చేతివిద్యా:" (అర్థశాస్త్రం: 1: 2 1) ఆన్వీక్షకి త్రయీ (ఋక్, యజు స్సామ వేదాలు), వార్తా (కృషి పశుపాలనం వాణిజ్యం) దండనీతి అని విద్యలు నాలుగు రకాలని కౌటిల్యుడు తెలిపాడు.

కౌటిల్యుడు వార్తను వృత్తి పరంగా వాడాడు. వృత్తి అనగా జీవనాధారం. ఏ పని చేయడం వల్ల మనం జీవించడానికి కావలసిన ధనం లభ్యమవుతున్నదో అదే వృత్తి. వృత్తి నుంచి పుట్టింది వార్త. మనుస్మృతిలో సప్తయోధ్యాయంలో రాజు అధ్యయనం చేయాల్సిన విద్యలను చెప్పే సందర్భంలో వార్తా శబ్ద ప్రయోగం కనిపిస్తుంది.

"త్రై విద్యేభ్యస్త్రయీం విద్యాం దండ నీతించ శాశ్వతీమ్
ఆన్వీక్షికీం చాత్మవిద్యాం వార్తారంభాంశ్చ లోకత:" (మనుస్మృతి : 7: 43)

కావ్యాలంకార *సంగ్రహం* గ్రంథ వివరణలో సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రి వార్తను వృత్తికి పర్యాయపదంగా కాక అర్థశాస్త్రానికి పర్యాయపదంగా పేర్కొన్నారు. 'వార్త పురుషార్థములలో నొకటైన యర్థమును గురించి వివరించు శాస్త్రము.కృషి (వ్యవసాయం),గోరక్షణ(పశు శాస్త్రం), వాణిజ్యం (క్రమ విక్రమాది వ్యవహారం)లిందే చేరును' అని వృత్తుల వల్ల లభించేది అర్థమే కనుక ఆ అర్థశాస్త్రమే వార్త అని వివరించారు.

"వార్తయందు జగము వర్తిల్లుచున్నది
మదియ లేని నాడ యఖిల జనులు
నంధకార మన్నులగుదురు గావున
వార్త నిర్వహింపలము పతికి" (ఆంధ్ర మహాభారతం : సభాపర్వం: I 51) నన్నయ వార్త శబ్ద ప్రయోగాన్ని పరిశీలిస్తే ఇది ధర్మరాజుకు నారదుడు రాజనీతిని ఉపదేశించిన సందర్భం. కనుక ఇక్కడ వార్త అంటే అర్థశాస్త్ర, మనుధర్మ శాస్త్రాలలోని అర్థాన్ని చెప్పుకోవాలి. ఈ విధంగా నిఘంటువులు, శాస్త్ర గ్రంథాలు ఇచ్చిన అర్థాన్ని చూస్తే అవి వృత్తి పరంగా ప్రయోగించబడ్డాయని తెలుస్తోంది. వార్త అన్నది ఒక రచనా పద్ధతిగా సంస్కృతి లాక్షణికులు పేర్కొన్నారు.

దండి కావ్యాదర్శంలో కాంతి గుణాన్ని వివరించే సందర్భంలో

"కాన్తం సర్వ జగత్కాన్తం లౌకికార్థానతి క్రమత్
తచ్చ వార్తాభిదానేషు వర్ణనా స్వపి దృశ్యతే" (కావ్యాదర్శం : 1: 85)

అందరికీ తెలిసిన విషయాలను మనోహరంగా వర్ణిస్తే అది కాంతి గుణమని ఆ కాంతి గుణం వార్తలో,వర్ణనలలో కనిపిస్తుందని దండి అభిప్రాయం. పుల్లెల శ్రీరామ చంద్రుడు గారు తమ వ్యాఖ్యానంలో పై శ్లోకంలో వార్త అనగా విషయములను చెప్పడమని వివరించారు.

జాతి అనేది జోక్ లేదా హాస్యోక్తి అని, వార్త ఒక నానుడిలాంటిందని ఆరుద్రగారి అభిప్రాయం. 'జాతి వార్తలు క్రమంగా జన జీవన చిత్రీకరణలో ఛాయాచిత్రగ్రహణం, చలన చిత్ర గ్రహణం లాంటివి. స్థిర చిత్రాలను ఒకటి పరిచయం చేస్తే స్థిర చిత్రాలతో పాటు చలన చిత్రాలను గూడా మరొకటి ప్రదర్శించవచ్చు. జాతి ఒక అవస్థను వ్యక్తం చేసినట్లే వార్త ఒక వ్యవస్థను వివరిస్తుంది. ఈ రెండూ కవిత్వంలో ఎంత ముఖ్యమో వాటిని చమత్కారంగా వ్యక్తీకరించడం కూడా అంతకంటే ముఖ్యం' అని జి.వి.సుబ్రహ్మణ్యం గారు వివరించారు.

5.1.2.1 చాకిరేవు కావ్యంలోని వార్తా చిత్రణ

స్వరూప, స్వభావాలను వర్ణించడంలో రెండవ మెట్టు వార్త. సమాజంలోని ఒక వ్యవస్థా విశేషాన్ని వ్యంగ్య చమత్కారంగా వ్యాఖ్యానించి, తరవాతి తరాల వారికి సమకాలీన జీవన స్వభావాన్ని తెలియచేసేది వార్త.వార్త ద్వారా ఒకప్పటి సామాజిక విశేషాలు తెలిసే వెసులుబాటు ఉంది. ప్రజలు ఎలా జీవించే వారో,వారి ఆచార వ్యవహారాలు,వారు ధరించే వస్త్ర విశేషాలు, వారి అలవాట్లు మొదలైనవి వెలుగులోకి వస్తాయి. వ్యవసాయ అనుబంధ సేవలు, చేతి వృత్తులు గత రెండున్నర దశాబ్దాల్లో అవన్నీ కుదేలైపోయి గ్రామ ఆర్థిక సమీకరణాన్నే సమూలంగా మార్చేశాయి. నేటి కాలంలో చేతి వృత్తులు వారి దైన్యం చెప్పనలవి కాదు.

"పేడ తట్ట బట్టి పేరమ్మ రివ్వున
బాణమట్లు వచ్చి పడియెనచటబీ
ఈతయీనెత్రాడు చేత బట్టి చిదుకు
లటనె విడచి లచ్చువమ్మ వచ్చె" (చాకిరేవు: పద్యం 88: పుట 21) అప్పట్లో చేతి వృత్తుల గురించి పై పద్యం ద్వారా తెలియజేస్తున్నారు.గ్రామంలో ఒకరికి కష్టం వస్తే మిగిలినవారు ఎలా స్పందించేవారో కూడా వివరించారు.

"చూడుము నాదు కూలమును జవ్వికి వ్రేలు దుకూల డోలలో
నేడుచు చంటివాని" (చాకిరేవు: పద్యం 27: పుట 7) జువ్వి చెట్టుకు వస్త్రంతో కట్టిన ఊయలలో పిల్లవాడు ఏడుస్తున్నాడని చెప్పడం ద్వారా తమతో పాటు పిల్లల్ని పని ప్రదేశానికి తీసుకెళ్ళే శ్రామికులు ఎలా ఆ పిల్లల్ని చూసుకుంటూ తమ పని చేసుకునేవారో వర్ణించారు.ఇప్పటికీ కొన్ని చోట్ల చంటి పిల్లలను పని చేసుకునేవారు అలా చెట్టుకు చీరని ఉయ్యాల లాగా చేసి ఉంచడం కనిపిస్తుంది.

"పట్టుపీడ ద్రోచి పడతి మూతి బిగించి

బువ్వమీద వలువ మూతకట్టి " (చాకిరేవు: పద్యం 64: పుట 15) అన్నం గిన్నెపై వలువ అంటే వస్త్రాన్ని మూతలాగా కట్టిందట గంగమ్మ.

"అది యటులుండ,నన్నుకొను నాతడు లేదు జగాన,వచ్చిచా
వదుకద లాటరీ,దొరకవద్దని యంటిన లంకిబిందె?పో
యెద నరబీల దేశమన నెందుకు వద్దన లేదె?......" (చాకిరేవు: పద్యం 79: పుట 18)

డబ్బు సంపాదించడానికి ఉన్న మార్గాల గురించి చెప్తూ లాటరీ, లంకెబిందె, అరబ్ దేశాలకు వెళ్ళడం గురించి కవి ప్రస్తావించారు. ఒకప్పుడు ధనం దాచుకోవడానికి ఉపయోగించిన వాటిలో ఈ లంకెబిందెలు ఒకటి. అలా దాచుకున్న లంకెబిందెలు దొరికితే సులువుగా ధనం సొంతమైనట్టే. అలాగే లాటరీలో ప్రైజు వచ్చినా. తెలంగాణ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు వేల సంఖ్యలో ఉపాధి కోసం వలస వెళ్తుంటారు. ఇందులో ముఖ్యంగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి వెళ్ళేవారు ఎక్కువగా ఉంటారు. అక్కడకు వెళ్తే డబ్బు బాగా సంపాందించొచ్చనే భావనే వారిని ఆ దేశాలకు వలస వెళ్ళేలా ప్రేరేపిస్తోంది.

'లాటరీ రావడం లేదని, లంకబిందె దొరికితే వద్దంటానా, అరబ్ దేశం వెళ్దామంటే దగ్గర లేదు. భార్య కోసం డబ్బులు సంపాయించడానికి ఆమె చెప్పినట్టు రాజకీయాల్లోకి వెళ్ళడమే ఉపాయమని' రజకుని చేత చెప్పించి ఆనాటి పరిస్థితులను, వాస్తవ జీవనాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

"మగడెన్ని నాళులేనియు
మగువ దరింజేరకున్న,మారువలుకగా
తగదమ్మ! పలికెనా య
మ్మగువకు మొదలింటికీ ప్రమాదమువచ్చున్" (చాకిరేవు: పద్యం 102: పుట 24)

భర్త ఎంతకాలం భార్యకు దూరంగా ఉన్నా ఆమె ప్రశ్నించకూడదని, ఒకవేళ ప్రశ్నిస్తే మొదటికే ప్రమాదం వస్తుందని ప్రాసంగిక పాత్రల ద్వారా చెప్పించి పురుషాధిక్యాన్ని కవి ప్రశ్నించారు. అప్పట్లో స్త్రీలకు ప్రశ్నించడం అంతమంచిది కాదనే అభిప్రాయం ఉండేదని, సర్దుకు పోవడమే పరిష్కారంగా ఉందంటూ స్త్రీల దైన్యాన్ని తేటతెల్లం చేశారు.

"గాంధి జాడలేదు,కాని వింటిమి కదా?" (చాకిరేవు: పద్యం 50: పుట 12) కవి స్వాతంత్ర సమరం నడుస్తోన్న కాలంలో పుట్టడం వల్ల అప్పటి గాంధీ గురించిన ప్రస్తావన చేశారు.

"... పోవలయున్,

నీ ముల్లె సర్దుకొనుమట

గ్రామము వారెదురు చూడగా వలదు కదా?" (చాకిరేవు: పద్యం 156: పుట 36)

లాటరీలో ప్రైజు వచ్చిందని కరణం రజకుని పిల్లవాడికి చెప్పడం అతను తల్లిదండ్రులకు ఆ విషయాన్ని తెలియజేసి, లైబ్రరీ క్లర్కు కవియన్ త్వరగా రజకుణ్ణి వచ్చి కలవమని చెప్పాడంటాడు. ఆ సందర్భంలో గ్రామాధికారులు మన కోసం ఎదురుచూడకూడదు కదా అని శివయ్య అనడాన్ని బట్టి అధికారులకు ఇచ్చే ప్రాధాన్యం, వారి హోదా అర్థమవుతోంది.

"పదుదు పదుందు లెం "దనుచు బట్టల మూట భుజాననెట్టితా

గదలె; తదీయదార నమగారపు బిడ్డను చంకబెట్టి,స

మ్ముదమున బువ్వగంప తలమోపి,సతీవ్రతు వెంబడించె,

సుదతి గమించు పాదగతి జూచుచు కుర్రదు వెంబడింపగన్" (చాకిరేవు: పద్యం 161: పుట 37) అలా శివయ్య బట్టల మూట నెత్తిన పెట్టుకుని ముందు నడుస్తుండగా అతని వెనుక తలపై బువ్వగంపతో చంకన చంటిబిడ్డతో భార్య, ఆమె వెనుక పిల్లవాడు నడుస్తారు. లాటరీలో ప్రైజు వచ్చిందని చెప్పడానికి పిల్లవాడు వచ్చిన సందర్భంలో

"గుడిసెకు పోక యెకాయకి

బడి నుండియె పరుగుదీసి వచ్చితివ" (చాకిరేవు: పద్యం 154: పుట 36)

గుడిసెకు పోకుండా సరాసరి బడి నుండి చాకిరేవుకు వచ్చావా అని తల్లి ప్రశ్నిస్తుంది. ఒకప్పుడు రజకుల ఇళ్ళు ఊరి పొలిమేరల్లో ఉండేవి. అది ఇక్కడ తెలుస్తోంది.

5.1.3 చమత్కారం

చమత్కారం నవ్యార్థాలను కూర్చాలని ఆరుద్ర అభిప్రాయం. చమత్కారం అన్న పదానికి విస్మయం, నేర్పు అనే రెండు అర్థాలు నిఘంటువుల్లో కనబడుతాయని, బహుశా చేమకూర దృష్టిలో నేర్పు అంటే శ్లేష అని ఆరుద్ర వివరించారు.'అబ్బురమైన కొత్త విరుపులకు ఆస్కారముండే రచననే చేమకూర చమత్కారం కింద భావించారని' ఆరుద్రగారి అభిప్రాయం. జాతి,వార్తలలో అంతస్సూత్రంగా అభివ్యక్తమయ్యేది చమత్కారమని జి.వి.సుబ్రహ్మణ్యం గారు తెలియజేశారు. 'చమత్కారం శబ్దాలంకారం వల్ల గాని, అర్థాలంకారం వల్ల గాని, శ్లేషవల్లగాని, వక్రోక్తి వల్ల గాని కవిత్వంలో వ్యక్తం కావచ్చు. ఇటువంటి కవిత్వావిష్కారం జరిగినప్పుడే సామాజికమైన వాస్తవం సాహిత్య స్పృహలో సాక్షాత్కరిస్తుంది' అని జి.వి.సుబ్రహ్మణ్యం వివరించారు.

చమత్కారమన్నది కావ్యానికి రామణీయకతను దర్శింపచేసే కావ్యహేతువు. చమత్కార అభివ్యక్తి భిన్న రూపాల్లో స్పష్టమవుతుంది.

5.1.3.1 చాకిరేవు కావ్యంలోని చమత్కారం

చమత్కారం, ఛలోక్తి, విసురు, చెణుకు, హాస్యోక్తి మొదలగు రసస్ఫోరకాలన్నీ హాస్య రసానికి చెందినవే. సాహిత్యంలో ప్రతీ ప్రక్రియలోనూ హాస్యానికి, చమత్కారానికి ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉంది. జాతి వార్తలలో అంతస్సూత్రంగా అభివ్యక్తమయ్యేది చమత్కారం.

"నరమన : క్షాళనము తన తరము గాక

ఆలయము జొచ్చి విగ్రహమాయె కాదే?" (చాకిరేవు: పద్యం 2: పుట 1) మనుషుల మనస్సుల్లోని మాలిన్యాన్ని తొలగించడం దేవుని వల్ల కూడా కాకపోవడం వల్లే ఆలయంలో విగ్రహాకుడయ్యాడని వ్యంగ్యంగా చమత్కించారు.

"కన్నులుండి చూడనన్న వానికి నేమి

చూపగలడు తమ్మి చూలియైన" (చాకిరేవు: పద్యం 25: పుట 6) అంధులైన వారికి కనపడకపోతే వివరంగా చెప్పవచ్చు.కాని కళ్ళు ఉండి చూడను అనే వారికి ఆ బ్రహ్మ దేవుడైనా చూపలేదని అనడంతో చమత్కారం భాసిస్తుంది.

"అంత కంగారు పడనేల నయ్య మగడ

చేయి దిగదో రవిక?నీకె సిగ్గులేదొ?" (చాకిరేవు: పద్యం 37: పుట 9)

"క్రింది చూపె గాని పొందదు పై చూపు

వంగి దంచగలవు బండమీద" (చాకిరేవు: పద్యం 33: పుట 8) అకస్మాత్తుగా వీచిన వడగాలుల వేగానికి కంచాలు, బట్టలు ఎగిరిపోతుంటే రజక గృహిణి భర్తను కేక వేస్తుంది. బండ మీద వంగి దంచడమే కాని చుట్టూ ఏం జరుగుతుందో చూడడంటూ, అతను ఎగిరిపోతున్న వాటిని మూటకట్టి భార్య దగ్గరకు రాగా గుమస్తా గారి పెద్ద భార్య రవిక చేయి దిగడం లేదా అంటూ పరిహాసమాడుతుంది.

"వీడు చంక దిగడు,వాడు మాట వినడు

మస్తు పనులు నీకు దోస్తులిండ్ల" (చాకిరేవు: పద్యం 42: పుట 10) ఒక పక్క ఇంటి పనులు చూసుకుంటూ,మరోపక్క బట్టలు ఉతికే పనిలో భర్తకు సహాయం చేస్తూ అంతగా కష్టపడుతుంటే స్నేహితుల ఇళ్ళలో కాలక్షేపం చేస్తున్నాడని భర్తను ఆక్షేపించడాన్ని వర్ణించడంతో చమత్కారం స్ఫురిస్తోంది.

"తండ్రి గుడుముగొట్టు గుండ్రాయి యైనచో" (చాకిరేవు: పద్యం 44: పుట 10)

గృహభారంలో తన శ్రమే ఎక్కువని చెప్తూ ఏమీ పట్టించుకోవడం లేదంటూ భర్తను బెల్లం కొట్టే రాయితో పోల్చడంలో చమత్కారముంది. గంగమ్మ కొట్టకుండానే ఏడుస్తుంది, ఆమె నెత్తిపైన ఎప్పుడూ నీటి కుండ ఉంటుందని శివయ్య అచ్చం శివుడని పరాచకమాడితే

"తెచ్చి వండిపెట్టు తేకువ గల యాలు

కలుగువాడు శివుడు కాకపోడు" (చాకిరేవు: పద్యం 93: పుట 22) తెచ్చి వండిపెట్టే నేర్పు గల భార్య కలిగినవాడు శివుడు కాకపోతాడా అని లచ్చువమ్మ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంది.

"చేతకాని వాడు చెలగి సుద్దులు జెప్పు" (చాకిరేవు: పద్యం 70: పుట 16) పని చేయడం చేతకాని వాడే మాటలు చెప్తాడని చెప్పడంలో చమత్కారముంది.

"మోము విడువక ముద్దిడు ముంగురులను
వెలది ముంజేతులం ద్రోసి వెడల నడపు
నడచునెడ, వ్రాలు నెడ,లేచునెడల జారు
పైట పొగ రడచును కౌనుపైన జుట్టి" (చాకిరేవు: పద్యం 28: పుట 7) రజక గృహిణి నడుస్తోంటే ముంగురులు ఆమె ముఖాన్ని ముద్దాడుతుంటే వాటిని చేతులతో పక్కకు తోసి ముందుకు సాగుతోండగా పైట అటూ ఇటూ జరుగుతుండటంతో దాన్ని నడుమును చుట్టి పైట పొగరు అణిచిందని వర్ణించడంలో అభివ్యక్తి చమత్కారం భాసిస్తోంది.

"...రజకుపై రాజకీయమ్ము జేసె
నొక్క బాణము,నోకపత్ని తక్కనెరుగ
నన్న దాశరథి ...." (చాకిరేవు: పద్యం 20: పుట 5)

"దొరకక దొరకక రజకుడె
దొరికినె రామునకు మోపదుర్యశ" (చాకిరేవు : పద్యం 21: పుట 5)

పౌరాణిక ఇతివృత్తాన్ని పాఠకునికి గుర్తు చేయడం వల్ల కథన చమత్కారం కూడా ఉందని చెప్పవచ్చు.

"కాన,ధావకుల్ లేరు స్వర్గమ్ములోన
చీకటికిన్ మాటి కొక్కొక చీరమార్చు
నచ్చరల కెవ్వరుదుకుదురనిని,నదియ
వారి భోగించు పుణ్యుల భాగ్యమగును" (చాకిరేవు: పద్యం 6: పుట 2) భూలోకంలో ధావకులున్నారు. మరి స్వర్గంలో చీటికి మాటికి చీర మార్చే అప్సరసల వస్త్రాలు ఎవరు ఉతుకుతారు అనే సందేహాన్ని కలగజేస్తూ అది వారిని పొందే పుణ్యుల భాగ్యమవుతుందని చమత్కరించారు.

5.2 ఆలంకారిక చమత్కారం

"నీల మేఘ మొకటి నింగి వ్రేలె నెవరొ
ఆరగట్టి మరచినట్టి చీర
యనగ, నెగుర వేసికొని పోయె నంతట
చూచి చూచి గాలి చోరునట్లు" (చాకిరేవు: పద్యం 173: పుట 42)

ఆకాశంలో ఓ నీలి మేఘం ఆరవేసి మర్చిపోయిన చీరలాగా ఉండగా, దాన్ని చూసి గాలి దొంగలాగా ఆ మేఘాన్ని దొంగిలించుకుపోయిందన్న వర్ణనలో ఉపమాఅలంకార చమత్కారాన్ని ప్రయోగించారు. అలాంటిదే మరొక ప్రయోగం,

"విశ్వమమునకు భూమాత పెట్టుకొన్న
కష్ట సుఖముల దరఖాస్తు కాగితముల
వోలె పరచె విహంగముల్ వ్యోమసీమ
గమ్య మెరిగిన సందేశకారులట్లు" (చాకిరేవు: పద్యం 173: పుట 42) విశ్వమయునికి భూదేవి దరఖాస్తు చేసిన కష్టసుఖాల కాగితాల్లాగా ఆకాశమంతా పక్షులు నిండి ఉన్నాయని వర్ణించారు.

5.3 శబ్ద చమత్కారం

ఒక్కోసారి ఒకే శబ్దాన్ని పునరుక్తి చేయడం వల్ల గాని,లేదా వివిధ స్థానాల్లో వ్యతిరేకార్థంతో ప్రయోగించడం వల్ల శబ్ద చమత్కారాన్ని సాధించవచ్చు.

"చెట్టు చేమల కాకులు చేరి యరచె బీ
"దేవుడా! ఇవి బ్రదుకులు కావుకావు!
చత్తుమన్న పునర్జన్మ నిత్తువంట
నీవు మా రక్షకుండవు కావుకావు" (చాకిరేవు: పద్యం 170: పుట 40) పై పద్యంలో 'కావు కావు' శబ్దాన్ని ద్వంద్వార్థాలు వచ్చేలా ప్రయోగించారు. ఒకటి కాకులు చేసే ధ్వనిని సూచిస్తే రెండవది కాదు అనే అర్థం వచ్చేలా ఉంది.

"ధనము సుఖ సాధనము కాదు తన్వి" (చాకిరేవు: పద్యం 78: పుట 18) ఇక్కడ 'తన్వి' అన్న శబ్దానికి కృశించిపోయిన స్త్రీ అని అర్థం. ధనం సంపాందిచమని భార్య సలహా ఇచ్చినప్పుడు తృప్తి నీలోనే ఉంది చూసుకోమంటూ శివయ్య భార్యకు చెప్తాడు. ఆ ఆలోచనలతో ఆమె అలా ఉందన్న స్థితిని ఒక శబ్దం ద్వారా వ్యక్త పరచారు.

5.4 సామాజికాంశాలు

మానవుల జీవన విధానం, మానవుల సామూహిక స్థితినే సమాజం అంటారు. దీన్నే నిర్దిష్టమైన భౌతిక స్వరూపం కలిగిన వ్యక్తుల సముదాయం సమాజం అని కూడా అన్నారు. మానవుడు ప్రపంచాన్ని దర్శించడానికి చేసే ఆలోచనా క్రమమే చైతన్యం. ప్రపంచాన్ని దర్శించుకుంటూ, తనను తాను సంస్కరించుకోవడమే సామాజిక చైతన్యం.

చాకిరేవు కావ్యంలో మనిషిని చైతన్య పరిచి, జడత్వం వదిలించి మార్గ నిర్దేశం చేసే అంశాలు పుష్కలంగాఉన్నాయి. మానవత్వం కలిగి ఉండాలని, మంచి నడతను కలిగి మంచి మాటలు మాట్లాడాలని కవి ప్రబోధిస్తున్నారు. తన అనుభవసారాన్ని మనకందించి జీవితంలో మెలగాల్సిన తీరును అర్థమయ్యే విధంగా ఉదహరించారు.

మానవుల బుద్ధి చదివి చదివి మొద్దుబారిపోయిందని మంచి మనసు, మాట, మమత, నడత లేవని వాటి ఆవశ్యకతను వివరించారు.

"చదువు లేమి నేర్పె చట్టు బండలు,నర
బుద్ధి చదివి చదివి మొద్దుబారె,
మంచి మనసు లేదు, మంచి మాటలు లేవు
మంచి నడత లేదు, మమత లేదు" (చాకిరేవు: పద్యం 46: పుట 11)

స్త్రీ పురుష సంబంధాలను, వారి మధ్య రగిలే హెచ్చుతగ్గులనూ పరిశీలించి విమోచన మార్గాన్ని కవి సూచిస్తున్నారు.

"మగల వారల మను పొగరున్
మగువలమను వగలు కలుగ మానునపుడికన్
మగలుండ రాండ్రునుండరు
మగ మగువ యనంగ క్రొత్త మానిసిక వెలయున్" (చాకిరేవు: పద్యం 105: పుట 24)

సంసారం అంటే 'సమ–సారం'. భార్యా భర్తలిద్దరూ సమానులే. వారు కుటుంబమనే రథానికి రెండు చక్రాలలాంటి వారు. వివాహం మనశ్శరీర, స్నేహం మమేకమై ఆత్మబంధంగా పరిణామం చెందాలని కవిగారి బోధ.

"..వైవాహిక బంధమన్న తెరవాయది కాదు, మనశ్శరీ
ముల్ స్నేహమునన్ మమేకముయి నిల్చిన బంధమె యాత్మ బంధమౌ"
(చాకిరేవు: పద్యం 129: పుట 30)

సాధారణంగా కాయకష్టం చేసే శ్రామకులు ఉదయాన్నే సద్దిబువ్వ తిని పనికి ఉపక్రమిస్తారు. పని ముగించుకొని మధ్యాహ్నం వేళ దాటిన తర్వాత భోజనం చేస్తారు. ఆ అంశాన్ని స్ఫురింపజేస్తూ

"అనివాని నేలచైచున
తనిగని "ఇకనైన తినుము, తడవేమిటికా
యెను రెండు జాము"లని త్రో
సె నోదనము గిన్నె నతని చెంగట సతియున్" (చాకిరేవు: పద్యం 39: పుట9)

సమయం రెండు కావస్తున్నా శివయ్య భోజనం చేయకపోవడంతో గంగమ్మ అతనికి అన్నం పెట్టడం పైన చెప్పిన విషయానికి ఉదాహరణగా భావించవచ్చు.

గంగమ్మను ఆట పట్టిస్తూ శివయ్య 'రాజకీయాల్లోకి వెళ్తే నేను మంత్రినవడం ఖాయం. అప్పుడు నీ కాపురం గంగపాలవుతుంది. నీ బిడ్డలకు చాకిరేవే దిక్కు' అని అంటాడు. అతనలా ఆట పట్టించడానికి కారణ ధనం సంపాదించడానికి మార్గం వెదకమని భార్య సూచించడం. ధనం సుఖమివ్వదని చెప్తూ ఆమె అన్నట్టె రాజకీయాల్లోకి వెళ్తే అటుపైన పరిస్థితులను శిశయ్య ఈ విధంగా వివరిస్తున్నాడు.

"ధనము మీద నడుతు దారుణిపై కాదు
కనక వసములనె కొట్టుకొందు
వారి ద్రావ సీమవారుణినేగాని
ముట్ట పంచ భక్ష్యములనె గాని" (చాకిరేవు: పద్యం 81: పుట 19) ఒక హోదా వచ్చిన తర్వాత కొందరు ప్రవర్తించే తీరును పై పద్యం ద్వారా తెలియజేశారు. తమని తాము తక్కువుగా అనుకోవడం గురించి చెప్తూ..

"చాకలి యగువాడు చాకిరేవుకు రాక
ఢిల్లి పోవునేమి పిల్లదాన?" (చాకిరేవు: పద్యం 151: పుట 35) చాకలియైన వాడు చాకిరేవుకు రాకపోతే ఢిల్లీ వెళ్తాడా ఏమిటి అని భర్తతో చెప్పిస్తారు. ఇటువంటి సామాజికాంశాలు, చాకిరేవు కావ్యంలో పుష్కలంగా కనిసిస్తున్నాయి.

ఉపసంహారం

ఇప్పటి వరకు పలు కావ్యాల్లో ధీరోదాత్తులు, ధీర లలితులు, ధీర శాంతులు మొదలైనవారు కథా నాయకులుగా కనిపించారు. కానీ ఒక రజకుడు కథానాయకుడు అవడం, అతను చేసే వస్త్రధావన కర్మను కథా వస్తువుగా తీసుకుని కావ్యంగా మలచడం అద్భుతమైన విషయం. చాకిరేవు కావ్యంలో చాకిరేవును ప్రక్షాళన లక్ష్యానికి ప్రతీకగా తీసుకొని ఆది నుండి తుది వరకు గంభీరమైన తాత్విక భావసంపదతో, కవిగారి జీవన గమనంలోని అనుభవాల్ని జోడిస్తూ, జాతి జీవితాన్ని, పల్లెల్లోని సామాన్య మానవుని బతుకుబాటను నూతన తరాల వారికి వర్ణించి చెప్పడం కనిపిస్తుంది.

మొదటి అధ్యాయంలో కవిజీవిత విశేషాలను తెలిపి, కవిగారి ఇతర రచనలను గురించి రేఖామాత్రంగా వివరించాను.

రెండవ అధ్యాయంలో ఇతివృత్త నిర్వహణ గురించి, పాత్ర చిత్రణ, కావ్యంలో ప్రతిపాదించిన తాత్వికాంశాల గురించి వివరించాను.

మూడవ అధ్యాయంలో కవిదృక్పథాన్ని, నాలుగవ అధ్యాయంలో ఛందస్సు, భాషా విశేషాలను, అయిదవ అధ్యాయంలో జాతివార్తా చమత్కారాలను గురించి వివరించాను.

ఆలంకారికుల అభిప్రాయం ప్రకారం కావ్య ప్రయోజనం ఆనందం, ఉపదేశం. ఈ కావ్యం ద్వారా కవి రెండింటిని అందించారు. గంభీర తాత్విక చింతనను సులభ సూత్రీకరణ గావించారు. తేలికైన పదాలను ప్రయోగించారు. వివాహ బంధం గురించిన లోటుపాట్లను సహజరీతిలో వివరించారు. గ్రామీణ వాతావరణ చిత్రణ ఈ కావ్యంలో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి

1. ఆరుద్ర. 2007. **సమగ్రాంధ్ర సాహిత్యం (మూడవ సంపుటం)**. హైదరాబాదు: తెలుగు అకాడమి.
2. కొండయ్య, ఊట్ల. 1990. **చాకిరేవు.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
3. కొండయ్య, ఊట్ల. 1991. **నావలెన్(చాటువులు).** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
4. కొండయ్య, ఊట్ల. 1993. **నిర్వేదం.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
5. కొండయ్య, ఊట్ల. 1990. **ప్రకృతి – పురుషుడు.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
6. కొండయ్య, ఊట్ల. 1992. **మృత్యుమాత.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
7. కొండయ్య, ఊట్ల. 1993. **యుగయుగమ్ముల భారతీయుడను నేను.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
8. కొండయ్య, ఊట్ల. 1989. **వానవచ్చె – వరద వచ్చె.** హైదరాబాదు: మాధవి ప్రింటర్స్.
9. చంద్రశేఖరరెడ్డి, రాచపాళం. 1992 **ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు** హైదరాబాదు: తెలుగు అకాడమి.
10. చంద్రశేరరెడ్డి, రాచపాళెం, బ్రహ్మానంద, హెచ్.ఎస్. 2010. **సాహిత్య పరిశోధన సూత్రాలు**. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
11. చిన్నయసూరి పరవస్తు 2011 (పదవ ముద్రణ). **బాలవ్యారణ ఘంటాపథము.** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
12. జయప్రకాష్, ఎస్. 2011. **పరిశోధన విధానం.** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్స్.
13. పవన్‌కుమార్, పమ్మి. 2003. **కట్టా వరదరాజు ద్విపద రామాయణం భాషా పరిశీలన.** హైదరాబాదు.
14. భట్టుమూర్తి. 2008. **కావ్యాలంకార సంగ్రహము.** సికింద్రాబాద్: ఎమెస్కో ప్రచురణలు.
15. బాపురెడ్డి, జె. 1986. **పద్యకావ్యాలు.** హైదరాబాదు: జయం ప్రచురణలు.
16. నిత్యానందరావు, వెలుదండ. 2013. **విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.
17. రామకృష్ణమాచార్య, నండూరి. 1995. **పద్యశిల్పం.** విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషర్స్.
18. రామబ్రహ్మం, బేతవోలు జూన్ 2004. **వ్యాస గౌతమి.** యుఎస్ఎ: అ.జొ.వి.భో పబ్లికేషన్స్.
19. రామమోహన్‌రాయ్, కడియాల. 1982 **తెలుగు కవితా వికాసం** (1947–1980). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

20. లక్ష్మీకాంతం, పింగళి. 2007. **సాహిత్య శిల్ప సమీక్ష.** హైదరాబాదు:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

21. లూకానందం, జంగా. 1993. **చేమకూరవెంకటకవి సారంగధర** *చరిత్ర సమగ్ర సమీక్ష* గుంటూరు:రచయిత.

22. శ్రీరామరాజు, నడుపల్లి. 1983. **ఛందోవ్యాసావళి.** హైదరాబాదు: శ్రీ సత్యప్రచురణలు.

23. శ్రీరామరాజు, నడుపల్లి. 1983. **తెలుగులో ఛందో విశేషములు.** హైదరాబాదు: శ్రీ సత్యప్రచురణలు.

24. సంపత్కుమారాచార్య, కోవెల. 1977. **ఛంద:పదకోశం.** హైదరాబాదు: తెలుగు అకాడమీ.